

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

14-7-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 163 పేజీలు: 10+4 వెల: 6.50


బీహార్ ఓటర్లలో అత్యధికులు బంగ్లా, నేపాల్ వారులు

రాజ్యసభకు మరో నలుగురు ప్రముఖులు

5

## నేరు రాష్ట్రమంతా రేషన్ కార్డుల పంపిణి



### తుంగతుర్తిలో ప్రారంభించనున్న సిఎం రేవంత్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై13:** పేదలకు ఆహార భద్రత కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. అర్హులైన పేదలందరికీ తెల్ల రేషన్ కార్డులను నిరంతరం అందించే ప్రక్రియ ద్వారా ఎప్పటికప్పుడు కొత్త రేషన్ కార్డుల మంజూరుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల పంపిణీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. పౌర సరఫరాల మంత్రి ఉత్తమ్ >>2

## విలక్షణ నటుడు 'పద్మశ్రీ' కోట శ్రీనివాసరావు ఇకలేరు



### దీర్ఘ అస్వస్థతతో హైదరాబాద్‌లో కన్నుమూత

4 దశాబ్దాలుగా సినిమా రంగంలో విశేష ఖ్యాతి

9 సార్లు నంది అవార్డులు సాధించిన అసాధారణ నటుడు

తమిళం, కన్నడం, హిందీ రంగాల్లోనూ గుర్తింపు

ప్రధాని మోడీ, తెలుగు సిఎంలు రేవంత్, చంద్రబాబు, డి.సిఎం పవన్ కల్యాణ్, చిరంజీవి, సహా పలువురు ప్రముఖుల నివాళులు

అభిమానుల అశ్రుతర్పణం మధ్య ముగిసిన అంత్యక్రియలు

**హైదరాబాద్ (పంజగుట్ట), జూలై 13 (ప్రభాతవార్త):** విలక్షణ నటుడు, మాజీ శాసనసభ్యుడు కోట శ్రీనివాసరావు(83) ఆదివారం తెల్లవారుజామున ఫిలింనగర్ లోని నివాసంలో మృతిచెందారు. దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న కోట రెండు రోజుల క్రితమే 83 వ పుట్టిన రోజు జరుపుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కంకిపాడులో జన్మించిన కోట శ్రీనివాస రావు 1978లో ప్రాణంఖరీదు సినిమాతో సినీ ప్రయాణాన్ని ప్రారంభించారు. నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన సినిమా కెరియర్‌లో ఆయన 750 కి పైగా చిత్రాలలో నటించారు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషలలో >>2

# మహిళలకు పెద్దపీట



ఆదివారం లక్షెట్టిపేట బహిరంగ సభలో డి.సిఎం భట్టి, మంత్రులు దామోదర, జూపల్లి తదితరులు

### మహిళా సాధికారత కోసం ఎంత దూరమైనా వెళ్తాం

### ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా మహిళలకు సాయం

### ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమం

### ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టును చేపడతాం

### లక్షెట్టిపేట బహిరంగ సభలో డి.సిఎం భట్టి విక్రమార్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై13:** ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మైక్రో ఇండస్ట్రీస్ పెట్టి మహిళలు వ్యాపారాలు చేసుకునే కార్యక్రమాలు చేపడతాం, మహిళా సంఘాలకు సోలార్ విద్యుత్తు ఉత్పత్తి ప్రాజెక్టుల కేటాయింపుపై ప్రత్యేక దృష్టి సారించాం, మహిళా సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంత దూరమైనా వెళుతుంది, ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం మంచిర్యాల జిల్లాలక్షెట్టిపేట మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన అనంతరం భారీ బహిరంగ సభలో డిప్యూటీ సీఎం ప్రసంగించారు. జనాభాలో సగభాగమైన మహిళలకు గత కాంగ్రెస్ ప్రభుత్వాలు వడ్డీ లేని రుణాలు ఇవ్వగా పదేళ్లపాటు పరిపాలించిన బిఆర్ఎస్ వడ్డీ లేని రుణాల పథకాన్ని గాలికి వదిలేసింది, తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే వడ్డీ లేని రుణాల పథకం అన్నారు ప్రారంభించిందని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని మేము ప్రకటించినప్పుడు ఇది సాధ్యమా అని కొద్దిమంది అవహేళన చేశారు. కానీ మొదటి సంవత్సరంలోనే లక్ష్యానికి మించి రూ.21,600 కోట్ల వడ్డీలేని రుణం చెక్కులను మహిళా సంఘాలకు అందజేశామని తెలిపారు. ఈనెల 12 నుంచి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేస్తామని అందులో భాగంగా >>2

## వైభవంగా లష్కర్ బోనాలు



ఆదివారం మహంకాళికి పట్టువస్త్రాలు, బోనం తీసుకువస్తున్న సిఎం రేవంత్, మంత్రి సురేఖ

### అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన సిఎం రేవంత్

### బోనం సమర్పించిన మంత్రి కొండా సురేఖ

### ఆలయానికి వచ్చిన గవర్నర్ దత్తాత్రేయ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (బేగంపేట) జులై 13,ప్రభాతవార్త:** లష్కర్‌లో సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ ఆషాడ బోనాల జాతర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది.వేకువ ఝాము నుంచే బోన మెత్తిన మహిళలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు అమ్మ వారికి బోనాలు సమర్పించారు.రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తరుపున అమ్మ వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు.దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అమ్మ వారికి బోనం సమర్పించారు. ఆదివారం ఉదయం గం 4ల నుంచే అమ్మ వారి ఆలయంలో పూజలు ప్రారంభమయ్యాయి.ముందుగా ప్రభుత్వం తరుపున హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారికి తొలిబోనం సమర్పించారు.అనంతరం సాధారణ భక్తులకు అమ్మ వారి దర్శనానికి అనుమతించారు.ఉదయం గం 11.40లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమ్మ వారికి ఆలయానికి చేరుకున్నారు. సీఎం రాక సందర్భంగా అమ్మ వారి ఆలయం వద్ద హైదరాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేసారు.పటిష్టమైన భద్రత నడుమ ఆలయంలోకి చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.అర్చకులు సీఎం కు వేద ఆశీర్వచనాలు అందించారు.ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర >>2

## ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య

### మహిళా సిఐ వేధింపులే కారణం!



కడారి శ్రావణ్ (ఫైల్)

**చొప్పదండి, జూలై 13, ప్రభాతవార్త:** చొప్పదండి పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి కరీంనగర్ మహిళా పోలీస్ స్టేషన్ సిఐతోపాటు తన అత్తగారు వేధింపులు భరించలేకనే ఆత్మహత్య చేసుకుంటున్నానని సెల్ఫీ వీడియోలో మృతుడు కడారి శ్రావణ్ తెలిపాడు. వివరాల్లోకి వెళితే చొప్పదండి పట్టణానికి చెందిన కడారి విజయ నర్సింగ్గం దంపతులకుమారుడు కడారి శ్రావణ్ కుమార్ కరీంనగర్ రూరల్ తహసిల్దార్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్గా విధులను నిర్వర్తిస్తున్నాడు. ఈయనకు 2021 జూన్ 2న కరీంనగర్‌కు చెందిన బత్తుల నీలిమాతో వివాహం అయ్యింది బత్తుల నీలిమ ఆర్టీసీలో కండక్టర్‌గా విధులను నిర్వర్తిస్తుంది. వీరికి నాలుగు సంవత్సరాల పాప ఉంది. 2024 సంవత్సరంలో >>2

## అన్నమయ్య జిల్లాలో ఘోర ప్రమాదం

### లారీ బోల్తా: ఏడుగురు కార్మికులు మృతి

**కడప,జూలై 13:** అన్నమయ్య జిల్లాలో ఘోర రోడ్డుప్రమాదంజరిగింది. రెడ్డిపల్లె చెరువు కట్టపై లారీ బోల్తాపడి ఏడుగురు మృతిచెందారు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. సంఘటనను గమనించిన స్థానికులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. కొందరుకూలీలు మామిడికాయలు కోసేందుకు వచ్చి పనిపూరినతచేసుకుని కోసిన కాయలను మొత్తం లారీకి లోడ్‌చేసారు. ఇక వాటిని రైల్వేకోడూరుకు తీసుకెళ్లేందుకు బయలుదేరారు. ఈ క్రమంలో వారువెళుతున్న లారీ రెడ్డిపల్లె చెరువుకట్టపైకి రాగానే ఒక్కసారిగా అదుపుతప్పింది. దీనితోడ్రైవర్ నియంత్రణకోల్పోయి లారీ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీలో ఉన్న ఏడుగురు కూలీలు అక్కడికక్కడే మృతిచెందారు. మరో 8 మంది కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన స్థానిక ఆసుపత్రికి తరలించారు.



### ఆగస్టు మొదటి వారంలో

## నీట్ స్టేట్ కౌన్సెలింగ్

### ఇప్పటికే 43,400 మంది స్టేట్ ర్యాంక్‌లను ప్రకటించిన హెల్త్ వర్సిటీ

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో స్టేట్ నీట్ కౌన్సెలింగ్ ఆగస్టు మొదటి వారంలో ప్రారంభం కానుంది. ఈ నెల 21 నుంచి ఆలిండియా కోటా, డీమ్డ్ వర్సిటీలు, సెంట్రల్ యూనివర్సిటీలకు మొదటి విడత కౌన్సెలింగ్‌ను ప్రారంభించనున్నట్టు మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ(ఎంసిసి) ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో.. ఆగస్టు మొదటి వారంలో స్టేట్ నీట్ కౌన్సెలింగ్ ప్రారంభించే అవకాశం ఉంది. అయితే రాష్ట్రాలకు చెందిన కౌన్సెలింగ్‌ను ఈ నెల 30 నుంచి ఆగస్టు 6 వరకు పూర్తి చేయాలని ఎంసిసి సూచించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని మెడిలక్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీ ఈ నెలాఖరులో ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. ఎంబిబిఎస్, బిడిఎస్, బిఎస్‌సి నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశం కోసం నీట్ యూజీ-2025 కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఎంసిసి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నెల 21 నుంచి 30 వరకు ఆలిండియా కోటా, డీమ్డ్, సెంట్రల్ యూనివర్సిటీలు, రాష్ట్రం పరిధిలోని సీట్లలో చేరికకు సంబంధించిన మొదటి విడత కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ప్రకటించింది. మొత్తం మూడు రౌండ్లలో జరిగే నీట్ కౌన్సెలింగ్ ప్రక్రియ సెప్టెంబర్ 10వరకు కొనసాగనుంది. మొదటి విడత నీట్ స్టేట్ కౌన్సెలింగ్‌ను ఈ నెల 30 నుంచి ఆగస్టు 6 వరకు నిర్వ హిస్తారని ఎంపిసి ప్రకటించింది. మూడు రౌండ్ల నీట్ కౌన్సెలింగ్ సెప్టెంబర్ 18 వరకు కొనసాగనున్నట్టు ఎంసిపి షెడ్యూల్‌ను విడుదల చేసింది. సెప్టెంబర్ 1వ నుంచి ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభంకానున్నట్టు వెల్లడించింది. తెలంగాణ రాష్ట్రం నుంచి నీట్ యూజీ-2025 పరీక్షకి 70,258 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 43,400 మంది అర్హత సాదించినట్లు ఇప్పటికే కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఈ నెల 10న ప్రకటించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీలతోపాటు డీమ్డ్ యూనివర్సిటీ, కేంద్ర ప్రభుత్వ సంస్థలు కలిపి మొత్తం 64 మెడికల్ కాలేజీలున్నాయి. వాటిలో 34 రాష్ట్ర ప్రభుత్వ కాలేజీలు కాగా.. 28 ప్రైవేటు కాలేజీలు, మల్లారెడ్డి డీమ్డ్ యూని వర్సిటీ పేరిట 2 కాలేజీలు ఉండగా, ఈఎస్ఐ, >>2

## లండన్ ఎయిర్‌పోర్టులో కుప్పకూలిన చిన్న విమానం

టేకాఫ్ అయిన 4 సెకన్లకే పడిపోయింది 7



ఆదివారం తీన్మార్ మల్లన్న కార్యాలయంలో జాగృతి కార్యకర్తల దాడి, కాల్పులు జరుపుతున్న గన్‌మన్

### ఫర్నిచర్, అద్దాలు ధ్వంసం..

### పలువురికి తీవ్రగాయాలు

### ఆందోళనకారులు చొచ్చుకుపోవడంతో గాల్లోకి గన్‌మెన్ కాల్పులు

### నా మీద హత్యాయత్నమా?.. తేల్చుకుదాం: ఎమ్మెల్సీతీన్మార్ మల్లన్న

### మల్లన్నపై మండలి చైర్మన్, డిజిపి కార్యాలయంలో ఎమ్మెల్సీకవిత ఫిర్యాదు

## తీన్మార్ మల్లన్న కార్యాలయంపై 'జాగృత్తి' దాడి

**హైదరాబాద్ (మేడిపల్లి), జూలై 13 ప్రభాతవార్త:** ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌కుమార్ కార్యాలయంపై జాగృతి కార్యకర్తలు దాడికి తెగబడ్డారు. హైదరాబాద్‌లోని మేడిపల్లిలో ఆయన అక్కడ ఉన్నప్పుడే సుమారు ఇరవైమందికి పైగా ఆందోళనకారులు లోపలికి ఫర్నిచర్, అద్దాలు ధ్వంసం చేసి భీభత్సాన్ని సృష్టించారు. జాగృతి కండువాలు వేసుకున్న కొందరు సిబ్బందితో పాటు, ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. అద్దాలు, కుర్చీలు, బల్లలు విరిగొట్టారు. ఎమ్మెల్సీ కవితపై మల్లన్న చేసిన వ్యాఖ్యలకు నిరసనగా జాగృతి కార్యకర్తలు ఈ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో మల్లన్న కార్యాలయంలోనే ఉండడంతో గదిలో ఉంచి గన్‌మెన్లు రక్షణ కల్పించారు. భారీగా ఆందోళనకారులు చొచ్చుకుంటూ రావడంతో పరిస్థితి అదుపుతప్పింది. దీంతో గన్‌మెన్ గాల్లోకి ఐదు రౌండ్లు కాల్పులు చేయడంతో కొంత వెనక్కితగ్గారు. పగిలిన అద్దాల తో పలువురుకి తీవ్ర గాయలయ్యాయి. మల్లన్నకు సైతం చేతికి కూడా స్వల్ప గాయమైంది. కార్యాలయమంతా రక్తంతో తడిసింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో మల్కాజిగిరి డిసిపి పద్మజా ఘటనస్థలిని సందర్శించారు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, సీసీఫుటేజి ఆధారంగా ఆందోళనకారులను గుర్తించి చర్యలు చేపడుతామని తెలిపారు. దర్యాప్తును కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. కాగా ఎమ్మెల్సీ కవిత, తనకుటుంబం తనపై హత్యాయత్నానికి పాల్పడ్డారు.ఇలాంటి చర్యలతో బీసీ ఉద్యమం ఆగిపోతుందనుకుంటే >>2

## అన్నిరైలు బోగీల్లో ఇక సిసి కెమెరాలు


### అరాచకాలకు చెక్



**న్యూఢిల్లీ,జూలై 13:** రైళ్లలో తరచూ జరుగుతున్న దొంగతనాలు, దోపిడీలు, అరాచకాలు, హింసాత్మక కార్యకలాపాలను అరికట్టేందుకు సీసీటీవీ కెమేరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ప్రయోగాత్మకంగా కొన్ని రైళ్లలో ఏర్పాటు చేసి పరీక్షించింది. ఆ ప్రయోగం విజయవంతం కావడంతో రైల్వే అన్ని కోచ్‌లలో సీసీటీవీ కెమెరాలను స్థాపించాలని నిర్ణయించింది. ఈ చర్య ప్రయాణికుల భద్రతను గణనీయంగా మెరుగుపరుస్తుందని రైల్వే శాఖ భావిస్తోంది. దోపిడీ దొంగలు, క్రిమినల్ గ్యాంగ్స్ అమాయక ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని తరచుగా దోపిడీలకు పాల్పడుతున్న నేపథ్యంలో కెమేరాల ఏర్పాటు ఈ తరహా నేరాలను అదుపు చేస్తాయని భావిస్తోంది. ప్రయాణికుల గోప్యతను కాపాడేందుకు, సీసీటీవీ కెమెరాలను కోచ్‌లలోని సాధారణ కదలిక ప్రాంతాలైన ద్వారాల సమీపంలో ఏర్పాటు చేయనున్నట్టు రైల్వే శాఖ వెల్లడించింది. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, ఆ శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు, లోకోమోటివ్‌లు, కోచ్‌లలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు పురోగతిని సమీక్షించారు. ఈ సమావేశంలో రైల్వే బోర్డు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 360డిగ్రీ కవరేజ్ నార్తర్న్ రైల్వే లోకో ఇంజన్లు, కోచ్‌లలో నిర్వహించిన ప్రయోగాలు విజయవంతమైనట్లు రైల్వే అధికారులు తెలిపారు. దీంతో కేంద్ర రైల్వే మంత్రి 74,000 కోచ్‌లు, 15,000 లోకోమోటివ్ (ఇంజన్)లలో సీసీటీవీ కెమెరాలను స్థాపించేందుకు ఆమోదం తెలిపారు.

### అన్ని రాష్ట్రాల్లో చేపట్టేందుకు ఇసి సమాయత్తం

### బీహార్‌కు త్వరలోనే అసెంబ్లీ ఎన్నికలు




## వచ్చే నెల నుంచి ఓటర్ల జాబితా సవరణ

**న్యూఢిల్లీ, జూలై 13:** దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో వచ్చే ఆగస్టు నుంచి ఓటరు జాబితా సమగ్ర సవరణను చేపట్టేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సమాయత్తం అవుతోంది. ఇందుకోసం ఎక్కడికక్కడ ఎన్నికల యంత్రాంగాలను సిద్ధం చేస్తోంది. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బీహార్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ ఓటరు జాబితా సమగ్ర సవరణను మొదలుపెట్టేందుకు ఈసీ సన్నాహాలు చేస్తోంది. వివిధ రాష్ట్రాల చీఫ్ ఎలక్టోరల్ అధికారులు సీఈఓలు ఆయా రాష్ట్రాల్లో చివరిసారిగా ఓటరు జాబితా సమగ్ర సవరణ జరిగిన తర్వాత ప్రచురితమైన ఓటరు జాబితాలను బయటికి తీస్తున్నారు. వాటిని తమ అధికారిక వెబ్‌సైట్లలో అందుబాటులోకి తెస్తున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో 2008లో, ఉత్తరాఖండ్‌లో 2006లో చివరిసారిగా ఓటరు జాబితాల సవరణకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించారు. ఆయా సంవత్సరాల్లో ప్రచురించిన ఓటరు జాబితాలను ఢిల్లీ సీఈఓ, ఉత్తరాఖండ్ సీఈఓ అధికారిక వెబ్‌సైట్‌లలో ఇప్పుడు అందుబాటులోకి తెచ్చారు. ఈ ఏడాది అక్టోబరు నవంబరులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్‌లో చివరిసారిగా 2003లో ఓటరు జాబితా సమగ్ర సవరణ జరిగింది. ఆ ఏడాది ప్రచురితమైన >>2

## కార్యాలయంపై 'జాగృతి' దాడి

>> అది భ్రమే అవుతుందని మల్లన్న మండిపడ్డారు. కవిత అనుచరుల దాడిలో నా చేతికి గాయమైంది. నా గన్ మెన్ నుంచి తుపాకిని లాక్కొని కాల్పులు జరిపేందుకు యత్నించారన్నారు. ఈ తరహా దాడులు చేసినంత మాత్రాన బీసీలు, అణగారిన వర్గాలను అధికారంలోకి తీసుకొచ్చే ప్రయత్నం ఆగదని , ఇలాంటి వాటికి మేము భయపడమన్నారు. బీసీల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వంతో మేము పోరాడుతున్నాం.. మా సలహాలను స్వీకరిస్తుంది .పొరపాట్లు జరిగితే సరి చేసుకుంటాం. ఈ విషయంలో కవితకు ఎందుకు బాధ ? ఉనికి కోసం అయితే కేసీఆర్‌ని ప్రశ్నించాలి. కేటీఆర్, కెసిఆర్‌పై ఉన్న ఫ్రెస్టేషన్ మాపై చూపిస్తామంటే కుదరద న్నారు. సహచర ఎమ్మెల్సీపై దాడులు ప్రేరేపించిన కవిత ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని తీన్మార్ మల్లన్న డిమాండ్ చేశారు.

**తీన్మార్ మల్లన్నపై డిజిపి కార్యాలయంలో కవిత ఫిర్యాదు..**

తనపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎంఎల్‌సి తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ జాగృతి అ ధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత డిజిపి కార్యాలయంలో ఏఐజీ రమణకుమారీని కలిసి ఫిర్యాదు చేశారు. బిసిలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్కారు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై తమ సంస్థ నిర్వహించిన కార్యక్రమాన్ని తీన్మార్ మల్లన్న అవమానపరిచే విధంగా ప్రసారం చేయడంతో పాటు అసభ్యకర వ్యాఖ్యలు చేశారని వినతి పత్రం అందజేశారు. రమణకుమారీ సానుకూలంగా స్పందించారని, డీజీపీ దృష్టికి తీసుకవెళ్తానని తెలిపారు. తెలంగాణ సమాజంలో మహిళలకు అధిక ప్రాధాన్యం వుంటుందని, బిసి మహిళలకు మరింత ప్రాధాన్యత వుండగా తీన్మార్ మల్లన్న దీనిపై తన ఇష్టానుసారం వ్యాఖ్యలు చేయడం మహిళలందరినీ అవమానపరచడమేనన్నారు. దీనికి నిరసనగా తమ సంస్థ కార్యకర్తలు ఆదివారం ఉదయం మేడిపల్లిలోని క్యూ న్యూస్ ఛానల్ కార్యాలయం వద్ద ఆందోళన చేయగా మల్లన్న గన్‌మెన్‌లు గాలిలో కాల్పులు జరిపారని తెలిపారు. మహిళలపై అవమానకరంగా వ్యాఖ్యలు చేసిన మల్లన్నపై క్రిమినల్ కేసులు నమోదుచేసి వెంటనే అరెస్ట్ చేయాలని సిఎం రేవంత్‌రెడ్డి కోరారు.

## రాష్ట్రమంతా రేషన్ కార్డుల పంపిణి

>> కుమార్ రెడ్డి సమక్షంలో సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో రేషన్ కార్డుల పంపిణీని సిఎం ప్రారంభించనున్నారు. సోమవారం సాయంత్రం తిరుమలగిరి బహిరంగసభ వేదికగా లబ్ధిదారులకు రేషన్ కార్డులను సిఎం పంపిణీ చేయనున్నారు. తెలంగాణ రాష్ట్రంలో నూతన రేషన్ కార్డులు జారీ ప్రక్రియ ప్రారంభం కానుంది. రాష్ట్రంలో గత కొన్నేళ్లుగా కొత్త రేషన్ కార్డుల జారీ నిలిచిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త రేషన్ కార్డుల జారీ కోసం దరఖాస్తులను స్వీకరించింది. ఇదివరకే కొంతమందికి రేషన్ కార్డులను ప్రభుత్వం అందజేసింది. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా 3,58,187 కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.దీంతో అద నంగా 15,53,074 మంది లబ్దిదారులకు ప్రయోజనం చేకూరను న్నది. మొదటి దశలో సిఎం రేవంత్ రెడ్డి 2,03,156 కొత్త కార్డులు మంజూరు కార్యక్రమాన్ని నారాయణపేట జిల్లాలో ప్రారంభించిన విషయం తెలిసిందే. తుంగతుర్తి సభలో కొత్త రేషన్ కార్డుల జారీతో రాష్ట్రంలో రేషన్ కార్డుల సంఖ్య 89,95,282 నుంచి 95,56,625 కు చేరుకుంటుంది. లబ్ధిదారుల సంఖ్య 2,81,47,565 మంది నుంచి 3,09,30,911 మంది వరకు పెరుగుతుంది.

## నీట్ స్టేట్ కౌన్సెలింగ్

>> బీబీనగర్ ఎయిమ్స్ కేంద్ర ప్రభుత్వానికి సంబంధించినవి ఉన్నాయి. ఈ కాలేజీలు అన్నింటిలో కలిపి 9,065 ఎంబిబిఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. 34 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 4,080 సీట్లు ఉండగా.. వాటిలో 15 శాతం నేషనల్ పూల్ కోటా..అంటే 613 సీట్లు ఆలిండియా కోటా సీట్లుగా భర్తీ అవుతాయి. మిగిలిన 3,477 సీట్లు పూర్తిగా తెలంగాణ విద్యార్థులకే దక్కనున్నాయి. 26 ప్రైవేట్ కాలేజీల్లో 4,850 సీట్లు ఉన్నాయి. మల్లారెడ్డి యూనివర్సిటీకి చెందిన రెండు మెడికల్ కాలేజీలు అందులో ఒకటి మహిళా కాలేజ్‌గా కొనసాగుతోంది..రెండు కూడా డీమ్డ్ యూనివర్సిటీ కేటగిరీలో కొనసాగుతున్నాయి. ఈ రెండు కళాశాలల్లో కలిపి 400 సీట్లు ఉండగా, డీమ్డ్ యూనివర్సిటీ విభాగంలో కౌన్సెలింగ్ జరుగనుంది. ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోని 4,850 సీట్లలో 50 %కన్వీనర్ కోటా తెలంగాణ విద్యార్థులకే దక్కు తాయి. మరో 50 శాతం సీట్లలో 35 శాతం సీట్లు బి కేటగిరి సీట్లు కాగా.. మరో 15 శాతం సీట్లు సి కేటగిరిలో ఎన్ఆర్ఐ కోటాలో భర్తీ చేస్తారు.

## మహిళలకు పెద్దపీట

>> ఆదివారం మంచిర్యాలలో వడ్డీ లేని రుణం చెక్కులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలకు భద్రత, మహిళా సంఘాలకు రుణ సదుపాయం కల్పించి వారితో బస్సులు కొనుగోలు చేయించి ఆర్టీసీకి అద్దెకు ఇప్పించినట్టు తెలిపారు. మొత్తం 600 బస్సులు ఇప్పించే కార్యక్రమంలో భాగంగా ఇప్పటికీ 150 బస్సులలో ఆర్టీసీకి అనుసంధానం చేసి లీజు మొత్తం కోటి రూపాయల చెక్కును ఇటీవల ఆర్టీసీ నుంచి మహిళా సంఘాలకు అందజేశామని డిప్యూటీ సీఎం తెలిపారు. మిగిలిన 450 బస్సులను త్వరలో ఆర్టీసీకి లీజుకు ఇప్పిస్తామని అన్నారు. మహిళా సంఘాలతో క్యాంటీన్‌లో, పెట్రోల్ బంకులు, ప్రతి ప్రాంతాల్లో వ్యాపారాలు చేసుకోవడానికి స్థలాలు ఇచ్చామని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మైక్రో ఇండస్ట్రీస్ పెట్టుకొని మహిళలు వ్యాపారాలు చేసుకునే కార్యక్రమాలు చేపట్టినట్టు డిప్యూటీ సీఎం వివరించారు. సాధారణ ఎన్నికల ముందు ఆదిలాబాద్ జిల్లాకు ఏఐసిసి అధ్యక్షుడు ఖర్గే వచ్చినప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది మేము అడిగిన పనులు చేయాలని జిల్లా ప్రజలు,కాంగ్రెస్ నాయకులు కోరిన విషయాన్ని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు యావత్ క్యాబినెట్ ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లా అభివృద్ధికి దృష్టి సారిస్తామని తెలియజేశారు. ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమం తీసుకునే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని, బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును చేపడతామని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం తెలిపారు. ఆనాడు రాష్ట్రంలోని రాచరిక పాలనలో, రాష్ట్ర మొత్తం దోపిడీ జరుగుతుంటే టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఎదిరించి ప్రజాస్వామ్యంతో కూడిన పాలనను తీసుకురావడంలో ఆదిలాబాద్ జిల్లా ప్రజల పాత్ర మరువలేనిది అన్నారు. గుట్ట నిండా లక్ష మంది పైగా ప్రజలు తరలిరావడం చూస్తుంటే ఆశ్చర్యమేస్తుంది, ప్రజల గుండెల్లో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు స్థానం పదిలం చేసుకున్నారని ఈ జన సందోహాన్ని చూస్తుంటే స్పష్టం అవుతుంది అన్నారు. ప్రేమ్‌సాగర్ రావు నిండు నూరేళ్లు జీవించాలని వెనుకబడిన ప్రాంతమైన మంచిర్యాల జిల్లా అభివృద్ధికి వారి సేవలు అవసరమని డిప్యూటీ సీఎం తెలిపారు. సంక్షేమ పథకాలకు అదనంగా 55వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. పేద విద్యార్థులకు ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో విద్యను బోధించేందుకు యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్ స్థాపిస్తున్నాం, రైతులకు పెట్టుబడి సాయం, ఉద్యోగాలు రాని వారికి స్వయం ఉపాధి పథకాలు తీసుకువస్తున్నట్టు తెలిపారు.గతంలో అటవీ అధికారులతో ఇబ్బందులు పడిన గిరిజనులు వారి భూములు సాగు చేసుకునేందుకు ఇందిరా సౌర గిరిజల వికాసం పథకాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందని తెలిపారు.ఈ పథకం కింద ఉచితంగా సోలార్ పంపుసెట్లు, స్ప్రింక్లర్లు, డ్రిప్పు, ఉద్యాన శాఖ ద్వారా ఉచితంగా అవకాడో వెదురు వంటి మొక్కలను పంపిణీ చేస్తామని చెప్పారు. ప్రజా ప్రభుత్వం మనందరికీ రూపాయి రూపాయి పోగుచేసి ప్రజల కోసమే ఖర్చు పెడతామని తెలిపారు.



ఆదివారం హైదరాబాద్‌లో కోట శ్రీనివాసరావు భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎపి సిఎం చంద్రబాబు, మంత్రికోమటిరెడ్డి, ఎపి డి.సిఎం పవన్, మెగాస్టార్ చిరంజీవి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

# కోట శ్రీనివాసరావు ఇకలేరు

>> విలన్,కామెడీ, క్యారక్టర్ ఆర్టిస్ట్‌గా ఆయన చేసిన పాత్రలు ప్రేక్షకులను అలరించాయి. అహనాపెళ్ళంట, ప్రతిఘటన, ఖైదీనంబర్ 786,శివ,యమలీల,గబ్బర్‌సింగ్ లాంటి చిత్రాలలో ఆయన తన నటనతో ఆయా సినిమాలకే హైలెట్‌గా నిలిచారు. 2015 సంవత్సరంలో భారత ప్రభుత్వం కోట ప్రతిభను గుర్తించి పద్మశ్రీ అవార్డు ప్రధానం చేసింది. అలాగే 9 నంది అవార్డులను ఆయన పొందారు.కోట నటనలో చూపిన నైపుణ్యం, పాత్రలలో సజీవత అభిమానులను ఎంతగానో ప్రభావితం చేసింది.రాజకీయ రంగంలో కూడా ఆయన తన విశిష్ట ముద్రను వేశారు.1999 నుంచి 2004 వరకు విజయవాడ ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి బీజేపీ ఎమ్మెల్యేగా సేవలందించారు.

**టాలీవుడ్‌లో ఆయనో బ్రాండ్...**

కోట శ్రీనివాసరావు టాలీవుడ్‌లో నటనకు ఓ బ్రాండ్ అని చెప్పవచ్చు. నటించేవారు ఎంతమంది ఉన్నా నటనలో జీవించేవారిలో కోట కూడా ఒకరని చెప్పాలి. ఆయన తనకు ఇచ్చిన పాత్రలో నటించడమే కాకుండా జీవించేవారని పలువురు దర్శకులు వ్యాఖ్యానించారు. కెమరామెన్ గంగతో రాంబాబు సినిమాలో కోట శ్రీనివాసరావు పక్షవాతం వచ్చిన వాడిలా నటించిన విధానం చూసిన వారు ఎవరైనా షాక్ అవ్వాల్సిందే.ఎందుకంటే ఆయన ఆ పాత్రలో కనిపించిన విధానం అంత వాస్తవికంగా ఉంటుంది. నటించడంతో పాటు పాత్రలను బట్టి డైలాగ్ చెప్పే విధానం కోటకు ప్రత్యేక శైలి కలిగి ఉంటుంది.

ఇవన్నీ కలిపే ఆయనను టాలీవుడ్‌లో ఒక విలక్షణ నటుడిగా నిలబెట్టాయి. తెలుగులో ఆయన చివరిగా 2023లో విడుదలైన సువర్ణ సుందరి అనే చిత్రంలో కనిపించారు. కోట శ్రీనివాసరావు తమిళంలో 30 కి పైగాచిత్రాలలో నటించగా, హిందీలో 10, కన్నడంలో 8,మలయాళం,దక్కన్ భాషలో ఒక్కో చిత్రంలో నటించారు. అంతేకాదు కొన్ని చిత్రాలలో పాటలు పాడి ప్రేక్షకులను రంజింపజేశారు....

**ప్రముఖుల సంతాపం..**

కోట శ్రీనివాసరావు ఆకస్మిక మృతి పట్ల తెలుగు రాష్ట్రాలలోని పలువురు ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఎపీ,తెలంగాణ సీయంలు నారా చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీయం పవన్ కళ్యాణ్, మంత్రతి నారా లోకేష్, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఇరు రాష్ట్రాలకు చెందిన కేబినెట్ మంత్రులతో పాటు సినీ ప్రముఖులు చిరంజీవి, బాలక్రిష్ణ, నాగార్జున, వెంకటేష్, మోహన్‌బాబు, రాజేంద్రప్రసాద్‌తో పాటు సినీ రంగం యావత్తూ కోట భౌతిక కాయాన్ని దర్శించుకుని ఆయనతో తాము నటించిన సందర్భాలను గుర్తుకు చేసుకున్నారు. ప్రముఖ కమెడియన్ బ్రహ్మానందం అయితే కోట భౌతిక కాయాన్ని దర్శించుకుని తీవ్ర దుఖంలో మునిగిపోయారు. అక్కడే విలపిస్తూ చాలాసేపు మౌనంగా నిల్చుండిపోయారు.

**ఎపి సిఎం చంద్రబాబు ఘన నివాళి..**

కోట శ్రీనివాసరావు భౌతికకాయాన్ని ఏపీ సీయం చంద్రబాబునాయుడు సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కోట చిత్ర పరిశ్రమకు చేసిన సేవలను కొనియాడారు.కోట శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

**పవన్ కళ్యాణ్ ఘన నివాళి..**

ఏపీ డిప్యూటీ సీయం పవన్ కళ్యాణ్ కోట శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కోట తన అన్న సినిమా ప్రాణం ఖరీదు సినిమాతో అరంగేట్రం చేసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.

**అభిమానులు, సన్నిహితులతో నిండిపోయిన ఫిలింనగర్..**

కోట శ్రీనివాసరావు మరణ వార్త ఆదివారం ఉదయం తెలియగానే ఆయన అభిమానులు, సన్నిహితులు, పరిశ్రమకులు చెందిన వారు ఉదయం నుంచే తండోపతండాలుగా ఆయన నివాసానికి చేరుకుని తీవ్ర విషాదంలో మునిగిపోయారు. లెజండరీ యాక్టర్ అంటూ సినీ ప్రముఖులు కీర్తిస్తూ ఆయన చేసిన మరుపురాని పాత్రలను గుర్తుకు చేసుకున్నారు. ముఖ్యంగా సినీ,రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులు చాలామంది స్వయంగా కోట భౌతిక కాయాన్ని సందర్శించుకుని చివరిసారిగా తమ అభిమాన నటుడుకి ఘన నివాళి అర్పించుకున్నారు. అభిమానులు, స్నేహితులు, కుటుంబ సభ్యుల అశ్రునయనాల మధ్య ఆదివారం సాయంత్రం కోట శ్రీనివాసరావు అంత్యక్రియలు మహాప్రస్థానంలో ముగిశాయి.

**విలక్షణ వ్యక్తిత్వం..సరదా మనిషి..వర్క్‌లో సిన్సియర్..**

కోట శ్రీనివాసరావుది విలక్షణ వ్యక్తిత్వంగా ఆయన మనసెరిగిన వారు చెబుతుంటారు.పనిలో ప్రత్యేక ధ్యాస, పనితర్వాతే ఏదైనా అనే మనిషి.సమయ పాలన, తోటి వారి పట్ల వాత్సల్యం..కాస్తంత సరదా మనిషి కూడా అని ఆయన సహచరులు చెబుతుంటారు. సెట్‌లోకి వచ్చాడంటే పాత్ర గురించి క్షుణ్ణంగా ఆకలింపు చేసుకుని తనదైన శైలిలో పాత్రను పండించడం ఆయన ప్రత్యేకత. ఒకోసారి డైరక్టర్‌లు కూడా ఆయన నటనా చాతుర్యానికి అబ్బురపడేవారు.

పాత్ర డిమాండ్‌ను బట్టి డైలాగ్ డెలివరీలో మేనరిజంను ఆయనే సెట్ చేసుకునే వారు. గత నాలుగు దశాబ్ధాలుగా విలనిజంలో కానీ, కామెడిని పండించడంలోకానీ, క్యారక్టర్ పరంగా ఆయనకు ఆయనే సాటిగా సినీ జీవితంలలో విరాజిల్లారు. ముఖ్యంగా కోట శ్రీనివాసరావు, బాబూమోహన్ కాంబినేషన్ తెలుగునాట ఇప్పటికీ ఆయా పాత్రలు చక్కర్లు కొడుతూనే ఉన్నాయి. మామగారు సినిమాలో కోట, బాబూమోహన్ జంట చేసిన కామెడీ ఎప్పటికీ మరుపురాని దృశ్యాలే. అదేవిధంగా అతడు సినిమాలో హీరో మహేష్‌బబాబుతో పొలిటికల్ కన్ఫ్యషన్ లేదా అని చెప్పే డైలాగ్ అందరి మెదళ్ళలో నానుతూ ఉంటుంది.

అహనాపెళ్ళంటలో ఆయన చేసిన పిసినారి పాత్ర ఎప్పటికీ అజరామరమే. అత్తకు యముడు అమ్మాయికి మొగుడు సినిమాలో అలనాటి నటి వాణిశ్రీతో కాంబినేషన్ అబ్బురపరిచే విధంగా ఉంటుంది. సీనియర్ హీరోలకు పోటీగా విలనిజాన్ని పండించి అందరిచేత శహభాష్ అనిపించుకున్నారు.సీనియర్‌ల పట్ల గౌరవం, తోటి నటుల పట్ల వాత్సల్యం ఆయనను మేటి నటుడిగానే కాకుండా అందరి వాడిగా నిలబెట్టిందని చెప్పవచ్చు.

**రాజకీయాల్లో రాణింపు...**

సినీ నటుడిగా విజయవంతంగా కెరీర్ సాగుతున్న సమయంలోనే రాజకీయాల్లో కూడా రాణించారు. పోటీచేసిన మొదటి ఎన్నికల్లోనే విజయవాడ నగరంలో పోటీచేసి విజయం సాధించారు. అయితే తర్వాత రాజకీయాలలో కొనసాగడం ఇష్టం లేక తనకిష్టమయిన సినీ రంగంలోనే కెరీర్‌ను కంటిన్యూ చేశారు. సినిమాలలో విలన్ పాత్రలు ఎక్కువగా చేసినా నిజ జీవితంలో మాత్రం విలువలకు కట్టుబడి ఉండేవారని ఆయన సన్నిహితులు చెబుతుంటారు.

కొత్తవారిని ప్రోత్సహించడంలో కానీ, పేద కళాకారులను ఆదుకోవడంలో కానీ ఆయన ఎపుడూ ముందుండేవారు. గుప్త దానాలకు ఆయన ఎక్కువగా ప్రాధాన్యం ఇచ్చేవారని ఆయన సన్నిహితులు చెబుతుంటారు. కొత్తగా సిని మాలు నిర్మించే నిర్మాతలకు సరైన సలహాలు ఇస్తూ నష్టపోకుండా సూచనలు ఇచ్చేవారని ఆయనను కడసారి చూడడానికి వచ్చిన పలువురు ప్రముఖులు చర్చించుకున్నారు. ఏది ఏమైనా కళామతల్లికి ఇష్టమైన మరో అధ్భుత నటుడు కనుమరుగు కావడం తెలుగు తెరకు తీరని లోటని చెప్పాలి.

## వారం - వర్జ్యం

14-07-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
చవితి రా.11.58
ధనిష్ఠ ఉ.6.58
వర్జ్యం : మ.1.53-3.28
దు.మ.12.40-1.32, 2) మ.3.16-4.08
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** బంధువుల నుండి ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఉద్యోగాలకు స్వల్పధనలాభం పొందుతారు.

**వృషభం :** సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. మంచికి వెళితే చెడు ఎదురయ్యే అవకాశాలున్నాయి.

**మిథునం:** సంతానం నాకు నూతన విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.కుటుంబ సభ్యుల నుండి సహాయ సహకారాలు అందు కొంటారు.

**కర్కాటకం:** అనవసర వివాదాలు పోతాయి. శత్రువులు సమస్యలు సృష్టించినా అధిగమిస్తారు.

**సింహం:** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. రుణబాధలు ఎక్కువై చికాకుపెడతాయి.

**కన్య :** దూరపు బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**తుల :** మాటకు విలువ పెరుగుతుంది. కొత్త విద్యలపట్ల ఆసక్తి చూపుతారు.

**వృశ్చికం:** కుటుంబసభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడతారు.

**ధనుస్సు:** అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడతారు.

**మకరం:** ఆరోగ్య సమస్యలు ఎదురైన ఆత్మస్థైర్యంతో అధిగమిస్తారు. వాహనాలు, స్థలాలు కొనుగోలు యత్నాలు నిదానంగా సాగుతాయి.

**కుంభం:** శత్రువులు సైతం మిత్రులుగా మారుతారు. ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. వాహనసౌఖ్యం.

**మీనం :** కొన్ని అపవాదులు భరించాల్సి వుంటుంది. ముఖ్యమైన పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## వైభవంగా లష్కర్ బోనాలు

>> రెవెన్యూ ,గృహ నిర్మాణా,సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి,దేవాదాయ,అటవీశాఖ మంత్రి కొండా సురేఖ,పంచాయితీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క),సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి లు రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్,అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు శ్రీగణేష్,దానం నాగేందర్ తదితరులు అమ్మ వారిని దర్శించుకున్నారు.రాష్ట్ర ప్రజలందరికీ మంచి జరగాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమ్మ వారిని ప్రార్ధించారు.ఆలయ ప్రాంగణంలో మేళం వాయించే బృందం ముఖ్యమంత్రి ని ఫోటో అడగడంతో వారి కోరిక మేరకు వారితో కల్సి ఫోటో దిగారు.అనంతరం ఆలయం నుంచి వెలుపలికి వచ్చిన ముఖ్యమంత్రి వాహనమెక్కి నిలబడి ఆలయ ఆవరణలో ఉన్న భక్తుల చేతులను తాకుతూ వారు ఇచ్చిన శాలువాలను తీసుకుంటూ భక్తులను ఉత్సాహ పరుస్తూ ముందుకు సాగారు.

**ముఖ్యమంత్రి పట్టు వస్త్రాలు...మంత్రి కొండా బంగారు బోనం.పొన్నం తొలిబోనం....**

సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆషాడ బోనాల జాతరకు వచ్చిన ముఖ్యమంత్రి శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారికి ప్రభుత్వం తరుపున పట్టు వస్త్రాలు సమర్పించగా,దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ బంగారు బోనం సమర్పించారు.ఆషాడ బోనాల జాతర సందర్భంగా తెల్లవారుఝామున అమ్మ వారికి మహా మంగళ హారతి ఇచ్చారు.అనంతరం హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు అమ్మ వారికి తొలిబోనం సమర్పించారు.అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ఈ ఓ గుత్తా మనోహర్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అమ్మ వారి ప్రసాదాన్ని అందజేసారు.రాష్ట్ర ప్రజలకు మంత్రి పొన్నం బోనాల ఉత్సవాల శుభాకాంక్షలు తెలియజేసారు.రాష్ట్ర వ్యాప్తంగా సకాలంలో మంచి వర్షాలు కురిసి పాడి పంటలతో రైతులంతా సుభిక్షంగ ఉండాలని అమ్మ వారిని ప్రార్థించామన్నారు.

**6క్యూలైన్ల ఏర్పాటు...**

శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆషాడ బోనాల జాతర సందర్భంగా అధికారులు 6క్యూలైన్లను అధికారులు ఏర్పాటు చేసారు.లష్కర్ బోనాలంటే నే భక్తులు తండోప తండాలుగా అమ్మ వారి ఆలయానికి బోనాలతో తరలి వస్తారు.దీంతో వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి వచ్చే అన్ని దారులు భక్త జనంతో నిండిపోయాయి.అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు పలు దేశాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.ఆలయ ఆవరణలో పోతురాజుల విన్యాసాలు,శివసత్తుల నృత్యాలు,తొట్టెలు,ఫలహారం బండ్ల ఊరేగింపు కోలాహలంగా సాగింది.భక్తులు అమ్మ వారికి భక్తులు బోనాలు సమర్పించారు.ఆదివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.అమ్మ వారికి నైవేద్యం పెట్టి బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.పోతురాజుల నృత్యాలు,పులివేషధారణ,డప్పు చప్పుళ్లు,గుస్సాడీ కళాకారుల చప్పుళ్లతో అమ్మ వారి ఆలయ ప్రాంగణాన్ని మొత్తం వివిధ రకాలైన పూలు వివిధ రకాలైన పండ్లతో అందంగా అలంకరించారు. మహాకాళీ అమ్మ వారి ని ఆదివారం వివిధ రాజకీయ పార్టీలకు చెందిన పలువురు రాజకీయ ప్రముఖులు దర్శించుకున్నారు.వారిలో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ,కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి దంపతులు,ఎంపీలు ఈటెల రాజేందర్,అనిల్‌కుమార్ యాదవ్,సాంస్కృతిక సారధి ఛైర్మన్ వెన్నెల గద్దర్,సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్,సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్,మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అమ్మ వారిని దర్శించుకుని బోనం సమర్పించారు.మాజీ పార్లమెంట్ సభ్యులు వి.హనుమంతరావు,హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన,దేవదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజా రామయ్యర్,మహిళా కమీషన్ ఛైర్ పర్సన్ నేరెళ్ల శారద,సింగర్ మంగ్లీ తదితరులు అమ్మ వారిని దర్శించుకున్నారు.

**నేడు రంగం (భవిష్యవాణి),అంబారీపై అమ్మవారి ఊరేగింపు...**

ఆషాడ బోనాల జాతరలో రెండవ రోజు సోమవారం శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయంలో రంగం (భవిష్యవాణీ) , కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. అమ్మ వారి ఆలయంలో నిర్వహించే రంగం కార్యక్రమం లో ఒక అవివాహిత మహిళ అయిన జోగిని స్వర్ణలత అమ్మ వారికి ఎదురుగా ముఖానికి పసుపు పూసుకుని పచ్చికుండపై నిలబడి అమ్మ వారిని ఆవాహనం చేసుకుని ప్రజలకు భవిష్యవాణి వినిపిస్తారు. ఈ సమయంలో వివిధ రకాలైన వాయిద్యాల జోరుతో అమ్మ వారిని ఆవాహనం చేసుకున్న అవివాహిత మహిళ రంగంలో చెప్పిన ప్రతిమాట నిజమవుతుందని భక్తుల విశ్వాసం.ఈ రంగంలో ఈ ఏడాదిలో పరిస్థితులు ఎలా ఉంటాయన్నది రంగంలో అమ్మ వారు వెల్లడిస్తుందనేది భక్తుల ప్రగాఢ విశ్వాసం.

## వచ్చే నెల నుంచి ఓటర్ల జాబితా సవరణ

>> ఓటరు జాబితాలోని సమాచారం ఆధారంగానే ఇప్పుడు బిహార్‌లో ఓటరు జాబితా సమగ్ర సవరణ జరగబోతోంది. ఓటరు జాబితా సమగ్ర సవరణను ఈసీ చేపట్టడం అనేది రాజ్యాంగబద్ధమైన అంశమేనని, బీహార్‌లో ఆ ప్రక్రియను నిర్వహించొచ్చని గతవారం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. అయితే దేశవ్యాప్తంగా ఈ డ్రైవ్‌ను చేపట్టే అంశంపై జులై 28 తర్వాతే ఈసీ తుది నిర్ణయాన్ని తీసుకుంటుందని అధికార వర్గాలు అంటున్నాయి. ఎందుకంటే అకస్మాత్తుగా బీహార్‌లో ఎస్ఐఆర్ డ్రైవ్‌ను నిర్వహించడం వల్ల ఎంతోమంది ఓటుహక్కును కోల్పోతారంటూ దాఖలైన పిటిషన్లపై ఆ తేదీన మరోసారి దేశ సర్వోన్నత న్యాయస్థానంలో వాదనలు జరగనున్నాయి. జన్మస్థలం ఆధారంగా విదేశాలకు చెందిన అక్రమ వలసదారుల పేర్లను దేశంలోని ఓటరు జాబితాల నుంచి తొలగిస్తామని కేంద్రం ఎన్నికల సంఘం అంటోంది. ప్రత్యేకించి వివిధ రాష్ట్రాల్లో బంగ్లాదేశ్, మయన్మార్ వలసదారులు ఓటు హక్కు పొందారని అంటున్నారు. అలాంటి వారి పేర్లను ఓటరు లిస్టుల నుంచి తొలగించనున్నారు. కాగా, ఈ ఏడాది చివర్లో బీహార్‌లో, వచ్చే సంవత్సరం అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 అనేది 18 ఏళ్లకు పైబడిన ప్రతీ భారతీయుడికి ఓటు హక్కు ఉందని తెలిపింది. అంటే ఓటు హక్కు పొందే వ్యక్తి తప్పకుండా భారతీయుడే అయి ఉండాలి. ఓటరు జాబితాలో కేవలం భారతీయ పౌరుల పేర్లే ఉండేలా చూడటం తమ బాధ్యత అని కేంద్ర ఎన్నికల సంఘం వాదిస్తోంది. ఇందుకోసం క్రమం తప్పకుండా ఓటరు జాబితాల సమగ్ర సవరణ చేయాల్సి ఉంటుందని అంటోంది. అయితే అకస్మాత్తుగా అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందు బీహార్‌లో ఈ ప్రక్రియను ఈసీ చేపట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పలువురు సుప్రీంకోర్టులో పిటిషన్లు వేశారు. ఓటు హక్కు కోసం వివిధ డాక్యుమెంట్లను జులై 25లోగా బూత్ లెవల్ అధికారులకు సమర్పించాలంటూ జులై 6న ఈసీ చేసిన ప్రకటనను పిటిషనర్లు తప్పుపట్టారు. ఆయా డాక్యుమెంట్లను సమర్పించలేని వారు ఓటుహక్కును కోల్పోతారని సుప్రీంకోర్టు ధర్మాసనం ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. జులై 25లోగా డాక్యుమెంట్లను సమర్పించలేని వారికి, క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ సమయంలో మరోసారి అవకాశం ఇస్తామని ఈసీ అంటోంది. ఓటరు జాబితాల సమగ్ర సవరణ చేయడం అనేది చట్టబద్ధం, నైతికం, అవసరమని చెబుతోంది. దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఇందుకోసం డ్రైవ్‌లు జరిగిన విషయాన్ని ఎన్నికల సంఘం గుర్తు చేస్తోంది.



అమర్‌నాథ్ యాత్ర కోసం భక్తులను తీసుకువెళ్తున్న బస్సు ఆదివారం జమ్మూ కాశ్మీర్‌లోని ఖుద్వానీ వద్ద ప్రమాదానికి గురైన దృశ్యం

## ఉద్యోగి ఆత్మహత్య

>> భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు ఏర్పడ్డాయి. ఈ నేప థ్యంలో కడారిశ్రావణ్ కుమార్ భార్య నీలిమ తన పుట్టింటికి వెళ్ళిపోయింది. అటు తర్వాత నీలిమ 2025 జూన్ మాసంలో కడాయి శ్రావణ్ వారి కుటుంబ సభ్యులపై వరకట్నం వేధింపుల ఫిర్యాదును కరీంనగర్ మహిళా పోలీస్ స్టేషన్ లో చేశారు. ఈ నేపథ్యంలో మహిళ పోలీస్ స్టేషన్ సీఐ శ్రీలత వీరిని బెద రింపులకు గురి చేశారని మృతుని బంధువులు ఆరోపిస్తున్నారు. కేసు విచారణలో భాగంగా వీరిని పిలిపించి నానా దుర్భాషలా డినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. చంపి పారేస్తానని బెదిరించి నట్లు ఫిర్యాదులో మృతుని తండ్రి నర్సింగం పేర్కొన్నారు. వీరిపై కేసు నమోదు చేసిన సీఐ బెయిల్ తీసుకోవాలని వారిని పిలవగా కడారి శ్రావణ్ కుమార్ మళ్లీ స్టేషన్‌కు వెళ్తే కొడతారేమో అని భయంతో మనస్థాపం చెంది తన చావుకు కరీంనగర్ మహిళా పోలీస్ స్టేషన్ సిఐ శ్రీలంక తన భార్య బత్తులనీలిమ, ప్రవీణ్ కుమార్, నవీన్ కుమార్, ఎడ్ల ప్రసన్న, బత్తులవినోద, బత్తుల మధు కుమారులు కారణమని సెల్ఫీ వీడియో తీసి వైరల్ చేసి ఈనెల 7న గుర్తుతెలియని పురుగుల మందు తాగా రు. గుర్తించిన కుటుంబీకులు 108కు ఫోన్ చేసి కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌లోని ప్రైవేటు హాస్పిటల్లోకి తరలించారు. చికిత్స పొందుతూ ఈనెల 13న ఉదయం మృతి చెందారు. మృతుని కుటుంబీకులు పెద్ద ఎత్తున కరీం నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలివచ్చారు. మృతుని బంధు వులు ఆందోళన చేస్తారేమోనని పోలీసులు ఆసుపత్రిలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉద్రిక్తపరిస్థితులు నెలకొన్నాయి. ఏసిపి మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడి పరిస్థితిని అదు పులోకి తీసుకొని వచ్చారు. మృతుని తండ్రి కడారి నర్సింగ్ నుండి ఫిర్యాదును స్వీకరించారు. చొప్పదండి ఎస్ఐ నరేష్ రెడ్డి పోలీస్ అధికారిపై బత్తులనీలిమ, ప్రవీణ్ కుమార్, నవీన్ కుమార్, ఎడ్ల ప్రసన్న, బత్తుల వినోద బత్తుల మధుకుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

**సిఐని తక్షణమే సస్పెండ్ చేయాలి**

దళిత సంఘాల నాయకులు కరీంనగర్ రూరల్ తహసిల్దార్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్గా విధులు నిర్వహిస్తున్న కడారి శ్రావణ్ కుమార్ ఆత్మహత్యకు కారకులైన సిఐని తక్షణమే సస్పెండ్ చేసి అతనిపై వరకట్న వేధింపులను అసత్యపు కేసును పెట్టిన అతని అత్తగారి అందరిని దానిని బాధ్యులైన వారందరినీ కఠినంగాశిక్షి ంచాలని దళిత సంఘాల జిల్లా నాయ కుడు, గుమ్లాపూర్ మాజీ ఎంపీటీసీ బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీ ్మనారాయణ మాల మహానాడు మండల శాఖ అధ్యక్షులు కునమల్ల చంద్రయ్య అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షులు కడారి గంగరాజు, పెద్దల్లి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



## ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న వారిపైకి దూసుకొచ్చిన ఆడికారు

### ఐదుగురికి తీవ్రగాయాలు

**న్యూఢిల్లీ, జూలై 13:** ఢిల్లీలో ఆడి కారు బీభత్సం సృష్టించింది. మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ ఆడికారుతో ఫుట్‌పాత్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న ఐదుగురికి గాయాలు అయ్యాయి. వసంత్ విహార్ ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితులంతా రాజస్థాన్‌కు చెందినవారుగా గుర్తించారు. బాధితులు ఢిల్లీలో కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. 40 యేళ్ల ఉత్సవ్ శేఖర్ మద్యం సేవించి కారు నడిపినట్లు పోలీసులు గుర్తించారు. బాధితులు ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న సమయంలో కారు వారిని ఢీకొట్టింది. ఎనిమిదేళ్ల బాలికసహా ఐదుగురు వ్యక్తులపై ఆడి కారును తాగి నడిపాడు. ఈ నెల 9న తెల్లవారుజామున 1:45 గంటల ప్రాంతంలో ఈ సంఘటన జరిగింది. అధికారులు సంఘటనా స్థలానికి చేరుకునే సమయానికి, గాయపడిన వారిని చికిత్స కోసం స్థానికులు సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. బాధితులను లాధి (40), ఆమె ఎనిమిదేళ్ల కుమార్తె బిమ్లా, భర్త సబామి అలియాస్ చిర్మా (45), రామ్‌చందర్ (45), అతని భార్య నారాయణి (35)గా గుర్తించారు, వీరందరూ రాజస్థాన్ నివాసితులు. శివ క్యాంప్ ముందు ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న బాధితులపై తెల్లటి ఆడికారు దూసుకెళ్లిందని ప్రాథమిక దర్యాప్తులో ప్రత్యక్షసాక్షులు వెల్లడించారు. నిందితుడిపై చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## ఫోన్ ట్యాపింగ్‌పై బాధితుల వాంగ్మూలం నమోదులో జాప్యం

**హైదరాబాద్, జూలై 13, ప్రభాతవార్త:** రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి బాధితుల వాంగ్మూలం నమోదు లో జాప్యం ఏర్పడింది. ఈ కేసులో కీలక నిందితుడైన ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావుకు వున్న మధ్యంతర బెయిల్‌ను రద్దు చేయించేందుకు ప శ్చిమ మండల డిసిపి విజయ్ కుమార్, జూబ్లీహిల్స్ ఎసిపి వెంకటగిరి ఢిల్లీలో మకాం వేయడంతో బాధితుల వాంగ్మూలంలో జాప్యం ఏర్పడింది. ఫోన్ ట్యాపింగ్‌పై విచారిస్తున్న సిట్ బృందంలో వీరిద్దరు కీలకంగా వుండడం తెలిసిందే. వీరిద్దరు ఢిల్లీలో వుండడంతో గత వారం ఎలాంటి వాం గ్మూలం నమోదు కాలేదు. ఈ వారం కూడా ఇదే పరిస్థితులు వుండే వీలుంది. ప్రభాకర్‌రావుకు ఉన్న మధ్యంతర బెయిల్‌ను రద్దుచేయించే క్రమంలో ఇద్దరు అధికారులు సుప్రీం కోర్టు న్యాయవాదులతో ఢిల్లీలో మకాంవేసి ఈ పనిలో బిజీగా వున్నారు. వీరిద్దరు హైదరాబాద్‌కు తిరిగివచ్చిన తరువాత ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధితుల వాంగ్మూలం మళ్లీ మొదలయ్యే వీలుంది.

## భారత్ మోస్ట్ వాంటెడ్ ఖలిస్థానీ నేత అరెస్టు!

**వాషింగ్టన్, జూలై 13:** భారతదేశ జాతీయ దర్యాప్తు సంస్థ మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్న క్రిమినల్ అమెరికాలో పట్టుబడ్డాడు. పంజాబ్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్ పవిత్తర్‌సింగ్ బటాలా, మరో ఏడుగురు ఖలిస్తానీ ఉగ్రవాదులను అమెరికాలోని ఫెడ రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అరెస్ట్ చేసింది. ఒక ముఠా సంబంధిత కిడ్నాప్ కేసులో ఈ అరెస్టులు జరిగాయి. కాగా, నిందితుడు బటాలా నిషేధిత ఉగ్రవాద సంస్థ బబ్బర్ ఖల్సా ఇంటర్నే షనల్‌తో సంబంధాలు కలిగి ఉండటం, ఇంకా అనేక ఉగ్రవాద కార్యకలా పాలలో పాల్గొన్నందుకు భారతదేశం అతడ్ని మోస్ట్ వాంటెడ్ జాబితాలో చేర్చింది. అమెరికాలోని స్థానిక షెరీఫ్ కార్యాలయం అందిస్తున్న సమాచారం ప్రకారం అమెరికాలోని శాన్ జోక్విన్ కౌంటీలో జరిగిన కిడ్నాప్, హింసకు సంబంధించిన కేసులో శుక్రవారం అమెరికాలోని వివిధ ప్రాంతాలలో వీరిని అరెస్టు చేశామని తెలిపింది. బటాలాతోపాటు, ఇతర అనుమానితులను దిల్‌ప్రీత్ సింగ్, అమృత్‌పాల్ సింగ్, అర్ష్‌ప్రీత్ సింగ్, మన్‌ప్రీత్ రంధావా, సరబ్‌జిత్ సింగ్, గుర్తాజ్ సింగ్, ఇంకా విశాల్‌గా గుర్తించారు. నిందితులందరిపై కిడ్నాప్, హింస, నిర్బంధం, సాక్షిని బెదరించడం, సెమీ ఆటోమేటిక్ తుపాకీతో దాడి చేయడం, క్రిమినల్ బెదిరింపులు వంటి వివిధ అభియోగాలపై కేసు నమోదుచేసి శాన్‌జోక్విన్ కౌంటీ జైలుకు పంపారు.




## 18న రైతుల ఖాతాల్లో పిఎం కిసాన్ నిధులు

**హైదరాబాద్, జూలై 13, ప్రభాతవార్త:** పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం కింద రైతుల ఖాతాల్లో ఈ నెల 15న నిధుల విడుదల చేసేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. ఈ స్కీమ్ ద్వారా మొత్తం 9 కోట్ల మంది పైగా రైతులకు లబ్ధి చేకూరనుంది. కాగా కేంద్ర ప్రభుత్వం రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. 2019 ఫిబ్రవరిలో ఈ పథకాన్ని అమలులోకి తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా రైతులకు పంట సాయంగా ఎకరానికి సంవత్సరానికి 6 వేల రూపాయలు అందిస్తోంది.

ఇలా ప్రతి సంవత్సరం 2 వేల రూపాయల చొప్పున మూడు దఫాలుగా నేరుగా రైతుల అకౌంట్స్‌లో జమ చేస్తూ వస్తోంది. తొలి విడతగా ఏప్రిల్-జులై, రెండో విడతగా ఆగస్టు-నవంబర్, మూడో విడతగా డిసెంబర్-మార్చిలో రూ.2 వేల చొప్పున కేంద్ర సర్కార్ ఈ ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. ఇప్పటి వరకు పీఎం కిసాన్ పథకం ద్వారా కేంద్ర సర్కార్ 19 సార్లు రైతుల ఖాతాల్లో నిధులు విడుదల చేసింది. ఇప్పుడు 20వ దఫా నిధులు విడుదల కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఈ నెల 15న జమ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

## మరో మైలురాయిని అధిగమించిన యాదాద్రి థర్మల్

### ముందే 57.60 మిలియన్ టన్నుల లక్ష్యం పూర్తి

**హైదరాబాద్, జూలై 13, ప్రభాతవార్త :** తెలంగాణలో ప్రతిష్ఠాత్మక యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ (వైటీపీఎస్) మరో మైలురాయిని అధిగమించింది. ఆ ప్లాంట్‌లోని యూనిట్1 కమర్షియల్ ఆపరేషన్ డేట్ విద్యుత్ ఉత్పత్తిలో విజయవంతమైంది. 800 మెగావాట్ల సామర్థ్య కలిగిన ఈ యూనిట్ ఎలాంటి సమస్యలు, అటంకాలు లేకుండా పూర్తి లోడ్‌తో నిర్విరామంగా నడిచింది. 72 గంటల్లో 57.60 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకోగా దీన్ని అనుకున్న సమయానికి గంటన్నర ముందే నిర్దేశిత లక్ష్యాన్ని చేరింది. కనిష్ఠంగా 814 మెగావాట్లు, గరిష్ఠంగా 828 మెగావాట్ల లోడ్‌తో నడిపారు. వైటీపీఎస్‌లోని మొత్తం 5 యూనిట్లలో ఇప్పటికే యూనిట్2లో విద్యుత్తు ఉత్పత్తి జరుగుతున్నది. తాజాగా యూనిట్ 1లో కమర్షియల్ అపరేషన్ డేట్ పూర్తికావడంతో పూర్తిస్థాయి విద్యుత్తు ఉత్పత్తికి అవకాశం ఏర్పడింది. మిగిలిన 3 యూనిట్లను వచ్చే యేడాది ఫిబ్రవరి నాటికి అందుబాటులోకి తీసుకు రావాలని తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కో లక్ష్యంగా పెట్టుకుంది.

# మహిళా సంఘాలకు టి ఫైబర్ నెట్ బాధ్యతలు!

### ఆసక్తి గల సంఘాల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు అధికారుల సన్నాహాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 13:** తెలంగాణలో స్వయం సహాయక సంఘాల మహిళల (డ్వాక్రా సంఘాల) సేవలు త్వరలో మరో రూపంలో ప్రజలకు అందనున్నాయి. పొదుపుతో ఆర్థిక స్వావలంబన సాధించిన మహిళలు చిరు వ్యాపా రాలు, మహిళా శక్తి సెంటర్ల నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చాటుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం టీఫైబర్ నెట్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. వీటి నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకోసం స్త్రీనిధి కింద లోన్ సౌక ర్యాన్ని కల్పిస్తున్నారు. ప్రయత్నం ఫలిస్తే గ్రామాల్లో ఇంటర్‌నెట్ సేవలు మరింతమంది ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఆసక్తి కలిగిన మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకు ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం భారత్ నెట్ పథకాన్ని అందు బాటులోకి తెచ్చిన విషయం విదితమే.

రాష్ట్రంలో గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం పైపులైన్లు వేసే క్రమంలో వాటితో పాటే అదే కందకాల్లో ఫైబర్ తీగలను కూడా వేశారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో ప్రతి ఇంటికీ అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ఫైబర్‌నెట్ సౌకర్యం కల్పించాలని భావిం చింది. దీనిని పర్యవేక్షించే బాధ్యతను టీఫైబర్ సంస్థకు అప్పగించారు. ఇప్పటికే టీఫైబర్ సేవలు కలెక్టరేట్లు, ఎంపీడీవో, పంచాయతీ ఆఫీసుల్లో ప్రయోగాత్మకంగా అందిస్తున్నారు. తాజాగా ప్రతి ఊరిలో సిగ్నల్ ఉందా? టీఫైబర్ పైపులు దెబ్బ తిన్నాయా? ఇంటర్నెట్ వేగానికి కేబుళ్లు సరిపోతాయా? అన్న కోణంలో సంబంధిత సిబ్బంది పరిశీలిస్తున్నారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేస్తారు. రూ.300కే 20 ఎంబీపీఎస్ వేగంతో 4జీ, 5జీ ఇంటర్‌నెట్ సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. పాఠశాలలు, ప్రభుత్వం ఆఫీసులు, గ్రామంలో కోరిన వారికి నిర్వాహక మహిళలు కనెక్షన్లను ఇస్తారు. డ్వాక్రా సంఘాల సభ్యులకు దీని వల్ల అదనపు ఆదాయం సమకూరనుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 48,264 మహిళా సంఘాలున్నాయి. 5.22 లక్షల మంది డ్వాక్రా సభ్యులున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ వసతిని కల్పించేందుకు స్త్రీ నిధి కింద ఒక్కొక్కరికి రూ.5 లక్షల రుణం అందిస్తారు. మహిళలు ఊరిలో అవసరం ఉన్న వారికి కనెక్షన్‌ను ఇస్తారు. స్వశక్తి మహిళలకు ఇంటర్నెట్ నిర్వహణ బాధ్యతలు అప్పగించటంపై కసరత్తు చేస్తున్నట్లుగా టీఫైబర్ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే నారాయణపేట జిల్లాలో ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా సెలక్ట్ చేసి అమలు చేస్తున్నారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.344 కోట్లను విడుదల చేసింది. మహిళా సంఘాల ఖాతాల్లో వడ్డీ సొమ్ము జమచేస్తున్నారు. ఈమేరకు రూ.300 కోట్లు గ్రామీణ మహిళా సంఘాలకు, రూ.44 కోట్లు పట్టణ మహిళా సంఘాలకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఇప్పటికే రుణాలు మంజూరు చేస్తోంది. దీనికితోడు వడ్డీలేని లోన్‌లు ఇచ్చేందుకు కూడా ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. మున్సిపాలిటీల పరిధిలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) అధికారులు ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదికలు సిద్ధం చేసి పంపుతున్నారు. మళ్లీ పథకం పునఃప్రారంభం కానుం డటంతో ఎంతోమంది మహిళలకు లబ్ధి చేకూరనుంది. దీంతో మహిళా సంఘాల్లో కొత్త ఆశలు చిగురించాయి.

## ఇజ్రాయెల్ డ్రోన్ దాడుల్లో ఆరుగురు చిన్నారులుసహా 10 మంది మృతి

**గాజా సిటీ, జూలై 13:** ఇజ్రాయెల్ జరిపిన డ్రోన్ దాడిలో ఆరుగురు చిన్నారులు సహా పది మంది దుర్మరణం చెందారు. మంచి నీరు తెచ్చుకునేందుకు వెళ్లిన సమయంలో వారిపై దాడి జరిగినట్టు స్థానిక ఎమర్జెన్సీ సర్వీసుల అధికారులు ఆదివారం ఈ విషయాన్ని వెల్లడించారు. మృతదేహాలను అక్కడి నుసేరత్ అల్ అవ్దా ఆసుపత్రికి తరలించారు. ఈ దాడిలో గాయపడ్డ 16 మందికి అదే ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు. అయితే, ఈ ఉదంతంపై ఇజ్రాయెల్ మిలిటరీ ఇంకా స్పందించాల్సి ఉంది. దాడి అనంతరం అక్కడ నెలకొన్న భీతావహ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. బాధితులను స్థానికులు ప్రైవేటు వాహనాల్లో ఆసుపత్రులకు తరలించారు. ఇటీవల గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ దాడులు తీవ్రతరం చేసిన నేపథ్యంలో తాజా ఘటనపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఆదివారం జరిగిన మరో మూడు దాడుల్లో సుమారు 19 మంది పాలస్తీనియన్‌లు మరణించినట్టు గాజా సివిల్ డిఫెన్స్ ఏజెన్సీ తెలిపింది. రఫాలోని ఫీల్డ్ ఆసుపత్రిలో శనివారం సుమారు 132 మంది వివిధ గాయాలతో చేరారని ఇంటర్నేషనల్ రెడ్ క్రాస్ కమిటీ తెలిపింది. వారిలో 32 మంది కన్నుమూసినట్టు వెల్లడించింది. ఆహార పంపిణీ కేంద్రాల వద్దకు వచ్చిన సమయంలో అధిక శాతం మందిపై దాడులు జరిగినట్టు వెల్లడించింది. మే 27న ఆహార పంపిణీ కేంద్రాలు తెరిచిన నాటి నుంచీ ఇప్పటివరకూ బుల్లెట్ గాయాల పాలైన 3400 మందికి రఫా ఫీల్డ్ ఆసుపత్రిలో చికిత్స చేసినట్టు తెలిపింది. మరో 250 మంది మరణించినట్టు వెల్లడించింది. గాజాలో దుస్థితికి ఈ మరణాలు అద్దం పడుతున్నాయని వెల్లడించింది. ముందురోజు ఓ ఆహారం పంపిణీ కేంద్రం వద్ద జరిగిన దాడిలో 24 మంది కన్నుమూసినట్టు దక్షిణ గాజాకు చెందిన నస్సెర్ ఆసుపత్రి వెల్లడించింది. ప్రజలు ఆహారం సేకరిస్తున్న సమయంలో ఇజ్రాయెలీ దాళాలు కాల్పులు జరిపాయని పేర్కొంది. అయితే, ముందస్తు హెచ్చరికగా గాల్లోకి కాల్పులు జరిపినట్టు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ తెలిపింది. అనుమానాస్పదంగా ఉన్న వారిని అక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ ముందస్తుగా హెచ్చరికలు చేసినట్టు తెలిపింది. సహాయక కేంద్రాల వద్ద మరణించిన వారి సంఖ్య 789కు చేరిందని ఐక్యరాజ్య సమితి మానవహక్కుల కార్యాలయం ప్రకటించింది. వీరిలో 615 మంది గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న కేంద్రాల వద్దే మరణించినట్టు వెల్లడించింది. అమెరికా, ఇజ్రాయెల్ మద్దతుతో ఈ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. కొన్ని ఘటనల్లో సామాన్య పౌరులు గాయపడిన మాట వాస్తవమేనని ఇజ్రాయెల్ మిలిటరీ పేర్కొంది. పౌరులతో ఘర్షణలను వీలైనంతగా తగ్గించేందుకు ప్రయత్ని స్తున్నట్టు పేర్కొంది.



# అమర్‌నాథ్‌యాత్రలో ప్రమాదం

### పదిమందికిపైగా గాయాలు

**కుల్గామ్, జూలై 13:** అమర్‌నాథ్ యాత్రలో ప్రమాదం చోటుచేసుకుంది. యాత్రా కాన్వాయ్‌లోని మూడు బస్సులు ఒకదానికొకటి ఢీకొనడంతో 10 మందికి పైగా యాత్రికులు గాయపడ్డారు. కుల్గాం జిల్లాలోని ఖుద్వానీ ప్రాంతంలోని టాచ్లూ క్రాసింగ్ సమీపంలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించి అనంతనాగ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలకు తరలించారు. యాత్రికులు స్వల్పంగా గాయపడ్డారని, అంతా క్షేమంగా ఉన్నారని వైద్య అధికారులు ధ్రువీకరించారు. కుల్గాం ప్రమాదంతో తాత్కాలికంగా అంతరాయం కలిగినప్పటికీ తిరిగి యాత్రా కార్య క్రమాలు ప్రారంభం అయ్యాయి. ట్రాన్స్‌పోర్ట్ ఆపరేటర్లు వాహనాల మధ్య తగినంత దూరం పాటించి కాన్వాయ్ ప్రోటాకాల్‌ను పాటించాలని అధికారులు సూచించారు. ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ వాహనాలు ఢీకొనడానికి కారణాలపై విచారణ చేపట్టారు. అమర్‌నాథ్ యాత్ర కోసం భాగవత్ నగర్ క్యాంపు నుంచి 7,048 మంది యాత్రికులతో కూడిన కొత్త బ్యాచ్ ఆది వారం నాడు జర్నీ ప్రారంభించింది. వీరిలో 1,423 మంది మహిళలు, 31 మంది పిల్లలు, 136 మంది సాధువులు, సాధ్వీలు ఉన్నారు. భారీ భద్రతా ఏర్పాట్ల మధ్య కాన్వాయ్‌లో యాత్రికులు ఉదయమే బయలుదేరారు. వీరిలో 4,158 యాత్రికులు పహల్గాం మార్గాన్ని ఎంచుకోవడంతో 148 వాహనాల కాన్వాయ్‌లో బయలుదేరారు. 2,891 మంది యాత్రికులు బాల్టా మార్గం గుండా 138 వాహనాల్లో బయలుదేరారు. 33 రోజుల వార్షిక అమర్‌నాథ్ యాత్ర జూలై 3న మొదలైంది. ఆగస్టు 9వ తేదీతో ముగుస్తుంది. ఇంతవరకూ అమర్‌నాథ్ గుహల్లోని మంచు శివలింగాన్ని 1.83 లక్షల మంది యాత్రికులు దర్శించుకున్నారు.



## రేపు రూ.2,500 కోట్ల రుణానికి సర్కారు సిద్ధం

### 2025-26లో రూ.64,539 కోట్ల సమీకరణ

**హైదరాబాద్, జూలై 13, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం మరో 2,500 కోట్ల రూపాయల మేర రుణాన్ని సమీకరించేందుకు సిద్ధమవుతోంది. ఇందుకు ఈ నెల 15న రిజర్వు బ్యాంకు బహిరంగ మార్కెట్‌లో నిర్వహించనున్న ఈ వేలంలో ఈ 2,500 కోట్ల రూపాయల రుణం తీసుకునేందుకు ఇండెంట్ పెట్టింది. ఈ మేరకు దీనికి సంబంధించి రిజర్వ్ బ్యాంక్‌కు రాష్ట్ర ఆర్థిక శాఖ వేలానికి అధికారులు రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను సమర్పించారు. ఈ మొత్తంలో 1,000 కోట్ల రూపాయలు 32 ఏండ్ల కాలానికి, మరో 1,000 కోట్ల రూపాయలు 35 ఏండ్ల కాలానికి, ఇంకో 500 కోట్ల రూపాయలు 38 ఏండ్ల కాలానికి రుణం తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం ఇండెంట్ పెట్టినట్టు రిజర్వ్ బ్యాంక్ పేర్కొంది. కాగా ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ రుణాల కింద 64, 539 కోట్లు రూపాయలు సమీకరిస్తామని వార్షిక అంచనా బడ్జెట్‌లో ప్రతిపాదించింది. ఇందులో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరంలోని రెండో త్రైమాసికానికి సంబంధించిన జూలై నుంచి సెప్టెంబర్ వరకు ప్రతివారం ఏ మేరకు రుణం తీసుకుంటామనే వివరాలతో కూడి ఇండెంట్ ప్రతిపాదనలను రిజర్వ్ బ్యాంక్‌కు ఇప్పటికే సమర్పించింది. ఈ ప్రతిపాదనల ప్రకారం. ఈ నెల 15న 2,500 కోట్ల రూపాయలను తీసుకోనున్నట్లు ఆర్థికశాఖ తెలిపింది.

ఆ మేరకు వేలానికి అవసరమైన ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను రిజర్వ్ బ్యాంక్‌కు దాఖలు పరచింది. ఇక ఈ 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి క్వార్టర్‌కు గాను 14 వేల కోట్ల రూపాయలు, రెండో త్రైమాజికంలో 12 వేల కోట్ల రూపాయల చొప్పున రుణం తీసుకుంటామని ఆర్థికశాఖ ప్రతిపాదనలు పంపించింది.

## జూరాల ఒక గేటు ద్వారా నీటి విడుదల

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 13, ప్రభాతవార్త:** జూరాల డ్యామ్‌కు వరద స్వల్పంగా స్థిరంగా కొనసాగుతున్నది. ఆదివారం జూరాలకు 65,000క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 4.380 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్ హౌస్ కు 36035 క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 6,823 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అదేవిధంగా బీమా లిఫ్టు -1కు 1,300 క్యూసెక్కులు, కోయిల్ సాగర్ లిఫ్ట్ కు 315 క్యూసెక్కులు, ఆర్డీఎస్ కెనాల్ కు 150 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 1030 క్యూసెక్కులు, కుడి కాలువకు 470 క్యూసెక్కులు, సమాంతర కాలువకు 950 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 47068 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదయింది.

## సినీనటుడు కోట శ్రీనివాసరావు మృతికి సిపిఐ నారాయణ, కూనంనేని సంతాపం

**హైదరాబాద్, జూలై 13, ప్రభాతవార్త:** ప్రముఖ సినీనటుడు కోట శ్రీనివాసరావు మరణం పట్ల సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. కళామతల్లికి అంకితమై కోట శ్రీనివాసరావు సేవ చేశారని.. విలక్షణమైన వ్యక్తి అని, వారి సహజ నటనను ప్రజలు మరవలేరని నారాయణ కొనియాడారు. ఆయన మరణం కళా రంగానికి తీరనిలోటని ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ ఆయన కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేశారు. మాజీ శాసనసభ్యుడు కోటా శ్రీనివాసరావు మరణం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సంతాపం తెలిపారు. కోటా శ్రీనివాసరావు చిత్రపరిశ్రమలో అనేక వైవిధ్యమైన పాత్రలు పోషించి ప్రేక్షకులను అలరిం చారన్నారు. ఆయన మరణం చిత్ర పరిశ్రమకు తీరని లోటని, కోట శ్రీనివాసరావు కుటుంబసభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

## 883 అడుగులకు చేరిన శ్రీశైలం డ్యాం

### కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 13, ప్రభాతవార్త:** శ్రీశైలం జలాశయం నిండుకుండలా మారింది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి ఒక గేటు ద్వారా నీటి విడుదల కొనసాగుతున్నది. కర్ణాటక నుంచి కృష్ణా నదికి భారీగా వరద జలాలు రావడంతో జూరాల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో నమోదవుతున్నది, ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులగాను ప్రస్తుతం 883.30 అడుగులకు చేరుకున్నది. ఇక నీటి నిల్వలు 215 టీఎంసీలకుగాను 206.0996 టీఎంసీలకు చేరుకున్నాయి. ప్రాజెక్టు ఒక గేటు 10అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. కాగా భారీ ఇన్ ఫ్లోతో ఏపీలోని పోతిరెడ్డిపాడుతో పాటుగా తెలంగాణలోని మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి నీళ్లు విడుదల చేస్తున్నారు. అలాగే కుడి గట్టు జలవిద్యుత్ కేంద్రానికి 33,067 క్యూసెక్కులు, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రానికి 35,315 క్యూసెక్కులు ద్వారా రెండు తెలుగు రాష్ట్రాలకు విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుంది. జూరాల నుంచి 36035 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 30,728క్యూసెక్కుల నీళ్లు వచ్చి డ్యాంలోకి చేరుతున్నాయి. మొత్తంగా శ్రీశైలం జలాశయం నుంచి 73568 క్యూసెక్కులు దిగువకు నాగార్జున సాగర్‌కు విడుదలయ్యాయి.

## దేశ రాజధానిలో త్రిపుర విద్యార్థిని అదృశ్యం



**న్యూఢిల్లీ, జూలై 13:** దేశ రాజధాని ఢిల్లీలో స్నేహ దెబ్‌నాథ్ అనే 19 ఏళ్ల విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో అదృశ్యం కావడం సంచలనం రేపుతోంది. త్రిపురకు చెందిన స్నేహ అదృశ్యంపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మానిక్ సాహా పోలీసులను ఆదేశించారు. త్రిపుర జిల్లా సబ్రూమ్ నివాసి అయిన స్నేహ ఢిల్లీ యూని వర్సిటీకి అనుబంధంగా ఉన్న ఆత్మారామ్ సనాతన్ ధర్మ కాలేజీలో చదువుతోంది. చివరి సారిగా తన కుటుంబ సభ్యులతో ఈనెల 7న మాట్లాడింది. తన స్నేహితురాలిని దిం పేందుకు సరాయ్ రోహి ల్లా రైల్వే స్టేషన్‌కు వెళ్తు న్నట్టు తల్లికి తెలిపింది. ఉదయం 5.56 గంట లకు చివరిసారిగా ఫోన్ కాల్ రికార్డయింది. 8.45 గం టలకు ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. అయితే స్నేహ తనను కలుకోలేదని ఆమె ఫ్రెండ్ చెప్పడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. క్యాబ్ డ్రైవర్‌ను కనుక్కోగా సిగ్నేచర్ బ్రిడ్జి దగ్గర దింపినట్టు తెలియడంతో కుటుంబ సభ్యులు మరింత బెంబేలెత్తారు. సిగ్నేచర్ బ్రిడ్జి అంత సేఫ్టీ కాకపోవడమే కాకుండా అక్కడ పరిమితంగానే సీసీటీవీ నిఘా ఉంది. స్నేహ ఆచూకీపై కెమెరా ఫుటేజ్ లేకపోవడంతో ఆమె జాడ తెలుసుకోవడం క్లిష్టంగా మారింది. ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఈనెల 9న ఎన్‌డీఆర్‌ఎఫ్ సాయంతో సిగ్నేచర్ బ్రిడ్జి చుట్టూ ఏడు కిలోమీటర్ల పరిధిలో తీవ్రమైన గాలింపు చర్యలు జరిపారు. అయితే ఇంతవరకూ సరైన ఆధారాలు ఏవీ దొరకలేదు. స్నేహ గత నాలుగు నెలలుగా డబ్బులు డ్రా చేయలేదని, బ్యాంకు అకౌం ట్ ముట్టుకోలేదని ఆమె తల్లిదండ్రులు చెబుతున్నారు. దీంతో స్నేహ ఆచూకి తెలిస్తే సమాచారం ఇవ్వాలని ప్రజలను పోలీసులు కోరారు.

## హెచ్‌సిఎ గోల్‌మాల్ కేసులో నిందితుల కస్టడీపై నేడు తీర్పు

**హైదరాబాద్, జూలై 13, ప్రభాతవార్త :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌లో వెలుగుచూసిన గోల్‌మాల్ కేసులో అరెస్టయి జైల్లో వున్న ఐదుగురు నిందితుల కస్టడీపై మల్కాజిగిరి కోర్టులో సోమవారం తీర్పు వెలువడనుంది. ఈ కేసులో హెచ్‌సిఎ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు సహ ఐదుగురు అరెస్టవడం తెలిసిందే. మరో నిందితుడు దేవరాజ్ పరారీలో వుండగా అతని కోసం గాలిస్తున్నారు. హెచ్‌సిఎ గోల్‌మాల్‌లో పదుల కోట్ల రూపాయల అక్రమాలు జరిగినందున నిందితు లను పది రోజుల పాటు కస్టడీకి అనుమతించాలని సిఐడి అధికారులు మల్కా జిగిరి కోర్టును కోరారు. అయితే ఈ పిటిషన్‌పై డిఫెన్స్ న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో నిందితుల తరపున ఆయన బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. రెండింటిపైనా సోమవారం కోర్టు నిర్ణయాన్ని ప్రకటించనుంది.

# మతమార్పిడులతో వందల కోట్లు ఆర్జన!



చంగూర్‌బాబా రంగు తేల్చేందుకు రంగంలోకి ఇడి
ఐదేళ్లలో 50సార్లు మధ్యఆసియా దేశాల్లో పర్యటన
సైకిల్‌పై తిరుగుతూ తాయెత్తులు కట్టే స్థితి నుంచి ఖరీదైన కార్లలో తిరిగే స్థాయికి ఎదిగిన బాబా

**హైదరాబాద్, జూలై 13, ప్రభాతవార్త:** ఉత్తరప్రదేశ్‌లో మతమార్పిడిలతో వందల కోట్ల రూపాయలు ఆర్జించిన వివాదాస్పద మతగురువు జలాలుద్దీన్‌షా అలియాస్ చంగూర్ బాబా(78) ఉదంతంపై నిగ్గు తేల్చేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) రంగంలో దిగింది. చంగూర్ బాబా గోల్‌మాల్ వ్యవహారాలపై ఇప్ప టికే యుపి పోలీసులు విచారణ చేస్తుండగా ఇతనికి పదుల సంఖ్యలో బ్యాంకు ఖాతాలు ఉండడం, వీటిలో పదుల కోట్ల రూపాయలు ఉండడం, ఈ నిధులు విదేశాల నుంచి రావడంతో దీని వెనుక అంతర్జాతీయ రాకెట్ ఉందనే కోణంలో ఇడి విచారణ చేబట్టింది. యుపిలోని బల్‌రాంపూర్ జిల్లా రెహ్రా గ్రామానికి చెందిన జలాలుద్దీన్‌షా అలియాస్ చంగూర్‌బాబా అసలు పేరు కరీముల్లా షా. మొదట్లో ఒక ప్రార్థన స్థలం వద్ద తాయెత్తులు అమ్ముతూ దిష్టి తీయించుకునేందుకు వచ్చేవారికి, పసిపిల్లలకు తాయెత్తులను కట్టేవాడు. ఈ క్రమంలో జిల్లాతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇతను 20 యేళ్లుగా సైకిల్‌పై తిరుగుతూ తాయెత్తులు కట్టడం, ప్రార్థనలకు సంబంధించిన కార్యక్రమాలు చేబట్టడం చేసేవాడు. ఇతడు తననుతాను హజ్‌రత్ బాబా జలాలుద్దీన్‌గానూ మత ప్రచారకుడిగానూ, పీర్‌బాబాగా చెప్పుకునేవాడు. 15 యేళ్లుగా మతమార్పిడులకు పాల్పడుతున్నట్లు యుపి పోలీసుల విచారణలో తేలింది. వితంతువులు, 30 యేళ్లు గడిచినా వివాహం కానివారు, గ్రహదోషాల వల్ల పెళ్లికాని అమ్మాయిలకు ఇతను మాయమాటలతో బురిడీకొట్టించి వారిచేత మతమార్పిడులు చేయించి నేపాల్ సరిహద్దుల గుండా మధ్య ఆసియా దేశాలకు వారిని పంపించినట్లు యుపి పోలీసుల విచారణలో తేలింది. అయితే వీరిలో ఎక్కువగా సమస్యలతో బాధపడుతూ వచ్చే విదేశీ మహిళలు ఉన్నారని విచారణలో తేలింది. మత మార్పిడుల కోసం ఇతడి వద్ద పదుల సంఖ్యలో అనుచరులన్నారని, వీరిలో పదేళ్లల్లో మధ్య ఆసియా దేశాలకు 50 సార్లు పర్యటించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఆయా దేశాల నుంచి పదుల కోట్ల రూపాయల నిధులు చంగూర్‌బాబాతోపాటు అతని అనుచరుల బ్యాంకు ఖాతాలలో వచ్చి పడ్డాయి. బల్‌రాంపూర్‌లోని మాద్‌పూర్‌లో అక్రమంగా నిర్మించిన మూడు కోట్ల రూపాయల విల్లాను స్థానిక అధికారులు ఇటీవలే కూల్చివేశారు. ఇప్పటి వరకు 18 ఖాతాలను ఇడి అధికారులు జప్తు చేశారు. వీటిద్వారా 68 కోట్ల రూపాయల లావాదేవీలు జరిగినట్లు తేలింది.

### కోడ్ భాషతో మతమార్పిడులు

ఇదిలా ఉండగా చంగూర్ బాబా మత మార్పిడులకు కోడ్ భాషను వాడినట్లు యుపి లోని ఉగ్రవాద వ్యతిరేక విభాగం (ఎటిఎస్) గుర్తించింది. అందుకు ఎంచుకున్న మహిళలను ప్రాజెక్టుగా పిలిచేవారు. మతమార్పిడులను మిట్టీ పలట్నాగా చెప్పేవారు. సదరు మహిళలను మానసికంగా మభ్యపెట్టడాన్ని కాజల్ కర్నాగా పిలుస్తారు. చంగూర్ బాబాతో మతమార్పిడులకు వచ్చేవారి భేటీని దీదార్‌గా వ్యవహరిస్తారు. మత మార్పిడుల కోసం మధ్య ఆసియా దేశాల నుంచి కొన్నేళ్లుగా ఇతను 300 కోట్ల రూపాయల లావాదేవీలు నిర్వహించినట్లు ఇడి గుర్తించింది. చంగూర్ బాబాను ప్రస్తు తం బల్‌రాంపూర్‌లోని అతని ఖరీదైన విల్లాలోనే ఎటిఎస్ పోలీసులు విచారిస్తున్నారు.

వార్త

తమ పూర్వీకులందరూ సాధించిన ఘన విజయాలను గురించి గర్వపడని వారు, ముందు తరాల వారు తమని గుర్తించగల ఏ కార్యాన్నీ సాధించలేరు.

-మెకాలే

# యుక్తాయుక్త విచక్షణే సత్తా!


ఒంట్లో సత్తువ, జవసత్వాలు ఉండి ఆలోచనానుభవాలు పుష్కలంగా ఉంటే వయసుతో పనేముంది అనే ధోరణి ఇప్పుడున్న పెద్దతరానిది. సామాజికంగా ఇలాంటి కారణాలకు పెద్దపీటవేసినా, రాజకీయంగా చూస్తే 75 యేళ్లయ్యేసరికి రాజకీయాలు వదిలేసినా వదిలేయకపోయినా తమ వారసులకు చోటివ్వాలనే ఉద్దేశ్యం ఒకటి బలంగా వేళ్లానుకుంటోంది. అందుకేనేమో ఎన్టీఆర్ పిలుపుతో 1983లో అనుకోకుండా సేవాదృక్పథంతో రాజకీయాల్లోకి వచ్చి 7,8 సార్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికైనవారు, రాజకీయ పదవులు అనుభవించిన వారు సైతం దీపముండగానే ఇల్లుచక్కదిద్దుకోవాలన్న యోచనతో 2019,2024 ఎన్నికల్లో తమ వారసులచే రంగ ప్రవేశం చేయించారు. యువతకు పట్టం కట్టాలనే ధోరణితో తమ కుటుంబ వారసుల్నే రాజకీయ వారసులుగా నిలబెట్టి కనీసం సగంమంది రిటైరయ్యారు. ఇందులో వారి స్వార్థం లేదని చెప్పలేం. కొంత మందికి ముదిమి మీద కొచ్చిన ప్రజాదరణను బట్టి రాజకీయ పదవుల్లో కొనసాగుతున్నారు. వారికొన్ని చోట్ల వృద్ధతరం అధికారం చెలాయిస్తే వారి వారసులు సమాంతరంగా రాజకీయాల్లో ఓనమాలు దిద్దుకుంటున్నారు. ఏమైతేనేమిలే యువత రాజకీయాల్లోకి వచ్చి ప్రజాసేవలో భాగస్వాములు కావడం స్వాగతించదగినదే. కాగా రాజకీయాల్లో ఎంతకాలం ఉండాలనే దానిపై వయసు అడ్డురాదన్నది చరిత్ర చెబుతోంది. అదే ఇన్నాళ్లూ చూస్తున్నాము. కుటుంబ వ్యవహారాల్లో సాధారణంగా పిల్లలు పెరిగి పెద్దవారై యోగ్యులుగా ఉన్నప్పుడే కుటుంబ వ్యవహారాల్లో నుంచి రిటైరై బాధ్యతలను వాటికప్పగించడం మనం చూస్తూనే ఉన్నాం. రాజకీయాల్లో వయో అర్హత గురించి పెద్దగా పట్టింపు లేమీ లేవు. కానీ తాజాగా ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ నాగపూర్‌లో జరిగిన ఓ సామూహిక కార్యక్రమంలో 75 యేళ్లు అయ్యాక రాజకీయాలను వదిలిపెట్టాల్సిన ఆవశ్యకతను ప్రతిపాదించారు. ఆయన భారతీయజనతా పార్టీని వెనకుండి నడిపించే ఆర్. ఎస్. ఎస్ అధినేత కనుక ఆయన మాట ఇప్పుడు చెల్లుబాటయ్యే పరిస్థితి కనబడుతోంది. ఆయనకెలాగో త్వరలో 75 ఏళ్లు నిండుతోంది. కనుక తన రిటైర్‌మెంట్ గురించే మాట్లాడారా! లేక బిజెపికి చెందిన భారత ప్రధాని నరేంద్రమోడీని ఉద్దేశించి మాట్లాడారా? తెలియక బిజెపి తలపట్టుకు కూర్చొంది. అంటే భారతీయ జనతాపార్టీలో ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ వ్యాఖ్యలు పెద్ద దుమారాన్నే లేవనెత్తాయి. అవే ఆర్ఎస్ఎస్ నిర్దేశికత్వం అయితే నరేంద్రమోడీ సెప్టెంబరు నెలలో రాజకీయాల నుంచి తప్పుకోవాల్సి ఉంటుందనే సంకేతాలు పంపినట్లుగానే భావించాలి. ప్రస్తుత భారత రాజకీయాల్లో కానీ, పాలక వర్గంలో కానీ, నరేంద్రమోడీకి మించిన చరిస్మా ఉన్న నాయకులెవరూ లేరు. అయితే భారతీయ జనతా పార్టీ రాజ్యాంగంలో పదవీ విరమణ వయోపరిమితి నిబంధన ఏదీ లేనందున 2029వరకు నరేంద్రమోడీయే ప్రధానిగా కొనసాగుతారని కార్యకర్తలు ఘంటాపథంగా చెబుతున్నారు. అయినా ఏదో ఒక ప్రయత్నం చాపకింద నీరులా జరిగే తీరుతుంది. ప్రస్తుత వ్యాఖ్యలు ఎంత దూరం తీసుకెళ్తాయో తెలియదుకానీ రాజకీయాలను ఒక్క కుదుపు కుదుపుతాయి. ప్రజాస్వామ్య దేశాలలో రాజకీయ రంగంలో 75 ఏళ్లు దాటిన తర్వాత కూడా ఎన్నికవుతూ లేదా నియమిత పదవుల్లో కొనసాగడం సర్వసాధారణం. ఏ రాజకీయ పార్టీలోనూ, పదవులు నిర్వహించే విషయంలో గరిష్ట వయో పరిమితి అంటూ ఏమీలేదు. ప్రపంచ వ్యాప్త, రాజకీయధోరణుల్లో వృద్ధనేతలకు మినహాయింపు లభించిన సందర్భాలు లేవు. వారికి సుదీర్ఘ అనుభవం, ప్రజల్లో ఆదరణ ఉన్న రీత్యా వారిని పక్కకు తప్పించలేని పరిస్థితి. వృద్ధాప్యంలోనూ వారు చురుకైన నాయకత్వ పటిమను కనపరిచారు. జాతీయస్థాయిలో ఎన్సీపీ నాయకత్వం వహిస్తున్న శరద్‌పవర్, కాంగ్రెస్ పార్టీ అధినేత్రిగా పార్టీని విజయవంతంగా నడిపి రెండు టర్మ్‌లు పార్టీని అధికారంలోకి తెచ్చిన సోనియాగాంధీ, కేంద్ర మంత్రిగా పనిచేసిన ఎం.వి రాజశేఖరమూర్తి వంటివారు ఎందరో జాతీయ రాజకీయాల్ని ప్రభావితం చేసినవారే. ప్రాశ్చాత్య దేశాల్లోనూ రాజకీయాలకు వయసుతో పని లేకుండాపోయింది. నిన్నగాక మొన్న అమెరికాను ఏలిన జోబైడెన్ 80వ ఏటవరకు పదవిలోనే ఉన్నారు.అమెరికా సామ్రాజ్యాధిపతిగా మంచి నిర్ణయాలు తీసుకున్నారనే పేరుంది. ప్రపంచంలో అత్యధిక వయస్సులో పదవిలో ఉన్ననాయకుడిగా రికార్డు సృష్టించిన మలేషియా ప్రధాని 80 యేళ్ల వయసులో తొలిసారి ప్రధాని అయ్యారు.మరోసారి కూడా ఆయన పదవిని దక్కించుకున్నారు. ఇలాంటి సందర్భాలను బట్టి పరిపాలనా సత్తా, ప్రజాదరణ ఉన్నంతకాలం ఎవరైనా పదవిలో కొనసాగవచ్చుననే దృష్టాంతరాలు చరిత్రలో కనపడుతున్నాయి. కాగా దేశ కాలమాన పరిస్థితులకు తోడుగా రాజకీయ ఆకాంక్షలకు వీలుగా వృద్ధ రాజకీయ నాయకులు 75కి తొలగి యువతకు చోటివ్వాలనే తలంపులకు ఎవరైనా ఓటెయ్యాల్సిందే. ఇప్పుడా ఆలోచనలు రాజకీయ నేతల మెదళ్లను తొలచడాన్ని ఆహ్వానించాల్సిందే. రాజకీయ వైకుంఠపాళిలో చిన్న వయసులో రాజకీయాల్లోకి వచ్చిన యువత సైతం పరిపాలనానుభవం కలిగిన సీనియర్ల దగ్గర పని చేయడంవల్ల వారిలో రాజకీయకాంక్షతోపాటు రాజ్యకాంక్ష కూడా ఇనుమడిస్తుంది. ఇందువల్ల ప్రజాపాలన సౌభాగ్యక రంగా, అభివృద్ధి పథంలో నడిపించే అనుభవం సాధించగలుగుతారు.తాజాగా సీనియర్ రాజకీయ నేతలే యువతను రాజకీయాల్లోకి ఆహ్వానిస్తున్నారు. దేశ సంక్షేమానికి శుభప్రదం కాగలదు.

జీవితంలో ప్రతి నిముషాన్నీ వ్యర్థం చేయక ఉపయోగించుకో. లేకుంటే నీవు వృథా చేసిన కాలం నీ అదృష్టాన్ని తారుమారు చేయగలదు.



నెపోలియన్

ఒక పనిని ఎందుకు తప్పుగా చేశారో తెలియచేయడానికి పట్టే కాలం కంటే ఆ పనిని తిరిగి సరిగ్గా చేయడానికి తక్కువ సమయం పడుతుంది.



లాంగ్‌ఫెలో

# ప్రజావాక్కు



### ఉపాధ్యాయులకు బోధనేతర పనులు వద్దు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు గత నెలరోజులుగా అనేక బోధనేతర పనులతో ఒత్తిడికి గురవుతున్నారు.యోగాంధ్ర కార్యక్రమం, విద్యాకిట్ల పంపిణీ, మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహణ తదితర పనులలో నిమగ్నం కావడంతో బోధనకుకుంటుపడుతున్నది. ప్రస్తుతం ఉపాధ్యాయులు విద్యార్థులకు ఇవ్వబడిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లవివరాలను యాప్‌లో పొందుపరిచి విద్యార్థులు లేదా వారితల్లిదండ్రులచే బయోమెట్రిక్ వేయవలసిందిగా విద్యాశాఖ సూచిస్తోంది. కానీ పాఠశాలలో బయోమెట్రిక్ డివైస్ లేకపోవడం వాటి వినియోగం గురించి ఎటువంటి అవగాహనఉపాధ్యాయులకు లేకపోవడంతో మరింత ఆలస్యం అయ్యే అవకాశంఉంది. ఉపాధ్యాయులకు ఈ బోధనేతర పనులు వద్దని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

### ఆధిపత్య ధోరణి వీలుపడదు

ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంలో ఆధిపత్య కోణం ఉందనేది కాదనలేని వాస్తవం. ఐతే ఇరాన్‌ను న్యూక్లియర్ బాంబ్ తయారు చేయకుండా ఆపాలి అని అమెరికా నాయకత్వం మార్పుచేసి తమ చెప్పుచేతల్లో పెట్టుకోవ్వాని ఇజ్రాయెల్ ప్రయత్నించి విఫలం అయింది. ఇప్పుడు కనపడుతున్న వాస్తవం ఏమిటి ఇరాన్ తన న్యూక్లియర్ ప్రయోగాన్ని ఆపలేదు సరికదా అది అలాగే కొనసాగిస్తోంది అంటే ఆధిపత్యధోరణి ఇక ఎంతమాత్రం వీలు పడదు అనే కదా అర్థం. ఇక అమెరికా ఒక విఫల నాయకత్వం అయ్యాక చైనా ఆ స్థానం ఆక్రమించాలి అని చూసినా అది సాధ్యపడలేదు.అసలు ఎందుకు ఈరావణ కాష్టం అంటే అమెరికా ఆయు ధాలను అమ్ముకోవాలి.

- భారత అవినాష్, జనగామ

### నూతన విద్యాసంస్కరణలు అవసరం

ప్రతి విద్యాసంస్థలలో ప్రార్థన సమయంలో ఒక లెక్చరర్, ఒక టీచర్ రోజురోజుకు ఒక అంశంపై అవగాహన కల్పించాలి. జనరల్ నాలెడ్జ్ క్విజ్ ముఖ్య విషయం చెప్పాలి. విద్యార్థులవిద్యాభివృద్ధికి విజ్ఞానంఅభివృద్ధి చెందుతుంది. ఈ కార్యక్రమం తెలంగాణ రాష్ట్రప్రభుత్వం తరఫున అమలుచేయాలి. నూతన విద్యా సంస్కరణలు ప్రవేశపెట్టాలి.

- రాపాక రవీందర్, జనగాం

### భద్రత కల్పించాలి

నేడు మన దేశంలో మధ్యతరగతి ప్రజలకు తక్కువ ఖర్చుతో ఇళ్లను, పేదలకు ఉచితంగా ఇళ్లను అందించాల్సిన అవసరం అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది.అభివృద్ధి చెందుతున్న దేశంగా భారతదేశం 100కుటుంబాలకు సురక్షిత నివాసం కల్పించడంలో ముందడుగు వేయాలి. ప్రస్తుతం మధ్యతరగతి ప్రజలు తమ ఆదాయానికి అనుగుణంగా ఇళ్లను కొనుగోలు చేయడం చాలా కష్టంగా మారింది.రియల్ ఎస్టేట్ ధరలు పెరుగుతుండటంతో, తక్కువ వడ్డీ రుణాలు, సబ్సిడీలు, ప్రభుత్వ భూములపై అపార్ట్‌మెంట్లు నిర్మించడం వంటి చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం ప్రత్యేకంగా మధ్యతరగతి ప్రజల కోసం సబ్సిడీ హౌసింగ్‌స్కీమ్‌లు ప్రవేశపెట్టాలి.ఇక బడుగు, బలహీన వర్గాలకు ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇవ్వడం ద్వారా వారి జీవితాల్లో స్థిరత, భద్రత కల్పించవచ్చు.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### అవినీతి రాజకీయాలు

రాజకీయం అంటే ఒక పవిత్ర వ్యాసాగం. కానీ నేడు రాజకీయం అంటే ఛీ అనే కాడికి వచ్చింది.నేడు రాజకీయం ప్రక్షాళన చేయాలంటే ఉన్నత విద్యావంతులైన యువతకే సాధ్యం! ముఖ్యంగా నేటి రాజకీయాలలో నీతి, నైతిక విలువలు అనేవి పూర్తిగా అడుగంటిపోయాయి. ఒకవేళ చదువుకున్న యువతకు నేటి రాజకీయాలలో అవకాశం వస్తున్న అది బహు స్వల్పమే అంటే నూటికి కేవలం30శాతం మాత్రమే.అదేమీ దురదృష్టమోగాని ఎక్కువగా నేటిదేశ, రాష్ట్ర రాజకీయాలను అవినీతి మకిలి అంటినవారు, దౌర్జన్యకారులు, ప్రజల ఆస్తులను కొల్లగొట్టే దుర్మార్గపు వ్యవహారశైలి వున్నవారే శాసిస్తుండటం ఈ ప్రజాస్వామ్యానికి సంబంధించి అత్యంత బాధాకరమైన,ఆందోళన కలిగించే విషయం.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా

### భయాన్ని పోగొట్టాలి

ఈ మధ్య కాలంలోజాతీయ, అంతర్జాతీయంగా విమాన ప్రమాదాలుభయాన్ని, ఆశ్చర్యాన్ని కల్గిస్తున్నవి. యాంత్రిక, సాంకేతిక వ్యవస్థ ఎంత గొప్పగా ఉన్నప్పటికీ సిబ్బందిలో ఏ వ్యక్తి అయినా వారి తనిఖీ అనివార్యం. కేవలం ఉన్నత సాంకేతికత ఒక్కటే ప్రమాదాలను ఆపలేదు. ప్రతి చిన్న విషయం కాస్త నిర్లక్ష్యం లేకపొరపాటు జరిగితే కోట్ల ధనం, ప్రాణాలు, పోతాయి. నడిపే పైలెట్ మన ప్రాణాలకు అత్యవసర వైద్యుడు.

-బొల్లోజు మేఘానాథం, విశాఖపట్నం

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్రపంచశాంతికి పరిష్కారం ఉందా?

**ప్రజాస్వామ్యాన్ని గట్టిగా ఆచరించే ఏదేశ నాయకుడైనా నమ్మిన సిద్ధాంతం కోసం మొదట్లో ఒక్కడి గానే నడవాల్సిన పరిస్థితిని అవగాహన చేసుకొని ఆచరణలో దిగకతప్పదు. అలాంటి నాయకత్వం ఇతరులలో ఇతర దేశాలలో స్ఫూర్తిని కలుగచేస్తుందన్న నగ్నసత్యాన్ని చరిత్ర చెబుతున్నది. కారల్‌మార్క్స్ చెప్పినట్లు నాయకత్వం 'వాక్యూమ్'లో ఏర్పడదు. నాయకులు మనుషులుగానే చరిత్రను సృష్టిస్తారు. అయితే వారిష్టంవొచ్చినట్లు సృష్టించరు. పూర్వాపరాలు పరిగణనలోకి తీసుకొని నాయకులను తయారు చేస్తూ పరిస్థితులకు అనుగుణంగా పరిష్కారాలు కనుక్కొంటారు. ప్రస్తుత పరిస్థితులలో ఏ దేశం ఇందుకు అనుగుణంగా మూడవ ప్రపంచయుద్ధం అంచుల్లో ఉన్న మానవత్వాన్ని రక్షిస్తూ ప్రపంచాన్ని శాంతిమార్గానికి మళ్లిస్తుందో అలాంటి రాజకీయ నాయకులు ఏవిధంగా ఉద్భవిస్తారో చెప్పటం నడుస్తున్న చరిత్రకే సాధ్యం.తక్షణ కర్తవ్యం ప్రపంచ శాంతికి పునరుద్ధరణ ప్రయత్నాలు చేయటమే.**



రావులపాటి సీతారాం రావు

ప్రపంచ రాజకీయ రంగంలో నైతికత కొరవడిందా? ఆ విషయాన్ని హెచ్చరించడానికి నైతిక నాయకత్వ పటిమ కలిగినవారే కరువయ్యారా? ప్రపంచంలోని దేశ నాయకులు అందరూ క్షణకాలం తమ తమ బరువు బాధ్యతలను పక్కన పెట్టాల్సిన అవసరం లేకుండానే, నెమరువేసుకోవాల్సిన అత్యంత ప్రాముఖ్యత కలిగిన విషయాన్ని ఎందుకు దాటేస్తున్నారు? భారతదేశం మాటకొస్తే మన నాయకులు ముఖ్యంగా అధికారంలో ఉన్న వారు, తమ దేశానికి వున్న నేపథ్యంలో తప్పక గాఢంగా పరిశీలించాల్సిన అవసరం ఏర్పడిందన్న మాట విజ్ఞులు గమనంలోకి తీసుకోక తప్పటం లేదు. మహాత్మాగాంధీ దేశ స్వాతంత్ర్యానికి పునాదులు వేసినప్పుడు కూడా బ్రిటిష్ ప్రభుత్వం పట్ల మాట మీరలేదు! హక్కుల కోసం పోరాడుతూ సత్యాగ్రహం చేసారు కానీ, ఆగ్రహంతో దూషణ పదజాలాన్ని కూడా వాడలేదు! ఎవరైనా హద్దులు మీరినప్పుడు నైతికంగా నాయకత్వం వహిస్తూ పరిధులు దాటనివ్వలేదు. జవహర్‌లాల్‌నెహ్రూ, వల్లభాయ్ పటేల్ లాంటి వారు బ్రిటిష్ వారు పాలన వదులుకొని స్వాతంత్ర్యం ఇచ్చి వెళ్లిన తర్వాత ప్రభుత్వంలో ఉన్నవాళ్లు,ప్రపంచానికి నైతిక నాయకత్వాన్ని ఇవ్వగలిగారు. అలీన విధానంతో ఏది మంచో ఏది చెడో స్పష్టంగా చెప్పగలిగారు. కాశ్మీర్ విషయంలో దేశానికి కొంత ఇబ్బంది కలిగినా పాకిస్థాన్‌ను సాటివారిగానే చూశారు కానీ పదిమందిలో ఆదేశ పరువును తీయలేదు. అంతటి మహోన్నత వారసత్వానికి ప్రతినిధిగా ఉన్న భారత్ ఇప్పుడున్న సంకట పరిస్థితులలో నైతిక నాయకత్వం వహిస్తూ మార్గదర్శకత్వం వహించాల్సిన అవసరం ఏర్పడిందేమో అన్న విషయాన్ని ఆలోచించటం బాధ్యత అని అనుకోవటంలో తప్పులేదేమో! భారతదేశం ఆర్థికంగా అగ్రగాముల్లో ఒకటిగా ఎదిగింది. అణు సంపద కలిగిన దేశంగా గుర్తింపబడుతున్నది. జన సంపదలో అంటే జనాభా విషయంలో అగ్రస్థానంలో ఉన్నది. దక్షిణ ఆసియా దేశాల్లో ప్రముఖ దేశంగా ప్రవర్తిల్లుతున్నది. ఇండియన్ సబ్‌కాంటినెంట్‌గా కూడా వర్ధిల్లుతున్నది. అలాంటి పరిస్థితుల్లో ప్రపంచ దేశాలను దారి తప్పనివ్వకుండా చూసే కనీస బాధ్యతను భుజాల మీద ఎత్తుకోలేదా? భారత్ కాకపోతే మరే దేశం ఆ బరువును ప్రపంచ శ్రేయస్సు దృష్ట్యామోయాలి? ఆలోచించాల్సిన విషయంగా విజ్ఞులు దౌత్య నిపుణులు, అంతర్జాతీయంగా ప్రముఖంగా ఆలోచించగల నేర్పరులు, దృష్టి పెట్టాల్సిన అవశ్యకత ఏర్పడిందేమో? భారత్ స్నేహదేశాలను వదులుకోకుండానే నేర్పుగా ప్రముఖ దేశాలలో విస్తరిల్లుతున్న మితిమీరిన అనైతికతనూ, బాధ్యతారాహిత్యాన్ని కట్టడి చేయడానికి సాహించటం తప్పేమీలేదేమో? స్పష్టంగా ఆలోచనా పరిధిని పెంచుకుంటే ప్రస్తుత పరిస్థితులలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ప్రజాస్వామ్యబద్ధంగా ఎంపిక కాబడి, నియంతృత్వ ధోరణిలో ప్రపంచాన్నంతటినీ



శాసించే ప్రయత్నానికి పూనుకున్నారు. దానిని నిలువరించటానికి కొన్ని దేశాలు యుద్ధపరంగా కాకుండా, నైతిక పరివర్తనను తెచ్చే విధంగా కొంతలో కొంత బాధ్యత తీసుకోవాల్సిన అవసరం, ప్రపంచశాంతి దృష్ట్యా ఏర్పడిందని ఒప్పుకోకతప్పదు. గ్లోబల్ సంఘర్షణలు పెరుగుతూ ప్రజాస్వామ్యం సన్నగిల్లుతున్న ఈ తరుణంలో రాజకీయ నాయకత్వం ఈ పరిస్థితిని సరిదిద్దాల్సిన అవసరం ఏర్పడింది. ప్రపంచ దేశాల నాయకులు వారి ఖ్యాతిని అనైతికంగానైనా సరే పెంచుకోటానికి శృతి మించి వ్యవహరిస్తున్నారు. అగ్రదేశాలుగా ప్రపంచ శాంతిని దెబ్బతీస్తూ హిట్లర్, ముస్సోలినీలను జ్ఞప్తికి తెచ్చే విధంగా యుద్ధ ప్రణాళికలను స్వలాభం కోసం ముందుకు తేవడం అత్యంత హేయంగా కొన్ని దేశాలైనా భావించకతప్పదు. పహల్గాం సంఘటనను యు.యన్ సెక్యూరిటీ కౌన్సిల్ ఎందుకు ఖండించలేకపోతున్నది? పాకిస్థాన్ నైతిక బాధ్యతను చైనా తప్పుడు మార్గాన్ని ఎందుకు తప్పుపట్టలేకపోతున్నది. బంగ్లాదేశ్‌లోని ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్న సంగతిని అగ్రదేశాలు ఎందుకు గుర్తించలేకపోతున్నాయి. తగు చర్యలు ఎందుకు తీసుకోలేకపోతున్నాయి. రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య గొడవలనుఅమెరికా కేవలం గనుల సంపాదన కోసం కాకుండా న్యాయపరిధిలో తప్పుచేసిన వారిని మాటవరసకైనా ఎందుకు హెచ్చరించలేకపోతున్నది? ట్రంప్ హెచ్చరికలు విలువలేని మాటలుగా ప్రపంచ దేశాలు రాజకీయంగా తీసిపారేసే స్థితి దాపురించటం ఎంత విషాదకరం? అధినాయకత్వం కోసం డోనాల్డ్ ట్రంప్ టారిఫ్ హెచ్చుతగ్గుల విధానాన్ని పావుగా వాడటం ఇంతకుమునుపు ప్రజాస్వామ్యం పాటించే ఏ దేశమైనా, ఏ రాజకీయ నాయకుడైనా పాటించడం జరిగిందా? ఉక్రెయిన్, గాజా, ఇజ్రాయిల్, ఇరాన్ సంఘర్షణలు పెచ్చరిల్లటానికి కారణం ప్రపంచ దేశాలలోని మానవత్వం కనుమరుగు కావటంవల్లనే అన్న కనీస నైతికాలోచన ప్రపంచ దేశాల నాయకులుగా చెప్పుకొనేవారు ఎందుకు పరిగణనలోకి తీసుకోవటం లేదన్నదే మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ప్రపంచ చరిత్రను అవలోకనం చేసుకొని కొన్ని పాఠాలు నేర్చుకొని తదనుగుణంగా ఆచరించే చర్యలను కొందరు రాజకీయ నాయకులైనా తలపెట్టకతప్పదు. అంతర్జాతీయ న్యాయపరిధిలోనే, సమిష్టి ఆలోచనలతో ఈ సమస్యలకు పరిష్కారం కనుక్కోవటానికి కొందరు అగ్రదేశాల నాయకులైనా ముందుకు రాకతప్పదు. ప్రజాస్వామ్యాన్ని గట్టిగా ఆచరించే ఏదేశ నాయకుడైనా నమ్మిన సిద్ధాంతం కోసం మొదట్లో ఒక్కడిగానే నడవాల్సిన పరిస్థితిని అవగాహన చేసుకొని ఆచరణలో దిగకతప్పదు. అలాంటి నాయకత్వం ఇతరులలో ఇతర దేశాలలో స్ఫూర్తిని కలుగచేస్తుందన్న నగ్నసత్యాన్ని చరిత్ర చెబుతున్నది. కారల్‌మార్క్స్ చెప్పినట్లు నాయకత్వం 'వాక్యూమ్'లో ఏర్పడదు. నాయకులు మనుషులుగానే చరిత్రను సృష్టిస్తారు. అయితే వారిష్టంవొచ్చినట్లు సృష్టించరు. పూర్వాపరాలు పరిగణనలోకి తీసుకొని నాయకులను తయారు చేస్తూ పరిస్థితులకు అనుగుణంగా పరిష్కారాలు కనుక్కొంటారు. ప్రస్తుత పరిస్థితులలో ఏ దేశం ఇందుకు అనుగుణంగా మూడవ ప్రపంచయుద్ధం అంచుల్లో ఉన్న మానవత్వాన్ని రక్షిస్తూ ప్రపంచాన్ని శాంతిమార్గానికి మళ్లిస్తుందో అలాంటి రాజకీయ నాయకులు ఏవిధంగా ఉద్భవిస్తారో చెప్పటం నడుస్తున్న చరిత్రకే సాధ్యం.తక్షణ కర్తవ్యం ప్రపంచ శాంతికి పునరుద్ధరణ ప్రయత్నాలు చేయటమే. ●

# రైతులకు శాపంగా మారుతున్న నకిలీ విత్తనాలు

జి. అజయ్ కుమార్

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. రైతులు తమ పొలాలను సిద్ధం చేసుకుంటూ, నాణ్యమైన విత్తనాల కోసం ఫెర్టిలైజర్ షాపులు, విత్తన విక్రయ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. కానీ రైతులు నమ్మి కొనుగోలు చేస్తున్న విత్తనాలన్నీ నాణ్యమైనవేనా? వ్యవసాయంలో విత్తనం పాత్ర అమూల్యమైనది. ఒక రైతు వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే, మొదటి మెట్టు నాణ్యమైన విత్తనం ఎంపికే. విత్తన నాణ్యతపైనే పంట దిగుబడఇ, రైతు ఆదాయం అన్నీ ఆధారపడతాయి. కానీ ఇటీవల కాలంలో నకిలీ విత్తనాల మాఫియా వ్యవసాయాన్ని భూతంగా మింగేస్తోంది. కొందరు వ్యాపార లాభాల కోసం రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని నకిలీ విత్తనాలను విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. ఇటీవల సూర్యాపేట, వరంగల్, షాద్‌నగర్, ఆత్మకూర్‌లలో వ్యవసాయ అధికారులు, పోలీసులు జరిపిన సోదాల్లో లక్షల విలువైన నకిలీ పత్తి విత్తనాలు దొరికాయి, ప్రతి సంవత్సర ఇలాంటి సంఘటనలు కోకొల్లలుగా జరుగుతున్నాయి. ఎటువంటి ప్రమాణాలు లేకుండా సరఫరా అవుతున్న ఈ విత్తనాలు నాటిన తర్వాత మొలకే రావడం లేదు.మొలక వచ్చినా సరైన దిగుబడి రావడం లేదు.చివరికి రైతులకు దిగుబడి నష్టం,అప్పులభారంతో పాటు మానసిక ఆందోళనతో చివరికి ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి చేరుకున్నాడు. ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకున్నా ఈ నకిలీ దందా యధాతథంగా కొనసాగుతూనే ఉంది. నకిలీ విత్తనం అనగా నిజమైన రకం కాని విత్తనం, లేదా ఉద్దేశించిన విత్తన రకానికి సరిపోలని విత్తనం, లేదా ధ్రువీకరణ పొందని విత్తనం. ఇవి సాధారణంగా ప్రభుత్వం గుర్తించిన విత్తన ధ్రువీకరణ సంస్థల ధ్రువీకరణ లేకుండా ఉత్పత్తి చేయబడతాయి. నకిలీ విత్తనాలను రెండు రకాలుగా గుర్తించవచ్చు ఒకటి పంట వేయకముందు రెండోది పంట వేసిన తర్వాత. ఒకవేళ పంటవేయకముందు రైతు నకిలీ విత్తనాలను గుర్తించి అవగాహన కలిగి ఉన్నట్లయితే ఆర్థికంగా నష్టపోకుండా ఉండవచ్చు. అదేవిధంగా పంట వేసిన తర్వాత గుర్తిస్తే ఆర్థికంగా అధికంగా నష్టపోవాల్సి ఉంటుంది. కాబట్టి రైతులు విత్తనం వేసే ముందే ఈ విత్తనాలు నకిలీవా లేదా నిజమైన విత్తనాల అని తేడా



లు గుర్తించి పరీక్షించుకొని విత్తనం నాటుకోవాలి. వ్యవసాయ ఉత్పత్తిలో విత్తనాల పాత్ర ఎంతో కీలకం. కానీ మార్కెట్లో నకిలీ విత్తనాల చెలామణి రైతుల నమ్మకాన్ని నాశనం చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతి రైతు తన భూమిలో విత్తనం వేయక ముందు కొన్ని ముఖ్యమైన అంశాలను పరిశీలించడం అవసరం.అనుమతులు కలిగిన డీలర్ల నుంచే విత్తనాలు కొనండి, ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన లేదా లైసెన్స్ కలిగిన డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. అక్రమ వ్యాపారులకు దూరంగా ఉండాలి. ధృవీకరించబడిన కంపెనీల విత్తనాలకే మొగ్గు చూపాలి. విత్తన ధృవీకరణ సంస్థల నుండి లైసెన్సు పొందిన కంపెనీల విత్తనాలనే కొనాలి. ప్యాకెట్‌పై "హోలోగ్రామ్" ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించాలి. మొత్తం పెట్టుబడి ఆదా చేస్తుందని తక్కువ ధరలో అమ్మే ముఠాలను నమ్మి మోసపోవద్దు. సాధారణంగా నకిలీ విత్తనాలు చాలా తక్కువ ధరకే అమ్ముతారు. విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే రసీదు తీసుకోవాలి. సమస్య ఏర్పడితే ఇది న్యాయంగా నిదర్శనంగా ఉపయోగపడుతుంది.ప్యాకెట్ వెనక ట్యాగ్ లేదా స్టిక్కర్‌ను చూసి గుర్తించాలి. ప్రైవేట్ కంపెనీల విత్తన సంచుల వెనుక భాగంలో ఉండే పచ్చ రంగు ట్యాగ్ (ట్రూత్ ఫుల్ లేబుల్డ్ ) లేదా నీలిట్యాగ్ (సర్టిఫైడ్ సీడ్) ఆధారంగా విత్తనాన్ని గుర్తించాలి. మిరప, ప్రత్తి విత్తనాలపై ముఖ్యంగా పచ్చట్యాగ్ ఉండేలా చూస్తారు. ట్యాగ్‌పై లైసెన్స్, లాట్ నెంబర్, క్యూ ర్ కోడ్ వుంటేనే నమ్మకం విత్తన ట్యాగ్ పై కంపెనీ లైసెన్స్ నెంబర్, లాట్ నెంబర్, క్యూ ర్ కోడ్, ప్యాకింగ్ తేదీ మరియు చెల్లుబాటు గల తేదీలు ముద్రించబడి ఉండాలి. ఇవి లేనివాటిని కొనొద్దు. మొలక శాతం, జన్యు శాతం వంటి ప్రమాణాలు తప్పక చూడాలి.ప్రతి విత్తన సంచిలో మొలక శాతం 80 కంటే ఎక్కువ, జన్యు శాతం 98 కంటే ఎక్కువ, ఇతర పదార్థాలు 2 కన్నా తక్కువగా ఉండాలి. ప్యాకెట్‌పై ఇవి ముద్రించి ఉండాలి. బీటీ విత్తనాల గుర్తింపు - జి ఈ ఏ సి నంబర్ తప్పనిసరి. ప్రత్తి విత్తనాల విషయంలో జి ఈ ఏసి (జెనెటిక్ ఇంజనీరింగ్ అప్రైసల్ కమిటీ) ద్వారా మంజూరైన నంబర్ ఉన్న విత్తనాలకే మొగ్గు చూపాలి. ఇది బీటీ విత్తనం అని గుర్తించేందుకు ప్రధాన ఆధారం. ఈ సూచనలు పాటిస్తే రైతులు నకిలీ విత్తనాల వలలో పడకుండా, నమ్మకమైన విత్తనాలతో మంచి దిగుబడులు సాధించవచ్చు. ఎప్పుడూ మోసపోతే ముద్రా పత్రాలద్వారాన్యాయపరంగా ఫిర్యాదు చేయడాన్ని రైతులు మర్చిపోకూడదు. ●

# దేశాన్ని మింగుతున్న మానవ విపత్తు 'మత్తు'

రామ కిష్టయ్య సంగన భట్ల

గంజాయి అనే మత్తు పదార్థం ఈ కాలంలో దేశాన్ని మానవీయ విపత్తుగా ముప్పతిప్పలు పెడుతోంది. గ్రామీణం గానీ, పట్టణం గానీ, పాఠశాలలైనా, కళాశాలలైనా, యువతీ యువకులైనా తేడా లేకుండా ఈ మత్తు మహమ్మారి వేగంగా విస్తరిస్తోంది. ఇది కేవలం ఒక మానసిక వ్యసనం కాదు. శారీరక ఆరోగ్యాన్ని, కుటుంబ పరిమితిని, సామాజిక సమతుల్యతను, ఆర్థిక స్థిరత్వాన్ని నాశనం చేసే భయంకరమైన వ్యాధిగా రూపుదిద్దుకుంది. గంజాయి అనేది గంజి మొక్క నుండి వచ్చే మత్తు పదార్థం. దీనిలో ప్రధానంగా ఉండే క్రియాశీల పదార్థం టెట్రా హైడ్రో. కానబినాల్, ఇది మెదడులోని స్వభావాన్ని ప్రభావితం చేస్తూ తాత్కాలిక ఆనందానుభూతిని కలిగించగలదు. అయితే దీర్ఘకాల వాడకం వల్ల మానసిక అస్థిరత, భ్రమలు, నిస్పృహ, బహుళ వ్యక్తిత్వ లక్షణాలు, ఆందోళన, విపరీత భావోద్వేగాలు తలెత్తుతాయి. ఆరోగ్యపరంగా ఊపిరితిత్తుల సమస్యలు, గుండె వేగం పెరగడం, జీర్ణక్రియ మందగించడం వంటి శారీరక దుష్ప్రభావాలు కలుగుతాయి. 2021లో అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ రూపొందించిన డ్రగ్ వినియోగంపై జాతీయ సర్వే ప్రకారం దేశంలో సుమారు 3.1 కోట్ల మంది కనీసం ఒక్కసారి గంజాయి వాడినట్లు తేలింది. ఇందులో దాదాపు 70 లక్షల మంది గంజాయికి బానిసలుగా మారిన వారే. పట్టణాల్లో మాత్రమే కాదు, గ్రామీణ ప్రాంతాల్లో కూడా గంజాయి వినియోగం వేగంగా పెరుగుతోంది. ముఖ్యంగా 15 నుండి 35ఏళ్ల మధ్య వయస్సు కల యువత దీనికి బలవుతున్నారు. గంజాయి వినియోగానికి ప్రధాన కారణాలలో ఒకటి - సులభ లభ్యత. దేశంలోని ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌ల ఏజెన్సీ ప్రాంతాలలో విస్తృతంగా సాగవుతోంది. అక్కడి నుండి ఇది దేశవ్యాప్తంగా అక్రమంగా రవాణా అవుతోంది. ముంబయి, ఢిల్లీ, హైదరాబాద్, బెంగళూరు వంటి మెట్రో నగరాల్లో కళాశాలలు, పబ్‌లు, పార్టీలు గంజాయి విక్రయాలకు కేంద్రాలుగా మారిపోయాయి. యువతలో స్నేహితుల ఒత్తిడి, సరదా ప్రయోగం అనే పేరుతో మొదలై, వ్యసనంగా మారుతోంది. నిరుద్యోగం, కుటుంబ కలహాలు, ప్రేమ విఫలాలు వంటి మానసిక ఒత్తిళ్లు కూడా గంజాయి వైపు నెట్టేస్తున్నాయి. అంతేకాదు గంజాయి హానికరం కాదు, ఇది ఆయుర్వేద మందు" అనే తప్పుడు ప్రచారాలు కూడా యువతను ఈ మత్తులోకి తొక్కిస్తున్నారు. ఈ మత్తు పదార్థం ప్రభావం కేవలం వ్యక్తిగత స్థాయిలో కాకుండా కుటుంబానికి, సమాజానికి తీవ్రంగా విస్తరిస్తోంది. గంజాయి వాడకం వల్ల పాఠశాల విద్యార్థులలో చదువుపై ఆసక్తి తగ్గిపోతోంది. తరచుగా గైర్హాజరు అవుతూ చివరికి చదువు మానేస్తున్నారు. జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, ఏకాగ్రత కోల్పోవడం, మానసిక స్థిరత్వం కోల్పోవడం వలన ఉద్యోగ అవకాశాలపై కూడా తీవ్ర ప్రభావం



పడుతోంది. నేరాల శాతం పెరుగుతోంది. గంజాయి కొనుగోలుకు డబ్బుల కోసం దొంగతనాలు, దాడులు వంటి నేరాలకు పాల్పడే అవకాశాలు కూడా పెరిగాయి. డ్రగ్ ఆధారిత నేరాల శాతం గత ఐదేళ్లలో 32 శాతం మేర పెరిగిందన్నది ప్రభుత్వ గణాంకాలే చెబుతున్న నిజం. ఇటు తెలంగాణలో 2023లో మాత్రమే గంజాయి అక్రమ రవాణా కేసులు 850కి పైగా నమోదయ్యాయి. హైదరాబాదు, రంగారెడ్డి ప్రాంతాల్లోనే దాదాపు 220 కేసులు చోటుచేసుకున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ, అల్లూరి సీతారామరాజు, పాడేరు, ముంపు ప్రాంతాల్లో గంజాయి సాగు కొనసాగుతూనే ఉంది. ఏజెన్సీ ప్రాంతాల్లో సుమారు 1,500 ఎకరాల గంజాయి సాగు గుర్తించబడి నాశనం చేయబడినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్ని ఎదుర్కొనటానికి కేంద్ర ప్రభుత్వం 1985లో మాదక ద్రవ్యాలు మానసిక ప్రభావ పదార్థాల చట్టాన్ని తీసుకువచ్చింది. దీని ప్రకారం గంజాయి సాగు, నిల్వ,రవాణా, విక్రయం, వినియోగం నేరంగా పరిగణించబడుతుంది. కేంద్ర స్థాయిలో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, రాష్ట్రాల్లో పోలీసు శాఖలు, ఎక్సైజ్ శాఖలు గంజాయి వ్యాపారాన్ని అరికట్టేందుకు కృషి చేస్తున్నాయి. డ్రోన్‌ల ద్వారా పర్యవేక్షణ, సరిహద్దుల్లో తనిఖీలు, రహస్య సమాచార మాధ్యమాల ద్వారా గంజాయి వాణిజ్యాన్ని గుర్తించి నిర్వీర్యం చేస్తున్నారు. పాఠశాల స్థాయిలో అవగాహన సదస్సులు, కళాశాలల వద్ద డ్రగ్ నిరోధక శిబిరాలు నిర్వహించడం మొదలు పెట్టారు. 2025 నాటికి మత్తు పదార్థాల వినియోగాన్ని 50 శాతం తగ్గించాలన్న లక్ష్యంతో కేంద్రం 'దేశీయ మత్తు నియంత్రణ చర్యల కార్యాచరణ పథకం'ను చేపట్టింది. ఇందులో అవగాహన కార్యక్రమాలు, పునరావాస కేంద్రాల ఏర్పాటు, మానసిక చికిత్సలు, కుటుంబాల సహకారం వంటి అంశాలను మేళవించారు. కొన్ని రాష్ట్రాలు పాఠశాలల పాఠ్యాంశాలలో డ్రగ్స్‌హానిపై ప్రత్యేక అధ్యాయాలు ప్రవేశపెట్టాయి. అయితే ఈ చర్యలు సరిపోవు.సమాజం మొత్తం దీన్ని ఒక జాతీయ సంక్షోభంగా గుర్తించాలి. ప్రతీ పాఠశాల, కళాశాల, కుటుంబంలో ఈ విషయంపై చర్చ, చైతన్యం అవసరం. యువత మానసిక ఒత్తిళ్లకు గురికాకుండా ఉండేందుకు వారికి మానసిక ఆరోగ్య మార్గదర్శకత అవసరం. ఉపాధి అవకాశాలు పెంచాలి. సినిమా, టెలివిజన్, సోషల్ మీడియా వంటి వేదికల్లో గంజాయివాడకాన్ని ప్రోత్సహించే దృశ్యాలను నియంత్రించాలి. నిత్యజీవితంలో ప్రతి ఒక్కరికీ ఈ పోరాటంలో భాగస్వామ్యం ఉండాలి. గంజాయి మహమ్మారి మన దేశ యువతను బలి తీసుకుంటోంది. అది కేవలం ఒక మత్తు పదార్థం కాదు - అది ఒక భవిష్యత్ హంతక మార్గం. ఈ మత్తు మాయను అంత మొందించాలి. ప్రభుత్వాలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మానసిక నిపుణులు, సమాజ సేవా సంస్థలు,యువతీ, యువకులు - అందరూ చేతులు కలిపి పని చేయాలి. అంతేకాదు, మానవతా దృష్టితో ఈ వ్యసనాన్ని ఔషధ చికిత్స, పునరావాసం, బోధన, శిక్షణ, క్రమశిక్షణ అనే అంశాలుగా అర్థం చేసుకుని ముందుకెళ్లాలి. మన దేశం ఆరోగ్యంగా ఉండాలంటే మన యువత ఆరోగ్యంగా ఉండాలి. యువత చేతులు సృష్టి కర్తలుగా ఎదగాలి. మత్తు పదార్థాలకు బానిసలుగా కాక యువతను గంజాయి సంకెళ్ల నుండి విముక్తి చేయాలంటే - చైతన్యంతో, శక్తితో, స్ఫూర్తితో ప్రతి ఒక్క రూ ఒక అడుగు ముందుకు వేయాలి. అప్పుడు గంజాయి రహిత భారతం సాధ్యమే. అప్పుడు మన దేశ భవిష్యత్తు వెలుగులవైపు ప్రయాణిస్తుంది. ●

# బీహార్ ఓటర్లలో అత్యధికులు

# బంగ్లా, నేపాలీ, మయన్మార్ పౌరులు



## పరిశీలన తర్వాత తొలగిస్తామని ఇసి వెల్లడి

**పాట్నా, జులై 13:** బీహార్‌లో శాసనసభ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ భారత ఎన్నికల సంఘం ఓటరు జాబితా సమగ్ర సవరణను చేపట్టడం దేశవ్యాప్తంగా దుమారం రేపింది. విపక్షాల ఆందోళనలను తోసిపుచ్చుతూ బీహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో అనేక విషయాలు తెలుస్తున్నాయి. బీహార్‌లో ఇంటింటినీ తనిఖీ చేస్తున్న ఇసి సిబ్బందికి భారీగా బంగ్లాదేశీయులు, నేపాలీలు, మయన్మార్ పౌరులు కనిపించారు. వారి వద్ద ఆధార్, రేషన్ కార్డు, నివాస ధ్రువీకరణ పత్రాలు కూడా ఉన్నాయి. అంతేకాదు వారిలో చాలా మంది ఓటర్ లిస్టులో ఉండే అవకాశం ఉందని ఇసి భావిస్తోంది. అందుకే ఆగస్టు తర్వాత వారిని విచారించి జాబితా నుంచి తొలగిస్తామని తెలిపింది. సెప్టెంబర్‌లో విడుదల చేసే తుది ఓటర్ జాబితాలో విదేశీయుల పేర్లు ఉండవని స్పష్టం చేసింది. ప్రతిపక్షాలకు వచ్చే ఓట్లను తొలగించడానికే కేంద్రప్రభుత్వం కనుసన్నల్లో ఇసి ఈ ప్రక్రియ చేపట్టిందని కాంగ్రెస్ సహా ఇండియా కూటమి పక్షాలు ఆరోపిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఆధార్ కార్డును పౌరసత్వ గుర్తింపుగా పరిగణించకపోతే పేదలు, వృద్ధులు ఇప్పటికిప్పుడు కుల, నివాస, జనన ధ్రువపత్రాలు ఎలా తీసుకురాగలరని ప్రశ్నించాయి. పిటిషన్లను విచారించిన సుప్రీం ఓటర్ జాబితా సమగ్ర సవరణ రాజ్యాంగ బద్ధమేనని స్పష్టంచేసింది. అయితే ఎస్ఐఆర్ కోసం ఆధార్ కార్డును పరిగణనలోకి తీసుకోవాలని ఇసికి సూచించింది. ఈ క్రమంలో ఎన్నికల అధికారులు బీహార్‌లో పర్యటిస్తూ ఎస్ఐఆర్ చేపట్టారు. ఇంటింటి తనిఖీల్లో నేపాల్, బంగ్లాదేశ్, మయన్మార్ దేశస్తులు భారీగా బీహార్‌లో ఉన్నారని గుర్తించారు. వారి పేర్లు ఓటర్ జాబితాలో ఉన్నాయా లేదా అన్నది వెల్లడించలేదు. ఆగస్ట్ 1 తర్వాత క్షుణ్ణంగా విచారణ జరుపుతామనీ భారత పౌరులు కానివారి పేర్లేవీ సెప్టెంబర్ 30న విడుదల చేసే జాబితాలో ఉండబోవని అధికారులు తెలిపారు. బీహార్‌లో ప్రస్తుతం 77 వేలమంది బూత్ లెవల్ ఆఫీసర్లు, ప్రభుత్వ సిబ్బంది, రాజకీయపార్టీల కార్యకర్తలు పాల్గొంటున్నారు. 7.8 కోట్ల మంది ఓటర్లను వీరు తనిఖీ చేయనున్నారు.

దేశవ్యాప్తంగా సర్వేను నిర్వహించాలని నిర్ణయించింది. చాలారాష్ట్రాల్లో భారీగా అక్రమ విదేశీ వలసదారులు ఉంటున్నారు. వారిలో చాలా మంది ఓటర్‌లిస్టులో ఉండే అవకాశం ఉందని ఇసి తెలిపింది. విదేశీయులను ఓటర్‌లిస్ట్ నుంచి తొలగించేందుకే ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించింది. పశ్చిమ బంగాల్, అసోం, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరిలో ప్రభుత్వాల పదవీకాలం వచ్చే ఏడాది మే కల్లా ముగియనుంది. దీంతో బీహార్ తర్వాత ఆ రాష్ట్రాల్లోనే ఓటర్ జాబితా సమగ్ర సవరణ చేపడతామని ఇసి స్పష్టం చేసింది.



# రాజ్యసభకు మరో నలుగురు ప్రముఖులు

## నామినేట్ చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

### సీనియర్ న్యాయవాది ఉజ్వల్‌నికం, చరిత్రకారిణి మీనాక్షి జైన్, కేరళ ఉపాధ్యాయుడు సదానందన్, మాజీ దౌత్యవేత్త హార్షవర్ధన్ సింగ్లా నియామకం

**న్యూఢిల్లీ, జులై 13:** రాష్ట్రపతి ద్రౌపదిముర్ము మాజీ విదేశాంగ శాఖ కార్యదర్శి హార్షవర్ధన్ శ్రింగ్లా, ప్రముఖ న్యాయవాది ఉజ్వల్ నికంతో సహా నలుగురిని రాజ్యసభకు నామినేట్ చేశారు. ఈ మేరకు కేంద్రహోంశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ముంబయి ఉగ్రదాడుల కేసులో ఉగ్రవాది కసబ్‌కు ఉరిశిక్షపడేలా ప్రభుత్వం తరఫున ఉజ్వల్ నికం వాదనలు వినిపించారు. రాష్ట్రపతి నామినేట్ చేసిన మిగిలిన ఇద్దరిలో ప్రముఖ చరిత్రకారిణి మీనాక్షిజైన్, కేరళ ఉపాధ్యాయుడు సదానందన్‌లు ఉన్నారు. ఆయా రంగాల్లో వారి సేవలను గుర్తించి రాష్ట్రపతి ఆ నలుగురిని పెద్దల సభలకు నామినేట్ చేశారు. కళలు, సాహిత్యం, ప్రజాసేవ సహా వివిధరంగాలకు చెందిన 12మందిని రాష్ట్రపతి రాజ్యసభకు నామినేట్ చేస్తారు. వారిలో నలుగురి పదవీకాలం ముగియటం వల్ల రాష్ట్రపతి ఆ స్థానాలను భర్తీ చేశారు. రాజ్యసభకు నామినేట్ అయిన నలుగురికీ మోదీ అభినందనలు తెలిపారు. "న్యాయ రంగం, రాజ్యాంగం పట్ల ఉజ్వల్ నికంకు ఉన్న అంకితభావం ఆదర్శప్రాయమైనది. ఆయన గొప్ప న్యాయవాది మాత్రమే కాదు, ముఖ్యమైన కేసులను వాదించడంలో ఆయన ముందు వరుసలో ఉంటారని మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. తన న్యాయ వృత్తిలో నికం ఎల్లప్పుడూ రాజ్యాంగ విలువలను బలోపేతం చేయడానికి విశేష కృషి చేశారన్నారు. రాష్ట్రపతి ఆయన్ని రాజ్యసభకు నామినేట్ చేయడం సంతోషంగా ఉందన్నారు. శ్రింగ్లా సహకారాన్ని మోదీ ప్రశంసించారు. ఆయన దౌత్యవేత్తగా, మేధావిగా వ్యూహాత్మక ఆలోచనాపరుడిగా రాణించారని మోదీ అన్నారు. గత కొద్ది సంవత్సరాలుగా ఆయన భారతదేశ విదేశాంగ విధానానికి విశేష కృషి చేశారు. జీ20 అధ్యక్ష పదవికి కూడా దోహదపడ్డారు. ఆయన్ని రాజ్యసభకు నామినేట్ చేయడం ఆనందంగా ఉందని మోదీ మరో పోస్ట్‌లో పేర్కొన్నారు. సదానందన్ మాస్టర్ ఉపాధ్యాయుడిగా, సామాజిక కార్యకర్తగా ఆయన ప్రయత్నాలు ప్రశంసనీయం అని మోదీ అన్నారు. యువత సాధికారత పట్ల ఆయనకు చాలా మక్కువ ఉందన్నారు. మీనాక్షి జైన్‌ను రాష్ట్రపతి రాజ్యసభకు నామినేట్ చేయడం చాలా సంతోషకరమైన విషయం అని మోదీ అన్నారు. ఆమె ఒక పండితురాలిగా, పరిశోధకురాలిగా, చరిత్రకారిణిగా తన ప్రత్యేకతను చాటుకున్నారు. విద్య, సాహిత్యం, చరిత్ర, రాజకీయ శాస్త్ర రంగాలలో ఆమె విశేష కృషి చేశారన్నారు. విద్యా రంగంలో ఆమె చేసిన కృషికి గానూ 2020లో పద్మశ్రీ అవార్డును అందుకున్నారన్నారు. భారత రాష్ట్రపతి రాజ్యసభకు 12 మంది సభ్యులను నామినేట్ చేసే అధికారం ఉంటుంది. కళలు, సాహిత్యం, సామాజిక సేవ వంటి రంగాలలో కృషి చేసిన వారిని ఈ స్థానాలకు నామినేట్ చేస్తారు.



## భార్యతో విడాకులను వేడుకగా జరుపుకున్న భర్త

**గువాహతి,జులై 13:** భార్య నుంచి విడాకుల మంజూరు అయ్యాయని అసోంకు చెందిన ఓ వ్యక్తి వింతగా సెలబ్రేట్ చేసుకున్నాడు. 40 లీటర్ల పాలతో స్నానంచేసి సంబరాలను జరుపుకున్నాడు. తాను ఇకనుంచి స్వేచ్ఛగా ఉంటానని అంటున్నాడు. విముక్తికి ప్రతీకగా అసోంలోని నల్బరి జిల్లాలోని ముకల్మువా పోలీస్ స్టేషన్ పరిధిలోని బరలియాపర్ గ్రామానికి చెందిన మాణిక్ అలీకి తన భార్య నుంచి చట్టబద్ధంగా విడాకులు మంజూరైంది. ఈ విడాకుల ద్వారా తనకు విముక్తి కలిగిందని భావించాడు. 40 లీటర్ల పాలతో స్నానం చేశాడు. భార్య నుంచి విముక్తి లభించడం వల్లే ఇలా చేశానని చెబుతున్నాడు మాణిక్ అలీ. ప్రస్తుతం ఈ పాల స్నానం ఎపిసోడ్ అసోంతో పాటు దేశవ్యాప్తంగా వైరల్‌అయ్యింది. తాను పాలస్నానం చేయడానికి గల కారణాలను మాణిక్ అలీ వివరించాడు. తన భార్య ఆమె ప్రియుడితో రెండుసార్లు పారిపోయిందన్నాడు. తన కూతురి భవిష్యత్తు కోసం ఆలోచించి భార్యను రెండు సార్లు క్షమించానని తెలిపాడు. కానీ తన భార్య పదేపదే తన ప్రియుడి పారిపోతోందని, తప్పును మళ్లీ పునరావృతం చేస్తోందని పేర్కొన్నాడు. తాను ఇక భరించలేక భార్య నుంచి చట్టబద్ధంగా విడాకులు తీసుకున్నానని వెల్లడించాడు.

## 17 యేళ్ల బాలుడితో లేచిపోయిన సవతితల్లి!

**చండీగఢ్, జులై 13:** హరియాణాలోని నుహ్ జిల్లాలో వావివరసలు మరిచి 17 ఏళ్ల బాలుడ్ని తీసుకుని సవతితల్లిపారిపోవడమే కాకుండా ఆతడిని వివాహం చేసుకుంది. ఈ ఘటన పై బాలుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హరియాణాలోని నుహ్ జిల్లాలో షాకింగ్ ఘటన జరిగింది. 17 ఏళ్ల బాలుడు 40 ఏళ్ల సవతి తల్లి మోనికతో ఇంటి నుంచి పారిపోయి వివాహం చేసుకున్నారు. ఈ ఘటనపై బాలుడి తండ్రి రామ్ కిషన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాధితుడు రామ్ కిషన్ తెలిపిన వివరాల ప్రకారం రామ్ కిషన్ మొదటి భార్య చనిపోయింది. అయితే గురుగ్రామ్‌లోని సోహ్న ప్రాంతానికి చెందిన మోనిక అనే మహిళను పెళ్లిచేసుకున్నాడు.గత కొద్ది కాలంగా రామ్ కిషన్ మొదటి భార్య కుమారుడు వీరితో కలిసి ఆ ఇంట్లో ఉంటున్నాడు. రామ్ కిషన్ ముందు మోనికను తల్లి అని పిలిచేవాడని కాళ్లు కూడా పట్టుకునే వాడని కానీ వాళ్లిద్దరి మధ్య సీక్రెట్ ఎఫైర్ నడుస్తోందని తాను గ్రహించలేదని రామ్ కిషన్ పేర్కొన్నాడు. తాజాగా మోనికతో బాలుడు పారిపోయాడు. ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు. అయితే వారి పెళ్లి చెల్లదని బాలుడికి 17 ఏళ్లేనని తండ్రి రామ్ కిషన్ తెలిపాడు. అయితే పోలీసులు మాత్రం వీళ్లిద్దరూ కోర్టు మ్యారేజ్ చేసుకున్నారని.. తాము ఏమీ చేయలేమని చెప్పడం గమనార్హం.

## చైనా-భారత్‌కు సమస్యగా దలైలామా వారసత్వ సమస్య!

**న్యూఢిల్లీ, జులై 13:** టిబెట్‌బౌద్ధమతగురువు దలైలామా వారసుడిఎంపిక అంశం ఇపుడు చైనా భారత్ సంబంధాల్లో ఒక సమస్యగా మారిందని భారత్‌లోని చైనా రాయబారకార్యాలయం వెల్లడించింది. భారత విదేశాంగ నిపుణులు టిబెట్‌కు సంబంధించిన సమస్యల సున్నితత్వంపరిగణనలోనికి తీసుకోవాలన్నారు. దలైలామా పునర్జన్మ, వారసత్వం పూర్తిగా మాదేశ అంతర్గత వ్యవహారమని, భారత్ కల్పించుకుంటే సమస్యలు తలెత్తుతాయని ఆయన అన్నారు. 2020లో గల్వాన్‌ఘటనతో ఇరుదేశాలమధ్య తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తినతర్వాత భారత విదేశాంగమంత్రి జైశంకర్ చైనాలో తొలిసారి పర్యటించనున్నట్లు తేలింది.

# బీహార్ అసెంబ్లీ ఎన్నికలకోసం నితీశ్ వరాలు

## తాజాగా 100 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్

## 50 లక్షలమంది యువతకు ఉద్యోగ కల్పన



**పాట్నా, జులై 13:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్ననేపథ్యంలో ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఉచిత పథకాలు, ప్రజలకు సౌకర్యాలు కల్పించడంపై దృష్టి సారించారు. ఇప్పటికే మహిళా రిజర్వేషన్లు, పెన్షన్ పెంపు వంటి నిర్ణయాల తర్వాత ఇప్పుడు రాష్ట్ర ప్రజలకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడానికి ఆయన సన్నాహాలు చేస్తున్నారు. అలాగే రాష్ట్రంలో 50 లక్షలమంది యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. లక్ష్యం పూర్తికావడానికి అత్యంత చేరువలో ఉన్నామని, ఇప్పటివరకూ పదిలక్షలమందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని, మరో 39 లక్షల మంది ప్రభుత్వ ప్రోత్సాహంతో ఉపాధి పొందారన్నారు. 2030 కల్లా కోటి మందికి ఉద్యోగకల్పన చేస్తామన్నారు. అలాగే వలసజీవులకోసం మొత్తం 300 అంతర్‌రాష్ట్ర బస్సు సర్వీసులు ప్రవేశపెడతామన్నారు. తాజాగా ఉచిత విద్యుత్ ప్రతిపాదనకు ఆర్థిక శాఖ ఆమోదం లభించింది. అయితే కేబినెట్ ఆమోదం లభించాల్సి ఉంది. కేబినెట్ ఆమోదం తర్వాతే వినియోగదారులు ఈ పథకం ప్రయోజనాన్ని ఎలా పొందవచ్చో తెలుస్తుంది.

ఈ పథకం ముందుగా ఆర్థిక శాఖ ఆమోదం పొందడానికి కారణం దీని ఆర్థిక భారం రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. సామాజిక భద్రత పెన్షన్ పెంపు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ముఖ్యమంత్రి నితీష్ కుమార్ సామాజిక భద్రత పెన్షన్ పథకంలో పెంపును ప్రకటించారు. దీని ప్రకారం పింఛను ఇప్పుడు ఇస్తున్న 400 రూపాయలకు బదులుగా రూ.1100 లభిస్తుంది. పెంచిన పెన్షన్ మొత్తం జులై నుంచి ప్రారంభమవుతుందని సిఎం తెలిపారు. మహిళలకు 35 శాతం రిజర్వేషన్ ప్రకటన రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు ముందు మహిళా సాధికారతే లక్ష్యంగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగాలలోని ప్రతి విభాగంలో 35 శాతం పోస్టులు మహిళలకోసం రిజర్వ్ చేయబడతాయని సిఎం నితీష్ కుమార్ ప్రకటించారు.

# ఆరోజు కాక్‌పిట్‌లో ఏంజరిగింది?

- ఎయిరిండియా విచారణ నివేదికలపై నిపుణుల సందేహాలు
- అసమగ్రంగా ఉన్న ఎఎఐబి నివేదిక
- రెండు ఇంజిన్ల వైఫల్యంపై ఇంకా అనుమానాలు

**న్యూఢిల్లీ, జులై 13:** అహ్మదాబాద్‌లో గత నెలలో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై అనేక ప్రశ్నలు ఇంకా సమాధానం దొరకడం లేదు. తాజాగా ఈ ప్రమాదానికి సంబంధించిన నివేదిక రాగా, విమానయాన నిపుణులు దానిని ప్రశ్నిస్తున్నారు. ప్రమాదం జరిగిన రోజు కాక్‌పిట్‌లో ఏం జరిగిందన్న ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. భారత వైమానిక దళ (ఐఏఎఫ్) మాజీ డైరెక్టర్ సంజీవ్ కపూర్ మాట్లాడుతూ ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఎఎఐబి) ప్రారంభ 15పేజీల నివేదికను తీవ్రంగా విమర్శించారు. దాని ముగింపు కూడా అసంపూర్ణంగా ఉందని, కాలక్రమం కూడా అనుమానాస్పదంగా ఉందని పేర్కొన్నారు. పైలట్ మేడే కాల్‌ను ఎప్పుడూ తేలిగ్గా జారీచేయడని, మేడే అంటే ఏదోఘోరంజరిగిందనే అర్థమని చెప్పారు. రెండు ఇంజిన్లు విఫలమయ్యాయని చెప్పడంలో సందేహం లేదన్నారు. అయితే, వాటి విఫలం వెనక కారణం మాత్రం ప్రాథమిక నివేదికలో వివరించలేదన్నారు. విమానం కూలడానికి ముందు పైలట్లలో ఒకరు వరుసగా మూడుసార్లు డిస్ట్రెస్ కాల్ చేశారన్న ఏఏఐబీ నివేదికపై సంజీవ్ కపూర్ స్పందిస్తూ ఇంధన సరఫరా ఎందుకు నిలిచిపోయిందని పైలట్లలో ఒకరు ప్రశ్నించడం కాక్‌పిట్ వాయిస్ రికార్డయిందన్నారు. దీని కారణంగానే టేకాఫ్ అయిన తర్వాత ఇంజిన్లు రెండు సెకన్ల వ్యవధిలోనే శక్తిని కోల్పోయాయని తెలిపారు. టేకాఫ్ అయిన వెంటనే పైలట్ ఉద్దేశపూర్వకంగా ఇంధన కట్ ఆఫ్ స్విచ్‌లను ఆపరేట్ చేస్తాడని చెప్పడం వింతగా ఉందని సంజీవ్ కపూర్ చెప్పారు. విమానాన్ని పైలట్ మాన్యువల్‌గా ఎందుకు లిఫ్టాఫ్ చేస్తాడని ప్రశ్నించారు.

# నస్రల్లాను హతమార్చినట్లే.. ఖమేనీ అంతానికి యత్నం

## ఇజ్రాయెల్‌పై ఇరాన్ ఆరోపణలు



**టెహ్రాన్, జులై 13:** ఇటీవల ఇరాన్‌లోని అణ్వాయుధ స్థావరాలు, ముఖ్య నేతల నివాసాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడిన సంగతి విదితమే. అయితే బీరుట్‌లో హెజ్‌బొల్లా నాయకుడు నస్రల్లాను హత్య చేసిన విధంగానే ఇరాన్‌పై దాడుల సమయంలో ఇజ్రాయెల్.. తమ దేశాధ్యక్షుడిని హతమార్చడానికి ప్రయత్నించిందని ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జిసి)కు సంబంధించిన వార్తా సంస్థ పేర్కొంది. జూన్ 16న టెహ్రాన్‌లోని ఓ భవనంలో నిర్వహించిన ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సమావేశానికి ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాగర్ గాలిబాఫ్, న్యాయ వ్యవస్థ చీఫ్ మోహ్సేని ఏజీ, ఇతర సీనియర్ అధికారులు హాజరయ్యారని వార్తా సంస్థ తెలిపింది. ఉన్నతాధికారుల సమావేశంలో ఉన్న సమయంలో ఆ భవనంపై ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడిందని వార్తాసంస్థ వెల్లడించింది. అందులోని వారు తప్పించుకునే వీలు లేకుండా భవనానికి ఉన్న ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్‌లను లక్ష్యంగా చేసుకొని.. ఆరు క్షిపణులను ప్రయోగించిందని ఆరోపించింది. దాడులతో విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పటికీ అధికారులు ముందుగానే సిద్ధం చేసుకున్న అత్యవసర హాచ్ ద్వారా తప్పించుకోగలిగారని తెలిపింది. అక్కడి నుంచి తప్పించుకుంటున్న సమయంలో ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియార్ సహా పలువురు ఉన్నతాధికారులకు గాయాలు అయినట్లు తెలిపింది. హెజ్‌బొల్లా నాయకుడు నస్రల్లాను హత్య చేయడానికి ఇజ్రాయెల్ ఇదే తరహాలో దాడి చేసిందని.. ఇరాన్ అధ్యక్షుడి విషయంలో మాత్రం విఫలమయ్యిందని పేర్కొంది.

# రేపటి నుంచి యుకెలో ఇ-వీసా అమలు!



**లండన్, జులై 13:** యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఈ నెల 15 నుంచి సాధారణ వీసాల స్థానంలో ఇ-వీసాలు అమల్లోకి రానున్నాయి. ఇమిగ్రేషన్ వ్యవస్థలో చేపట్టిన విస్తృత మార్పుల్లో భాగంగా వీటిని వాడుకలోకి తీసుకొస్తున్నారు. జులై 15 నుంచి జారీ చేసే అన్ని వీసాలు వాటిని పొందే వారి పాస్‌పోర్టులతో అనుసంధానమై.. డిజిటల్ రూపంలో ఉండనున్నాయి. ఇవి అన్ని రకాల వాటికి వర్తిస్తుంది. యుకెలో విద్యాభ్యాసం చేసే వారిలో భారతీయుల సంఖ్యే ఎక్కువ. ఇమిగ్రేషన్ ప్రాసెస్‌ను గాడిన పెట్టేందుకు ఈ సరికొత్త వీసాలను అమల్లోకి తెస్తోంది. విద్యార్థులు కచ్చితంగా తమ డిజిటల్, ప్రొసీజరల్ అంశాలను ప్రయాణానికి ముందే సరిచూసుకోవాల్సి ఉంటుంది.

సరికొత్త విధానం ప్రకారం.. పాస్‌పోర్టుపై సంప్రదాయ వీసా విగ్నెట్‌ను జారీ చేయరు. దీనికి బదులు ఇ-వీసా జారీ చేస్తారు. ఇది డిజిటల్ ఇమిగ్రేషన్ హోదాను అందిస్తుంది. ఇ-వీసాల్లో కచ్చితంగా విద్యార్థులు అప్‌డేట్ చేసిన పర్సనల్ పాస్‌పోర్టు వివరాలు ఉండాల్సిందే. పాస్‌పోర్టు రెన్యూవల్‌లో మార్పులను కూడా తెలియజేయాల్సి ఉంటుంది. విద్యార్థులు కచ్చితంగా యుకెవిఐ ఖాతాను క్రియేట్ చేసుకొని వారి ఇ-వీసాను మేనేజ్ చేసుకోవాలి. వీసా వివరాలు, అప్‌డేట్ ఇన్ఫర్మేషన్, ఇమిగ్రేషన్ స్టేటస్ సమాచారం ఆయా విద్యా సంస్థలకు, యజమానులకు, కంపెనీలకు తెలియజేయడానికి ఉపయోగపడుతుంది. దీంతోపాటు విద్యార్థులు లాగిన్ క్రెడెన్షియల్స్, కాంటాక్ట్ డిటైల్స్‌ను సరిగ్గా గుర్తుంచుకోవాలి. విద్యార్థులు యుకెలో బస చేసేందుకు, కోర్సుల్లో రిజిస్టర్ చేసుకునే సమయాల్లో.. ఆయా కంపెనీలు, ల్యాండ్ లార్డ్స్, విశ్వవిద్యాలయాలు యుకెవిఐ ఖాతాను తనిఖీ చేయాల్సి ఉంటుంది. ఇ-వీసా జారీ అయినా.. విద్యార్థులు మాత్రం తమ పాస్‌పోర్టును, ప్రింటెడ్ లేదా డిజిటల్ వీసా కాపీలను తమతో ఉంచుకోవాలి. బోర్డర్ ఆఫీసర్లు పాస్‌పోర్టును స్కాన్ చేసి ఇ-వీసాను తనిఖీ చేస్తారు. ఇక వీసా జారీ అయ్యాక.. పాస్ పోర్టును రెన్యూవల్ చేస్తే.. ఆవివరాలను విద్యార్థులు తమ ఇంగ్లాండ్ ప్రయాణానికి ముందే తమ యుకెవిఐ ఖాతాను అప్‌డేట్ చేయాలి.

యుకె ప్రయాణానికి ముందు.. ఇ-వీసా జారీని ధ్రువీకరించుకోవాలి. పాస్‌పోర్టు లింకేజీని సరిచూసుకోవాలి. యుకెవిఐ ఖాతా కోసం రిజిస్టర్ చేసుకోవాలి. క్రెడెన్షియల్స్‌ను జాగ్రత్తగా ఉంచుకోవాలి. డిజిటల్ సిస్టమ్‌లో అన్ని పర్సనల్, పోస్‌పోర్టు వివరాలను నమోదు చేయాలి. వీసా డెసిషన్ లెటర్‌ను ప్రింట్ తీసుకోవడమో.. సేవ్ చేసుకోవడమో చేయాలి. వీసా అప్లికేషన్‌లో వాడిన పాస్‌పోర్టును వారి వద్ద ఉంచుకోవాలి. ఇమిగ్రేషన్ వెరిఫికేషన్ కోసం యూనివర్సిటీ అకామిడేషన్‌కు సంబంధించిన పాలసీలను సరిచూసుకోవాలి.

# సంక్షిప్తంగా..

## కేరళ సిఎం నివాసానికి బాంబు బెదిరింపు



**తిరువనంతపురం, జులై 13:** కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అధికారిక నివాసానికి బాంబు బెదిరింపు వచ్చింది. తంపనూరు పోలీసు స్టేషన్‌కు గుర్తుతెలియని వ్యక్తులు ఇ-మెయిల్ పంపారు. క్లిఫ్ హౌస్ వద్ద బాంబు పేలుళ్లు జరగబోతున్నాయంటూ ఇ-మెయిల్‌లో పేర్కొన్నారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆయన నివాసంలో విస్తృతంగా తనిఖీలు చేసి.. అది నకిలీ ఇ-మెయిల్‌గా తేల్చారు. 'బాంబు బెదిరింపు తర్వాత సిఎం నివాసాన్ని డాగ్‌స్క్వాడ్, బాంబుస్క్వాడ్‌లతో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాం. కానీ ఎక్కడా అనుమానాస్పదంగా కనబడలేదు'అని పోలీసులు వెల్లడించారు. తనిఖీల సమయంలో సిఎం విజయన్, ఆయన కుటుంబం విదేశాల్లో ఉన్నారని తెలిపారు.

## పాత డ్యామ్‌లను కూల్చివేస్తున్న చైనా

**బీజింగ్,జులై 13:** దేశంలో వేలాదికోట్లతో నిర్మించిన పాత డ్యామ్‌లన్నింటినీ పర్యావరణ ప్రయోజనాలకోసమని చైనా ప్రభుత్వం కూల్చివేస్తోంది. ఇప్పటి వరకు కట్టిన డ్యామ్‌లన్నీ కూల్చేస్తోంది ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా ఇప్పటి వరకు 300 డ్యామ్‌లు కూల్చేసింది. అంతేకాదు 373 హైడ్రోపవర్ స్టేషన్లలో 342 చిన్నస్థాయి జల విద్యుత్ కేంద్రాల్లో కార్యకలాపాలు ఎక్కడికక్కడ బంద్ పెట్టింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా డ్రాగన్ కంట్రీ కఠిన నిర్ణయాలు అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. డ్యామ్‌ల కూల్చివేత చర్యలు 2020 నుంచే మొదలు పెట్టినట్లు సమాచారం. ఆసియాలోనే అతి పొడవైన యాంగ్జీ నదిపై చైనా గత కొన్ని దశాబ్దాల కాలంలో భారీస్థాయిలో డ్యామ్‌లు, జల విద్యుత్ కేంద్రాలు నిర్మించింది. దీంతో పర్యావరణాకి పెను ముప్పు వాటిల్లింది. నదిని ఆధారంగా చేసుకుని జీవించే జలచరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

## డీజిల్ లోడ్ గూడ్స్‌రైలులో మంటలు

**తిరువళ్లూరు,జులై 13:** తమిళనాడులోని తిరువల్లూరు సమీపంలో డీజిల్ లోడ్‌తో వెళ్తున్న గూడ్స్ రైలులో మంటలు చెలరేగాయి. చెన్నై పోర్టు నుంచి 52 వ్యాగన్లలో బెంగళూరుకు ఇండియన్ ఆయిల్ తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఒక వ్యాగన్‌లో లేచిన మంటలు వేగంగా ఇతర వ్యాగన్లకు వ్యాపించాయి. పెద్దఎత్తున మంటలు ఎగిసిపడటంతో సమీప ప్రాంతాల ప్రజలు భయాందోళనకు లోనయ్యారు. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి ఏమీ కాలేదని రైల్వే అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనాస్థలానికి చేరుకొన్న అగ్నిమాపక సిబ్బంది విద్యుత్తు సరఫరాను నిలిపివేశారు. అనంతరం మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాద నేపథ్యంలో పలు లోకల్ రైళ్లను తాత్కాలికంగా నిలిపివేశారు.

## హిందీలోనే మాట్లాడతానన్న ఆటోడ్రైవర్‌పై 'సేన' దాడి!

**ముంబయి, జులై 13:** మహారాష్ట్రలో మరో షాకింగ్ ఉదంతం చోటుచేసుకుంది. హిందీలోనే మాట్లాడతానన్న ఓ ఆటో డ్రైవర్‌పై శివసేన యుబిటి, మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన ఎమ్ఎన్ఎస్ మద్దతుదారులు బహిరంగంగా దాడికి దిగారు. వారం రోజుల క్రితం ఆ ఆటో డ్రైవర్ తన వాహనంలోని ప్రయాణికుడితో మాట్లాడుతూ తాను హిందీ లేదా భోజ్‌పురీలోనే మాట్లాడతానని స్పష్టం చేశాడు. ఎవరేం చేసినా తనకు భయం లేదని చెప్పారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ నేపథ్యంలో శివసేన యుబిటి, ఎమ్ఎన్ఎస్ మద్దతుదారులు ఆ ఆటోడ్రైవర్‌పై దాడి చేశారు. మరాఠీ భాష, సంస్కృతిని అవమానిస్తే ఉపేక్షించేది లేదంటూ పలుమార్లు అతడి చెంప ఛెళ్లుమనిపించారు. అతడిపై చేయి చేసుకున్న వారిలో మహిళ కూడా ఉన్నారు.

## పాట్నాలో పట్టపగలే న్యాయవాది కాల్చివేత!

**పాట్నా,జులై 13:** బీహార్‌లో శాంతిభద్రతల పరిస్థితిపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పాట్నాలోని సుల్తాన్‌గంజ్ పోలీసు స్టేషన్‌కు కేవలం 300 మీటర్ల దూరంలో పట్టపగలే గుర్తుతెలియని దుండగులు రెచ్చిపోయారు. ఆదివారం మధ్యాహ్నం ఒక లాయర్‌పై కాల్పులు జరపడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో ఆ ప్రాంతవాసులు భయభ్రాంతులకు గురయ్యారు. రాష్ట్రంలో పెరుగుతున్న గన్ కల్చర్‌పై ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అగంతకుల కాల్పుల్లో మృతిచెందిన వ్యక్తిని జితేందర్ కుమార్‌గా గుర్తించారు పోలీసులు. వృత్తిరీత్యా లాయర్ అయిన జితేందర్ కుమార్ గత రెండేళ్లుగా తన వృత్తిలో చురుకుగా లేరని తెలుస్తోంది. రెగ్యులర్‌గా వచ్చే టీషాపులో టీ తాగి వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులు జరిపి పరారైనట్టు పట్నా ఈస్ట్ ఎస్పీ పరిచయ్ కుమార్ తెలిపారు.

# రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థపై పెనుభారంగా విద్యుత్ డిస్కంలు

## వీటి మొత్తం నష్టాలు రూ.6.5 లక్షల కోట్లు

### దేశ జిడిపిలో 2.4 శాతం నమోదు

**హైదరాబాద్, జూలై 13, ప్రభాతవార్త:** విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై భారంగా తయారయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ పంపిణీ సంస్థలను తమ స్వప్రయోజనాలకు ఉపయోగించు కోవడంతో వాటి పరిస్థితి క్రమేపీ దిగజారుతోంది. ఈ నేపథ్యంలోనే 2022-23 నాటికి రాష్ట్ర డిస్కంల మొత్తం పోగుపడిన నష్టాలు రూ.6.5 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఇది దేశ జిడిపిలో 2.4 శాతంగా నమోదైంది. ఈ మేరకు వీటికి సంబంధించి భారతీయ రిజర్వ్ బ్యాంక్ విడుదల చేసిన ఒక నివేదికలో పేర్కొంది. విద్యుత్ పంపిణీ సంస్థలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ఒక ద్రాగా కొనసాగు తున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. వివిధ సంస్కరణల ప్రయ త్నాలు ఉన్నప్పటికీ డిస్కంలు రాష్ట్రాలకు ఒక ముఖ్యమైన సవాలుగా ఉన్నాయని తెలిపింది. దీనిని పరిష్కరించడానికి, ఉత్పాదకతను మెరుగుపరచడం, ప్రసార మరియు పంపిణీ నష్టాలను తగ్గించడంతో పాటు, విద్యుత్ సరఫరా యొక్క వాస్తవ వ్యయంతో సుంకాలను సర్దుబాటు చేయడం వంటి చర్యల యొక్క ప్రాముఖ్యతను గుర్తి నొక్కి చెప్పింది. ఇతర సిఫార్సు ల్లో విద్యుత్ సరఫరా పరిశ్రమను విడదీయడం మరియు విద్యుత్ ఉత్పత్తి మరియు పంపిణీని ప్రైవేటీకరించడం ఉన్నాయి. తద్వారా రాష్ట్ర ఆర్థిక నాణ్యతను గణనీయంగా మెరుగుపరుస్తుంది వెల్లడించింది. డిస్కంలను ఆర్థిక బలోపేతం చేసే విధంగా పెంపొందించడం ద్వారా రాష్ట్ర ఆర్థిక మొత్తం నాణ్యతను మెరుగుపరచడానికి ఈ చర్యలు కీలకమైనవని వివరించింది. అనేక ఆర్థిక పునర్నిర్మాణ ప్రయత్నాలు ఉన్నప్పటికీ, 2016-17 నుండి డిస్కంల మొత్తం బకాయిలు సగటు వార్షిక రేటు 8.7 శాతం వద్ద వృద్ధి చెందాయని నివేదిక హైలైట్ చేసింది. పంపిణీ నష్టాలను తగ్గించడం, మీటరింగ్ వ్యవస్థలను మెరుగుపరచడం, సకాలంలో టారిఫ్ సవరణలను నిర్ధారించడం మరియు ప్రభుత్వ సబ్సిడీలపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గించడానికి విద్యుత్ రంగాన్ని ప్రోత్సహించడం ద్వారా రాష్ట్రాలు కార్యాచరణ సామర్థ్యాన్ని ప్రాధాన్యపరచాలని నివేదిక వివరించింది. ఇది గత సంవత్సరాల నుండి మెరుగుదలని ప్రతిబింబిస్తుందని చెప్పింది. మరియు బాధ్యతాయుతమైన ఆర్థిక నిర్వహణకు నిబద్ధతను ప్రదర్శిస్తుందని తెలియజేసింది. అదనంగా, ఖర్చుల నాణ్యతను మెరుగుపరచడంలో రాష్ట్రాలు పురోగతి సాధించాయని నివేదిక పేర్కొంది. మరింత సానుకూల పరిస్థితుల నేపథ్యంలో ఆర్థిక క్రమశిక్షణను కొనసాగించడంలో రాష్ట్రాలు పురోగతి సాధించాయని పేర్కొంది. 2023-24లో రాష్ట్రాల స్థూల ఆర్థిక లోటు 2.91 శాతం వద్ద ఉంది, ఇది ఆర్థిక బాధ్యత చట్టం ద్వారా నిర్దేశించబడిన 3 శాతం పరిమితిలో బాగానే ఉంది. ఇక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో పెట్టుబడి మరియు దీర్ఘకాలిక వృద్ధికి కీలక సూచిక అయిన మూలధన వ్యయం 2023-24లో జిడిపిలో 2.6 శాతానికి పెరిగింది, ఇది అంతకుముందు సంవత్సరంలో 2.2 శాతంగా ఉంది. 2024-25లో రాష్ట్రాలు ఆర్థిక క్రమశిక్షణను కొనసాగించాలని భావిస్తున్నాయని, ఈ నేపథ్యంలో 3.2 శాతంగా ఉంటుందని నివేదిక అంచనా వేసింది.

## నేడు చౌటుప్పల్, నల్గొండలో పర్యటించనున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**హైదరాబాద్, జూలై 13, ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్ రావు చౌటుప్పల్, నల్గొండ జిల్లాలో పర్యటించనున్నారు. సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి బయలుదేరి ఉదయం 9 గంటలకు మునుగోడు నియోజకవర్గం, చౌటుప్పల్ చేరుకుంటారు. ఆ తరువాత నకిరేకల్ నియోజకవర్గం చిట్యాల, నార్కెట్‌పల్లి, నల్గొండ పట్టణంలో పర్యటిస్తారు. మధ్యాహ్నం 3.30 గంటలకు సూర్యాపేట చేరుకున్న అనంతరం బిజెపి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. రాత్రి 7 గంటలకు రామచందర్ రావు స్వగ్రామం కోదాడ నియోజకవర్గం నల్లబండ గూడెం గ్రామంలో వివిధ వర్గాలతో, గ్రామస్తులతో మాట్లాడుతారు. రాత్రి వారి స్వగ్రామంలో బసచేస్తారు. 15వ తేదీ స్వగ్రామంలో దేవాలయంలో పూజలు నిర్వహిస్తారు. కోదాడ, చౌటుప్పల్ మండలంలో పర్యటిస్తారు.

# ఎమ్మెల్సీ కవితపై తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు ఖండిస్తున్నాం

### పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 13:** ఎమ్మెల్సీ కవితపై తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు గర్హనీయమని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఖండిం చారు. మహిళలను గౌరవించుకోవడం మన సంప్రదాయమని, కవిత పై మల్ల న్న చేసిన అనుచిత వ్యాఖ్యలు ఖండించాల్సిందేనని స్పష్టం చేశారు. అయితే మల్లన్న కార్యాలయంపై జాగృతి కార్యకర్తల దాడి చట్ట వ్యతిరేకమని మండి పడ్డారు. చట్ట పరిధిలో అందరూ పని చేసుకోవాలని సూచించారు. మల్లన్న కార్యాలయంపై దాడి, గన్‌మెన్ కాల్పులు జరిపిన అంశాలపై వచ్చిన ఫిర్యా దులపై చట్టపరిధిలో విచారణ జరుగుతుందన్నారు. బిసి బిల్లు, రిజర్వేషన్లు అన్ని కాంగ్రెస్ కృషి ఫలితమేనని మహేశ్‌కుమార్‌గౌడ్ మరోసారి పునరు ద్ఘాటించారు. బిసి రిజర్వేషన్ల అంశంలో ఇతరులు లబ్ది పొందాలని చూడడం సమంజసం కాదని హితవు పలికారు.

# ధూపదీప నైవేద్య పథకం పోస్టులకు భారీ డిమాండ్

### 255 పోస్టులకు 3,500పైగా దరఖాస్తులు

**హైదరాబాద్, జూలై 13, ప్రభాతవార్త:** దేవాదాయ ధర్మాదాయ శాఖ మంజూరు చేసిన దూప దీప నైవేద్యం పథకంలోని పోస్టులకుభారీగా పోటీ నెలకొంది. మంజూరు చేసిన 255 పోస్టులకు పోటాపోటీగా దరఖాస్తులు వెల్లువెత్తాయి. గడువు చివరి నాటికి ఎండోమెంట్ కార్యాలయానికి దాదాపు 3,500 పైగా దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 600, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 300 పైగా దరఖాస్తులు వచ్చాయి. వీటితో పాటు ఇతర జిల్లాల నుంచి కూడా భారీగా అప్లికేషన్లు వచ్చాయి. వీటిని పరిశీలించి దూప దీప నైవేద్యం పథకానికి అర్హత కలిగిన ఆలయాలను ఎంపిక చేసేందుకు ఎండోమెంట్ అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. ఇప్పటికే ఏ జిల్లా నుంచి ఎన్ని దరఖాస్తులు వచ్చాయో వాటిని జిల్లాల వారీగా విభజించారు. అర్హులను గుర్తించే ప్రక్రియను త్వరలో చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.ప్రస్తుతం దేవాదాయ శాఖ అధికారులు బోనాల ఉత్సవాలు ఉండటంతో పరిశీలనను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలిసింది. ఉత్సవాలు ముగియగానే ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. రాష్ట్రంలో దేవాదాయ శాఖ పరిధిలో అనేక దేవాలయాలు ఉన్నప్పటికీ అవి దూపదీప నైవేద్యానికి నోచడం లేదు. వాటికి ఏళ్ల నాటి చరిత్ర ఉన్నా నిర్వహణ లేక అవి శిథిలావస్థకు చేరాయి. విశిష్టత కలిగిన ఆలయాలను గుర్తించి నిత్యం పూజలు నిర్వహించేందుకు అర్చకులకు కనీస వేతనం, ఆలయాల నిర్వహణకు కనీస ఖర్చుల కింద ప్రభుత్వం నెలనెలా నిధులు మంజూరు చేస్తుంది. ఆలయ పూజారికి రూ.6 వేల చొప్పున, ఆలయ నిర్వహణకు రూ.4 వేల చొప్పున మొత్తం రూ. 10వేల పూజారి(పంతులు) ఖాతాలో జమ చేయనుంది. నెలకు రూ.10 వేల చొప్పున అందజేయడమే దూప దీప నైవేద్యం పథకం కింద ఎంపికైనట్లు పేర్కొంటున్నారు.

ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా దూప దీప నైవేద్యం పథకంలో 255 పోస్టులు మంజూరు చేసింది. అర్హులైన వారు ఈ పోస్టులకు జూన్ 24 వరకు దరఖాస్తులు చేసుకోవాలని ఎండోమెంట్ డిపార్ట్మెంట్ నోటిఫికేషన్ జారీచేసిన విషయం తెలిసిందే. వీటి కోసం వివిధ ఆలయాల్లో పూజలు చేస్తున్న అర్చకులు పెద్దసంఖ్యలో పోటీపడ్డారు. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 3,500 దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిశీలించేందుకు ఎండోమెంట్ ఉన్నతాధికారులు సర్వం సిద్ధమయ్యారు. ప్రభుత్వం మంజూరు చేసిన 255 పోస్టులు పరిమిత సంఖ్యలో ఉండటంతో అర్చకుల నుంచి పోటీ తీవ్రంగా ఉంది. తాజాగా 33 జిల్లాల ప్రకారం చూస్తే జిల్లాకు 6 నుంచి 7 పోస్టులు కేటాయించే అవకాశం ఉంది.ఈ లెక్కన అర్చకులను ఎంపిక చేయాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. ఎంపిక విధానంలో అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ జాబితాను రూపొందించనున్నారు.దూప దీప నైవేద్యం పథకానికి ఎంపిక చేసే ఆలయానికి కొన్ని నిబంధనలు పెట్టారు.ముందుగా ఆ ఆలయం ఎండోమెంట్ లో రిజిస్ట్రేషన్ అయి ఉండాలి.

ఆలయానికి ఐదెకరాల కంటే తక్కువ భూమి కలిగి ఉండాలి.అంతేకాకుండా ఇతర ఆదాయం పొంది ఉండకూడదు. ఆ గుడి విశిష్టత,ఆలయ చరిత్ర కలిగి ఉండాలి. అప్పుడే ఆ ఆలయం దూప దీప నైవేద్యం పథకం పరిధిలోకి వస్తుంది. దీనిని ఎంపిక చేయాలంటే ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ నివేదిక, ఈవో(ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్) ధ్రువీకరణ,అసిస్టెంట్ కమిషన్ ప్రతిపాదన అనంతరం అడిషనల్ కలెక్టర్ ఎంపిక చేస్తారు. ఎంపిక చేసిన ఈ జాబితాను ఎండోమెంట్ కమిషనర్ ధ్రువీకరించి దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆమోదం కోసం పంపిస్తారు. అనంతరం ప్రభుత్వం గెజిట్ విడుదల చేస్తుంది.అప్పటి నుంచి ఆ ఆలయాలు దూప దీప నైవేద్యం పథకం పరిధిలోకి వస్తాయి నెలనెలా రూ.10 వేల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది.

# ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాళ్ల పదోన్నతులకు నేడు కౌన్సెలింగ్

### ఇంటర్ విద్య కమిషనరేట్‌లో నిర్వహణ

### 81 మందికి కౌన్సెలింగ్ నిర్వహించనున్న అధికారులు

**హైదరాబాద్, జూలై 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న జూనియర్ లెక్చరర్లకి ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతులు కల్పించనున్నారు. జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న సీనియర్ మోస్టు జూనియర్ లెక్చరర్లకి ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతులు ఇవ్వాలని ఇంటర్ విద్య శాఖ నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన కౌన్సెలింగ్‌ను నేడు(సోమవారం) హైదరాబాద్‌లోని నాంపల్లిలో గల ఇంటర్ విద్య కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించనున్నారు. ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతి పొందనున్న 81 మంది జూనియర్ లెక్చరర్ల పదోన్నతికి కౌన్సెలింగ్ నేడు నిర్వహించనున్నారు. తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యాశాఖ రాష్ట్రవ్యాప్తంగా 81 మంది అర్హులైన జూనియర్ లెక్చరర్లకి ప్రిన్సిపాల్‌లుగా పదోన్నతి ఇవ్వడం కోసం నేడు కౌన్సెలింగ్ నిర్వహించనున్నది. పదోన్నతికి ఎంపికైన జూనియర్ లెక్చరర్లు తప్పనిసరిగా కౌన్సెలింగ్‌కు సమయానికి హాజరుకావాలని ఇంటర్ విద్య డైరెక్టర్ సూచించారు. ఈ కౌన్సెలింగ్ ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో అకడమిక్‌తోపాటు అడ్మినిస్ట్రేటివ్ విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు పదోన్నతులను కల్పించనున్నారు. పదోన్నతుల అనంతరం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్స్ కొనసాగనున్నారు.

# గాంధీభవన్‌లో వరంగల్ కాంగ్రెస్ నేతల సమావేశం

### పరస్పరం ఫిర్యాదు చేసుకోవడం మామూలే: మంత్రి కొండా సురేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 13:** ఆదివారం గాంధీ భవన్‌లో వరంగల్ జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులు సమావేశం అయ్యారు. ఈ సమావేశానికి ఇంచార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి మంత్రులు కొండా సురేఖ, సీతక్క, వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనాయకులు హాజరయ్యారు. సంస్థాగత పార్టీ నిర్మాణం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై సమగ్రంగా చర్చించారు. కాగా, సమావేశం ప్రశాంత వాతావరణంలో ముగిసింది. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ ఇది పార్టీకి సంబంధించిన సమావే శమని అన్నారు. ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడం మామూలేనని కానీ పార్టీ కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాల్సిందేనని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉంటే ఇటీవల వరంగల్ కాంగ్రెస్‌లో రాజకీయాలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీ బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాయకులపై తీవ్ర విమర్శలు చేశారు. దీంతో వరంగల్ రాజకీయాలు వేడెక్కాయి. వరంగల్ జిల్లా నేతలు పార్టీ క్రమశిక్షణా కమిటీకి ఫిర్యాదు చేశారు. దీంతో కొండా మురళి కమిటీ ముందు హాజరై వివరణ ఇవ్వాల్సి వచ్చింది.

# సింగరేణి నిధులు ఇక్కడే ఖర్చు చేస్తాం

### త్వరలో చట్టం తీసుకుని వస్తాం

### మంత్రి వివేక్ వెంకటస్వామి



**హైదరాబాద్, జూలై 13, ప్రభాతవార్త :** సింగరేణి సంస్థకు సంబంధించి డిఎంఎఫ్‌టి నిధులను సింగరేణి ప్రాంతాల్లోనే ఖర్చు చేసేలా త్వరలో చట్టం తీసుకొస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం మంచిర్యాల జిల్లా మంచమర్రి, క్యాతనపల్లి మున్సిపాలిటీల్లో పర్యటించారు. వరుసగా గనులు మూత పడటంతో ఉపాధి అవకాశాలు తగ్గుతు న్నాయన్న మంత్రి కొత్త బొగ్గు గనులు రావాల్సిన అవసరం ఉంద న్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విధుల్లో నిరక్ష్యంగా వ్యవ హరిస్తున్న అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జైపర్లో 850 మెగావాట్ల మూడో యూనిట్‌కు త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భూమి పూజ చేస్తారని తెలిపారు. ఈ ప్లాంట్ ద్వారా 5 వేల కొత్త ఉద్యోగాలు వస్తాయన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత రాష్ట్రంలో మొదటి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను మందమర్రిలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కోర్టు తీర్పు ఆధారంగా మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు జరిపిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెడ్ కెటగిరీ పరిశ్రమల్లోని కీలక విభాగాల్లో శిక్షణ పొందిన కార్మికులను నియమించేలా చర్యలు తీసుకుంటామని కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఈ విషయమై ఇప్పటికే కార్మిక శాఖ కార్యదర్శిని ఆదేశించినట్లు చెప్పిన మంత్రి త్వరలోనే దీనిపై చట్టం కూడా తీసుకొస్తామన్నారు. పాశమైలారం ఫ్యాక్టరీలో కీలక విభాగాల్లో శిక్షణ పొందిన కార్మికులను నియమించలేదని గుర్తించామన్నారు.

# ఆగస్టు 4 నుంచి కామన్ పిజి ఎంట్రన్స్ పరీక్షలు

### ఇప్పటి వరకు 36వేల దరఖాస్తులు

### 17 వరకు దరఖాస్తుల స్వీకరణ

### అపరాధ రుసుంతో 28 వరకు అవకాశం

**హైదరాబాద్, జూలై 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో పిజి కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే తెలంగాణ కామన్ పిజి ఎంట్రన్స్ టెస్ట్(టిజిసిపిజిఈటి)-2025 పరీక్షలను ఆగస్టు 4 నుంచి నిర్వహించ నున్నారు. ఇందుకు సంబంధించి సబ్జెక్టు వారీ పరీక్షల షెడ్యూల్‌ను త్వరలోనే వెల్లడించానున్నారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తులను జూన్ 18 నుంచి స్వీకరిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటి వరకు సుమారు 36 వేల మంది దరఖాస్తు చేసుకున్నట్టు తెలిసింది. పిజి కోర్సులైన ఎంఏ, ఎంఎస్సీ, ఎంకామ్, ఎంఈడి, ఎంపిఈడి వంటి పోస్ట్ గ్రాడ్యుయేట్ (పిజి) ప్రోగ్రామ్‌లతో పాటు 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సిపిజెట్ పరీక్షను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని ఉస్మానియా విశ్వ విద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయం, శాతవాహన విశ్వ విద్యాలయం, తెలంగాణ విశ్వవిద్యాలయం, మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం, పాలమూరు విశ్వవిద్యాలయం, వీరనారి చాకలి ఇలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ (జెఎన్‌టియుహెచ్)లో ప్రవేశాల కోసం సిపిజెట్‌ను నిర్వహించనున్నారు. జూన్ 18 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించడం ప్రారంభించగా.. ఈ నెల 17 వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా దరఖాస్తులను స్వీక రించనున్నారు. రూ. 500 అపరాధ రుసుంతో జులై 24 వరకు, రూ. 2000తో ఈ నెల 28 వరకు దరఖాస్తులను స్వీకరిం చనున్నారు. రాష్ట్రం లో 297 కాలేజీల్లో సుమారు 50వేల సీట్లు అందుబాటులో ఉన్నాయి. మొత్తం 45 సబ్జెక్టులలో ప్రవేశాల కోసం కంప్యూటర్ బేస్ట్ ఎగ్జామి నేషన్(సిబిటి) విధానంలో పరీక్షలను నిర్వహించనున్నారు.

# ప్రభుత్వ కాలేజీ హాస్టళ్లల్లో 20 శాతం సీట్లు పెంచాలి

### కొత్తగా 100 బిసి హాస్టళ్ల మంజూరు కోరుతూ సిఎం రేవంత్‌రెడ్డికి ఎంపి ఆర్.కృష్ణయ్య లేఖ

**హైదరాబాద్, జూలై 13 ప్రభాతవార్త:** ప్రభుత్వ కాలేజీ హాస్టల్లో 20 శాతం చొప్పున సీట్లు పెంచాలని, కొత్తగా 100 బిసి హాస్టళ్లను మంజూరు చేయాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. కాలేజీ హాస్టళ్లలో సీట్లు దొరకక బీసీ విద్యార్థులు అష్టకష్టాలు పడుతూ రైల్వే స్టేషన్లలో, నిద్ర, స్నానాలు చేయాల్సిన పరిస్థి తులు నెలకొన్నాయి. హైదరాబాదుతో సహా జిల్లాలలో బీసీ కాలేజీ హాస్టల్‌లో సీట్లు లభించక బీసీ విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారు. వెంటనే కొత్తగా హాస్టళ్లు మంజూరు చేసి బిసి విద్యార్థులను ఆదుకోవాలని తగుచర్యలు తీసుకోవాలని కోరారు. హైదరాబాదులో హాస్టల్ సీట్లు లభించక విద్యార్థులు కాచిగూడ రైల్వే స్టేషన్లలో సికిందరాబాద్ రైల్వే స్టేషన్లలో నిద్రపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులు సీట్ల కోసం మహబూబ్‌నగర్, నల్గొండ, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, మెదక్ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున దరఖాస్తులు పెట్టుకుం టున్నారు. ముఖ్యమంత్రి వెంటనే జోక్యం చేసుకొని ప్రస్తుతం కొనసాగుతున్న హాస్టల్లో 20 శాతం చొప్పున సీట్లు పెంచాలని కోరారు.

# కోట శ్రీనివాసరావు సినీప్రతిభ బహుముఖీనం

### ప్రధాని మోడీ సంతాపం

### పార్టీకి తీరనిలోటు: కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బిజెపి రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు

**హైదరాబాద్, జూలై 13, ప్రభాతవార్త:** టాలీవుడ్ సీనియర్‌నటుడు కోట శ్రీనివాసరావు మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోడీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కోట మరణం పట్ల ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో స్పందించారు. కోట శ్రీనివాసరావు మరణం బాధాకరం. ఆయన సినీ ప్రతిభ, బహుముఖ ప్రజ్ఞకు గుర్తుండిపోతారు అన్నారు. తరతరాలుగా ప్రేక్షకులను తన అద్భుతమైన ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. సామాజిక సేవలో కూడా ఆయన ముందంజలో ఉన్నారని, పేదలు, అణగారిన వర్గాలకు సాధికారత కల్పించడానికి కృషి చేశారన్నారు.

ఆయన కుటుంబానికి, అసంఖ్యాక అభిమానులకు నా సంతాపం. ఓం శాంతి అంటూ మోడీ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు మాజీ శాసనసభ్యులు సినీ నటులు కోట శ్రీనివాస రావు మరణిం చారన్న వార్త తీవ్రంగా బాధించిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు అన్నారు. అనేక సినిమాలలో విలక్షణ నటుడగా, అనేక పాత్రలు పోషించి ప్రజా జీవితంలో శాసనసభ్యుడిగా పని చేసిన వ్యక్తి వారి మరణం భారతీయ జనతా పార్టీకి వారి అభిమానులకు తీరని లోటు అని అన్నారు. అనారోగ్యంతో ఉన్న పార్టీ కార్యక్రమాలకు వచ్చేవారు కోట శ్రీనివాసరావు మరణం పట్ల వారి కుటుంబ సభ్యులకు అభిమానులకు ప్రగాఢ సంతాపం సానుభూతి తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నాం అన్నారు.

ప్రముఖ నటుడు కోట శ్రీనివాస్‌రావు మృతిపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సనాతన ధర్మం, సామాజిక విలువలు, భాషా పరిరక్షణ తదితర విషయలపై సమాజంలో మరి ముఖ్యంగా యువతలో చైతన్యం నింపేందుకు ఎంతో కృషి చేశారని, నాలుగు దశాబ్దాల సినీ ప్రయాణంలో 750కి పైగా చిత్రాల్లో విభిన్న పాత్రలను పోషించి తెలుగు సినీ రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును చాటుకున్నారు. 1999లో విజయవాడ ఈస్ట్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు వారి సేవలను గుర్తించి 2015లో కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో గౌరవించుకుందన్నారు. సినిమా రంగంలో ఎప్పటికీ గుర్తుండిపోయేలా అన్ని రకాల పాత్రలు వేస్తూ తనదైన ముద్ర వేసిన విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావుఅని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు.

ఎన్నో జాతీయ, నంది అవార్డులు, రివార్డులు అందుకున్న గొప్ప నటుడు కోట అన్నారు. కోట శ్రీనివాసరావు మృతిపై ఎంపి డా.లక్ష్మణ్, ఏపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ సంతాపాన్ని ప్రకటించారు. త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడులు కోట శ్రీనివాసరావు మృతికి సంతాపాన్ని తెలియజేశారు.

# 'బచ్చా.. ఆగయా భాయ్స్'

### గంజాయ్ కోడ్‌తో కస్టమర్లు పట్టివేత

### ఈగల్ టీం డెకాయ్ ఆపరేషన్

**హైదరాబాద్, జూలై 13, ప్రభాతవార్త:** గంజాయ్ కస్టమర్లను గుర్తించేందకు రాష్ట్ర'ఈగల్ టీమ్' సరికొత్త పథకాన్ని అమలుచేసింది. ఇటీవల మహారాష్ట్రకు చెందిన గంజాయ్ సరఫరాదారుడు సందీప్‌ను అరెస్ట్ చేశారు. అయితే ఆదివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో గంజాయి వినియోగించేవారు ఉన్నారని భావించి తన ఫోన్‌లో ఉన్న కాంటాక్ట్ నెంబర్లకు వాట్సాప్‌లో కోడ్ అయిన 'బచ్చా ఆగయా భాయ్స్' అంటూ ఈగల్ టీం పోలీసులే మెస్సెజ్‌ను చేసి ఓ ప్రదేశానికి రావాలని పంపించారు. వెంటనే ఆగమేఘాలపై స్పందించిన ఐటీఉద్యోగులు, రిలేషన్‌షిప్ మేనేజర్లు,ఆన్‌లైన్ ట్రేడర్లు, విద్యార్థులు, డెంటిస్టులు, టెక్నీషియన్లు కలిపి 14మంది అక్కడికి రాగానే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒకరు భార్య, కుమారుడితో కలిసి చేరుకోవడంతో పోలీసులు కంగుతిన్నారు. వీరందరికి యూరిన్ పరిక్ష చేయడంతో పాజిటివ్ రావడంతో డీఅడిక్షన్ సెంటర్‌కు పంపించినట్లు ఈగల్‌టీం పోలీసులు పేర్కొన్నారు.

## సిపిఐ 4వ రాష్ట్ర మహాసభలు.. లోగో ఆవిష్కరణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 13:** ప్రభుత్వ భూములను పేదలకు పంచడానికి ఉద్యమం కొనసాగిస్తామని సీపీఐ మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. సీపీఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎంఎల్సి పల్లా వెంకట్ రెడ్డితో కలిసి ఆదివారం సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో ఆయన సీపీఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర మహాసభల సందర్భంగా సీపీఐ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి పార్టీ లక్ష్యాలను వివరించాలన్నారు. ఈ మహాసభల జయప్రదం కోసం ప్రతి ఒక్కరు పని చేయాలని కార్యకర్తలను కోరారు. మేడ్చల్ జిల్లాలో పార్టీ అనేక బస్తీలలో వేలాది మందికి గుడిసెలను వేసి భూములను పంచిన చరిత్ర ఉందన్నారు. ప్రజలకు ఈ విషయాన్ని చెబుతూ పీపీఐ పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లాలన్నారు.

# పబ్‌లలో ఆగని డ్రగ్స్ దందాలు

### వరుసగా పట్టుబడుతున్న స్మగ్లర్లు, వినియోగదారులు

**హైదరాబాద్, జూలై 13, ప్రభాతవార్త:** గ్రేటర్ పరిధిలో డ్రగ్స్ దందాలు ఆగడం లేదు. పబ్‌లలో మాదకద్రవ్యాల వాడకంపై సర్కారు ఓవైపు కఠినం గా వున్నా మరోవైపు స్మగ్లర్ల ఆగడాలు యదేచ్ఛగా కొనసాగుతూనే వున్నాయి. పోలీసులు, ఈగల్ బృందం, అబ్కారీ అధికారులు దాడులు చేసిన సం దర్భాలు మినహాయించి మిగతా వేళల్లో నిర్వాహకులది ఆడింది ఆట పాడింది పాట అన్నట్లుగా వుంది. శివార్లలోని కొంపల్లిలో ఓ రెస్టారెంట్‌లో డ్రగ్స్‌తో పట్టుబడ్డ స్మగ్లర్లు నగరంలోని అనేక పబ్‌లకు సరఫరాదారులు కావడం పోలీసులను విస్మయపరిచింది. పబ్‌లు.. కొన్నేళ్లుగా వీటి గురించి నిత్యం వార్తలు వస్తున్నాయి. విశ్వనగరంగా హైదరాబాద్ రూపాంతరం చెందుతున్న తరుణంలో ఆధునిక పోకడలు అలవరచుకున్న కొందరు యువతీ యువకులు పబ్‌లకు రావడం, మద్యం తాగడం, ఆహారం తీసుకోవడం, సంగీతాన్ని ఆస్వాధించడం ఆనవా యితీగా మారింది. ఇంతవరకు బాగానే వున్నా కొన్ని పబ్‌లలో అసాంఘీక చర్యలు వెలుగు చూస్తుండడం పోలీసులతో పాటు సర్కారుకు కూడా తలనొప్పి వ్యవహారంగా మారిందని చెప్పొలి. పబ్‌లలో వచ్చే యువతకు హుషారు ఇచ్చేందుకు వీనులవిందైన సంగీతం ఏర్పాటు చేస్తుంటారు. అయితే ఇందులో పాటలు పాడే కొందరు యువతుల వేషధారణ అశ్లీలంగా వుండడం, వీరిని మద్యం సేవించిన కొందరు అసభ్యకరంగా తాకుతుండడం, ఈ సందర్భంగా కొన్నిసార్లు గొడవలు జరుగు తుండడం సాధారణంగా మారుతోంది. ఈ తరహా ఘటనలు గతంలో బేగంపేట్ ప్రాంతంలో గల రెండు పబ్‌లలో వెలుగు చూశాయి. పబ్‌లలో పాటలు పాడిన అమ్మాయిలను కిడ్నాప్ చేసేందుకు కొందరు యత్నించిన ఘటనలు కూడా జరిగాయి. ఇక పబ్‌లకు వచ్చే జంటలలో కొందరు కూడా అశ్లీల దుస్తులతో రావడం అనేకసార్లు గొడవలకు దారితీస్తోంది. గచ్చిబౌలిలో ఓ ప్రముఖ గాయకుడు తన స్నేహితురాలితో కలిసి కొంతమేర అసభ్యంగా వుండే దుస్తులతో రావడం, ఈ సందర్భంగా అక్కడ వున్న కొందరు యువకులు సదరు యువతితో అ సభ్యంగా ప్రవర్తించడంతో గొడవ జరిగింది. దీంతో ఆ గాయకుడు తన స్నేహితురాలితో అసభ్యంగా ప్రవర్తించిన వారితో గొడవపడగా వారు ఇతగాడి ని తీవ్రంగా కొట్టారు. దీంతో ఈ వ్యవహారం పోలీసుల వరకు వెళ్లింది. ఇక మూడేళ్ల క్రితం బేగంపేట్‌లో లిబ్బిన్ పబ్‌లో వెలుగుచూసిన అశ్లీల బాగోతం సంచలనం రేపింది. పాటలు పాడిన అమ్మాయిలు, వారితో పాటు వున్న అబ్బాయిలు ఒళ్లంగా కనిపించే విధంగా చినిగిపోయిన దుస్తులు వేసు కోగా, పబ్‌కు వచ్చిన యువకులు కూడా తమ దుస్తులను కొంతమేర చింపుకుని మరీ తప్పతాగి మద్యం మత్తులో అమ్మాయిలతో కలిసి చిందులు వేశారు. దీనిపై పక్కా సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు అర్ధరాత్రి వేళ దాడులు చేసి అందరిని అరెస్టు చేసి కటకటాల్లో నెట్టారు. దీం తో ఆ పబ్‌ను మూసివేశారు. ఇక వివిఐపిలు వుండే బంజారాహిల్స్‌లో గల పుడింగ్ అండ్ మింక్ పబ్‌లో వెలుగుచూసిన డ్రగ్స్ బాగోతం అందరికి తెలిసిందే. 24 గంటల పాటు హోటల్ కోసం అనుమతులు తీసుకుని దానిని పబ్ కోసం వాడుకున్న నిర్వాహకులు చివరకు మాదకద్రవ్యాలను సర ఫరా చేసేవరకు వెళ్లారు. ఈ పబ్‌కు వచ్చేవారు అంతా బడాబాబుల పిల్లలే అవడంతో వీరికోసం రహస్యంగా డ్రగ్స్‌ను సరఫరా చేయసాగారు. వారాం తరాల్లో కొకైన్ సహా ఇంకొన్ని రకాల మాదకద్రవ్యాలను కోరుకున్న వారికి అందించసాగారు. దీనిపైనా పక్కాగా వ్యవహరించిన టాస్క్‌ఫోర్స్ పోలీసు లు తెల్లవారుజామున రెండున్నర గంటల సమయంలో దాడులు చేసి గోల్‌మాల్ వ్యవహారాన్ని రట్టు చేశారు. ఈ సందర్భంగా ఐదు గ్రాముల కొకైన్ ను జప్తు చేసి ఇద్దరిని అరెస్టు చేశారు. ఇక తాజాగా కొంపల్లిలో ఓ రెస్టారెంట్‌లో కొందరు డ్రగ్స్‌తో పట్టుబడడం సంచలనం రేపింది. వీరంతా నగరంలోని పలు పబ్ నిర్వాహకులకు డ్రగ్స్ సరఫరాదారులుగా తేలడంతో ఈగల్ బృందం షాక్‌కు గురయ్యింది. దీనిపై వెంటనే రంగంలో దిగి ఏఏ పబ్‌లకు డ్రగ్స్ సరఫరా అవుతుందనే దానిపై ఆరా తీస్తున్నారు. రెండు మూడు రోజుల్లో దీనికి సంబంధించి ఇంకొందరు అరెస్టయ్యే వీలుంది. తాజాగా ఆదివారం నాడు రాయదుర్గం పరిధిలో ఓ పబ్‌లో డ్రగ్స్ సేవించి ఒకతను దొరికిపోయాడు. ఇదే సమయంలో గంజాయి కోసం వచ్చిన మరో 14 మంది పట్టుబడ్డారు. కాగా గ్రేటర్ పరిధిలో 30కి పైగా పబ్‌లు వుండగా మెజారిటీ వాటిల్లో అక్రమాలు జరుగున్నాయని పోలీసులకు పక్కా సమాచా రం వుంది. అయితే ఆయా ప్రాంతాల పోలీసులు అనేకానేక కారణాల వల్ల మౌనంగా వుంటున్నారని బలమైన ఆరోపణలు వున్నాయి. ఇలా ఎందు కు జరుగుతుందనే దానికి స మాధానం కరువయ్యింది. చాలా వరకు పబ్‌లలో వారంతరాలలో డ్రగ్స్ సరఫరా అవుతుందని పోలీసులకు సమాచారం వుంది. ఇక పబ్‌లలో జరుగు తున్న మరో న్యూసెన్స్ పబ్‌లు మూసివేసిన తరువాత వీటి నుంచి బయటకు వస్తున్న వారు ఆయా ప్రాంతాల్లోని రహదారులపై చేసే అడ్డగోలు హంగామా. మద్యం మత్తులో వున్న వారు వాహనాలు నడిపేందుకు వీల్లేకున్నా చాలా మంది తమ కార్లను లేదా ద్విచక్ర వాహనాలను ఇష్టారీతిన నడుపుతూ అర్ధరాత్రి వేళ విపరీతమైన సౌండ్‌తో హారన్ మోగిస్తూ అక్కడి ప్రజలకు నిద్రలేకుండా చేస్తున్నారు. దీనిపై బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్ ప్రాంతాల లోని బస్తీల ప్రజలు పలుమార్లు పోలీసులకు ఫిర్యాదులు కూడా చేశారు.. కొన్నిసార్లు మద్యం మ త్తులో వాహనాలు నడుపుతూ అల్లరి చేస్తున్న వారిని నిలదీసిన ఉదంతాలు కూడా వున్నాయి. మొత్తంమీద పబ్‌ల వల్ల జరుగుతున్న అనర్థాలు, గోల్‌మాల్ వ్యవహారాలు అనేకం వున్నాయనడంలో అతిశయోక్తిలేదు. ఈ విషయంలో సర్కారు పూర్తిగా కట్టుదిట్టంగా ఉండాల్సిన అవసరం వుంది. ఎప్పుడైనా ఏదైనా హల్‌చల్ జరిగినపుడు సమావేశాలు నిర్వహించి, మిగతా సమయాలలో చూసీచూడకుండా సర్కారుకు చెడ్డపేరు రావడం ఖాయంగా చెప్పొలి.



## బోనాల పండుగ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ విందు

### హాజరైన సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి, స్పీకర్, చైర్మన్, మంత్రులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 13:** శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాల సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మినిస్టర్స్ క్వార్టర్స్‌లోని తన అధికారిక నివాసంలో విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు ,కార్పొరేషన్ చైర్మన్‌లు , ఐఏఎస్, ఐపీఎస్ లు ఇతర ముఖ్య నేతలు హాజరయ్యారు. బోనాల ఉత్సవం పురస్కరించుకుని మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర ప్రజలకు,నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. తన కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి, మంత్రులకు పరిచయం చేశారు.

## కోట శ్రీనివాస్‌రావు లేనిలోటు తీర్చలేనిది: సిఎం రేవంత్

### స్పీకర్ ప్రసాద్‌కుమార్, చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సంతాపం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 13:** ప్రముఖ నటుడు,కోట శ్రీనివాసరావు మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు.చలన చిత్ర పరిశ్రమకు ఆయన లేని లోటు తీర్చలేనిదని పేర్కొన్నారు. భౌతికంగా కోట మన మధ్య లేకపోయినా. ఆయన పోషించిన విభిన్న పాత్రలతో తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటారని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ..కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు ప్రకటించారు. ప్రముఖ విలక్షణ నటుడు కోటా శ్రీనివాసరావు మృతి పట్ల అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ సంతాపం వ్యక్తం చేశారు.750 కి పైగా చిత్రాల్లో విలక్షణమైన పాత్రల్లో తన నటనతో అలరించిన కోట శ్రీనివాసరావు మృతి సినీ లోకానికి తీరని లోటని తెలిపారు. శ్రీనివాస రావు ఆత్మకు భగవంతుడు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు స్పీకర్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రముఖ విలక్షణ నటుడు కోటా శ్రీనివాసరావు మృతి పట్ల తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.కోట శ్రీనివాసరావు గారి ఆత్మకు భగవంతుడు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కోట శ్రీనివాసరావు మరణం తెలుగు ప్రేక్షకులకు తీరనిలోటని ఆయన తెలిపారు.



## లండన్ సౌత్‌ఎండ్ ఎయిర్‌పోర్టులో కుప్పకూలిన చిన్నవిమానం

**లండన్, జూలై 13:** లండన్‌సౌతెండ్ విమానాశ్రయంలో చిన్నవిమానం ఒకటి కూలిపోయింది. 12 మీటర్ల పొడవైన చిన్న విమానం కూలిపోయిందని ప్రత్యక్ష సాక్షి జాన్ జాన్సన్ వెల్లడించారు. ఆసమయానికి ఆయన తన కుటుంబంతోపాటు ఎయిర్‌పోర్టులోనే ఉన్నట్లు ఒక పెద్దఎత్తున మంటలు చెలరేగాయని, విమానంనుంచి ముందు తలభాగం నేలపైకి పడిపోయిందని ఆయన వివరించారు. విమానం టేకాఫ్ అయిన మూడునాలుగు సెకన్లకే ఎడమవైపునకు ఒరిగిపోయిందని ఆ తర్వాత కొన్ని సెకన్లకే కూలిపోయిందని జాన్సన్ తెలిపాడు. ఎయిర్‌పోర్టు ఫైర్‌సర్వీస్ సిబ్బంది వెంటనే స్పందించారు. రెండు ఫైర్ ఇంజిన్లు ప్రమాదస్థలికి వెళ్లాయి. స్థానిక పోలీసులు,అ ంబులెన్స్, ఫైర్‌సర్వీస్ వాహనాలు,సిబ్బంది హుటాహుటిన ప్రాంతానికి చేరుకని సహాయక చర్యలుప్రారంభించారు. ఎస్సెక్స్ పోలీసులు సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో తమకు హెచ్చరిక అదిందని, చిన్న ఎయిర్‌పోర్టులో ఈ సంఘటన పెద్ద ప్రమాదమేనని తెలిపారు. ఎక్కడినుంచి ఎక్కడికి ఈ విమానం వెళుతున్నదీ కూడా తెలియరాలేదు. విమానంలో ఎంతమంది ఉన్నారు? ప్రైవేటు విమానమా లేక ఏదేని సంస్థకు చెందినదా అన్నది కూడా దర్యాప్తుచేస్తున్నారు. అన్ని ఎమర్జెన్సీ విభాగాల సిబ్బందితో కలిసి పనిచేస్తున్నట్లు ఎస్సెక్స్ పోలీసులు తెలిపారు. సమీపప్రాంతంలో ఉన్న కుటుంబాలన్నింటినీ ఖాళీచేయిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఒక గోల్ఫ్‌క్లబ్, రగ్బీక్లబ్‌లను కూడా ఖాళీచేయించామన్నారు. స్థానిక ఎంపి డేవిడ్‌బర్టన్ శాంసన్ మాట్లాడుతూ అత్యవసర సర్వీసుల సిబ్బంది విధులకు ఆటంకం కలిగించవద్దని, ఆప్రాంతానికి ఎవ్వరూ రావద్దని విజ్ఞప్తిచేసారు. ఈ సంఘటనతో ఆదివారం మధ్యాహ్నం ఈ ఎయిర్‌పోర్టునుంచి కొనసాగే అన్ని సర్వీసులను రద్దుచేసినట్లు ప్రకటించారు.

## లక్నో బ్రహ్మోస్ ఎయిర్‌స్పేస్ కేంద్రంతో ఆత్మనిర్భరత బలోపేతం

### రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్

**లక్నో, జూలై 13:** లక్నోలో కొత్తగా ఏర్పాటైన బ్రహ్మోస్ ఏరోస్పేస్ పరీక్షా కేంద్రంతో రక్షణ రంగంలో భారత్ ఆత్మ నిర్భరత మరింత బలోపేతం అవుతుందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. దాని వల్ల ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయన్నారు. ఆదివారం లక్నోలోని నేషనల్ పీజీ కాలేజీలో ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత కాంగ్రెస్ సీనియర్ నేత చంద్రభాను గుప్తా విగ్రహాన్ని, స్మారక పోస్టల్ స్టాంపును ఆయన ఆవిష్కరించారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చంద్రభాను గుప్తా కీలక పాత్ర పోషించారని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. అధికారం అంటే పదవులు, హోదాలు మాత్రమే కాదని, బాధ్యత, త్యాగం, ప్రజా ప్రయోజనాల పరిరక్షణ అందులో కీలక భాగాలనే సందేశాన్ని ఇస్తూ చంద్రభాను గుప్తా జీవించారన్నారు. రాజకీయ విభేదాలు ఉండొచ్చు కానీ, శత్రుత్వాలు ఉండొద్దనే గొప్ప సందేశాన్ని ఆయన అందించారని రక్షణమంత్రి పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ లాంటి పెద్ద రాష్ట్రానికి మూడుసార్లు సీఎంగా సేవలు అందించినా, జాతీయ ఎజెండాతోనే చంద్రభాను గుప్తా ముందుకు సాగారని గుర్తు చేశారు. ఈక్రమంలోనే 1963లో కామరాజ్ ప్లాన్ కారణంగా సీఎం పదవికి ఆయన రాజీనామా చేశారని రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు. ప్రజల మద్దతుతో సీఎం అయిన ఒక నేత, కేవలం కొంతమంది అయిష్టత కారణంగా గద్దె దిగిపోవడం ఆనాడు ఎలా జరిగి ఉంటుందో మనం ఊహించుకోవచ్చన్నారు.

1963 అక్టోబరు 9న కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా కామరాజ్ ఎన్నికయ్యారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలం నాటి కాకోరీ ఘటన శతాబ్ది ఉత్సవాలను లక్నోలో ఘనంగా నిర్వహిస్తామని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ ప్రకటించారు. లక్నోకు సమీపంలోని కాకోరీ రైల్వే స్టేషన్‌లో ఆనాడు చోటుచేసుకున్న ఘటన నేటికీ అందరికీ గుర్తుందన్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఈ ఉత్సవాలను జరుపుతామని తెలిపారు. 1925 ఆగస్టు 9న కాకోరీ గ్రామం వద్ద ఓ రైలు నుంచి బ్రిటీష్ ప్రభుత్వపు నిధులను హిందుస్తాన్ రిపబ్లికన్ అసోసియేషన్ విప్లవ యోధులు స్వాధీనం చేసుకున్నారని ఆయన చెప్పారు. విప్లవ పోరాటానికి అవసరమైన ఆయుధాల కొనుగోలు కోసమే బ్రిటీష్ నిధులను ఆనాడు తీసుకున్నారన్నారు. కాకోరీ ఘటనతో బ్రిటీష్ పాలకుల పునాదులు కదిలాయని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. ఆ ఘటనలో రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లా ఖాన్, సచిన్ నాథ్ బక్షి వంటి విప్లవ యోధులు పాల్గొన్నారని తెలిపారు. మదన్ మోహన్ మాలవ్య, లాలా లజపత్ రాయ్ వంటి అగ్రనేతలు వారికి మద్దతు ప్రకటించారని రక్షణ మంత్రి చెప్పారు. ఆనాడు విప్లవ యోధుల తరఫున లాయర్ గోవింద్ వల్లభ్ పంత్‌తో పాటు చంద్రభాను గుప్తా కోర్టులో వాదనలు వినిపించారని గుర్తు




చేశారు. లా డిగ్రీని దేశ ప్రయోజనాల కోసం వినియోగించి, దేశభక్తిని చంద్రభాను గుప్తా చాటుకున్నారని కొనియాడారు. కాగా, కాకోరి ఘటనకు సంబంధించి 1927లో రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లా ఖాన్, ఠాకూర్ రోషన్ సింగ్‌లను బ్రిటీష్ ప్రభుత్వం ఉరితీసింది.

## సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కెసిఆర్ విజన్‌కు సాక్ష్యం: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 13:** సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు మాజీ సీఎం కేసీఆర్ విజన్‌కు మరో జీవన సాక్ష్యమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. పరిపాలన అంటే శంకుస్థాపనలు చేయడం మాత్రమే కాదని.. అభివృద్ధి, ప్రగతి అంటే రాజకీయ హంగులు ఆర్భాటాలు ఏమాత్రం కాదని సూచించారు. నిజమైన నాయకుడు ఒక తరం లేదా ఒక ఎన్నిక గురించి మాత్రమే ఆలోచించడని, తరతరాలపాటు రాష్ట్రానికి ప్రయోజనాలు కలిగించే ప్రణాళికలే నిజమైన నాయకుడి విజన్ అని పేర్కొన్నారు. కేసీఆర్ దూరదృష్టి ఫలితంగా రెండు అద్భుత ఫలితాలను తెలంగాణ నేడు సాధించిందని తెలిపారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ మోటార్లు ఆన్ కావడంతో ఖమ్మం జిల్లాలోని ప్రతి ఎకరానికి, వ్యవసాయ భూమికి సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. అలాగే, కెసిఆర్ హయాంలోని మరో అద్భుతం యాదాద్రి థర్మల్ ప్లాంట్, దామరచర్ల అల్ట్రా మెగా థర్మల్ పవర్ ప్లాంట్‌లోని యూనిట్ వన్ 72 గంటల కోడ్(సిఓడి)ను విజయవంతంగా పూర్తి చేసిందని వెల్లడించారు. తమ నాయకుడు కెసిఆర్ పాలన, విజన్ మా అందరికీ గర్వకారణమని కెటిఆర్ పేర్కొన్నారు.

## రాధికను ఆంక్షలతో నిర్బంధించారు!

### తండ్రి ఒత్తిడులే ఆమెపై ఎక్కువ

### ఆమె స్నేహితురాలు హిమాన్షిక సింగ్

**గురుగ్రామ్, జూలై 13:** టెన్నిస్ క్రీడాకారిణి రాధిక యాదవ్‌ను ఆమె తండ్రి కాల్చి చంపడంపై ఆమె ప్రాణ స్నేహితురాలు హిమాన్షిక సింగ్ స్పందించింది. రాధిక తనకు 2012 నుంచి తెలుసని, ఆమె తరచూ షార్ట్స్ ధరించేదని, అబ్బాయిలతో మాట్లాడేదని, తన ఇష్టప్రకారం జీవించేదని గుర్తుచేసుకుంది. ఇవే ఆమెను టార్గెట్ చేశాయని, రాధిక కదలికలను ఇంట్లోవారు నియంత్రించారని పేర్కొంది. బయటకు వెళ్లాక పలానా సమయంలో తిరిగి ఇంటికి రావాలని ఆంక్షలు విధించేవారని గుర్తుచేసుకుంది. ఆమె నాతో వీడియో కాల్‌లో ఉన్నప్పుడు, ఆమె ఎవరితో మాట్లాడుతుందో ఆమె తల్లిదండ్రులకు చూపించాల్సి వచ్చింది. టెన్నిస్ అకాడమీ తన ఇంటి నుంచి కేవలం 15 నిమిషాల దూరంలో ఉన్నప్పటికీ, ఆమె ఎప్పుడు తిరిగి రావాలన్న దానిపై డెడ్‌లైన్ ఉండేదని హిమాన్షిక పేర్కొంది. రాధికది సంప్రదాయ కుటుంబమని, దాదాపు ప్రతిదానితోనూ సమస్యలు ఉండేవని తెలిపింది. ప్రతి విషయంలోనూ నియంత్రణ విధిస్తూ రాధిక జీవితాన్ని ఆమె తండ్రి దుర్భరం చేశాడని



హిమాన్షిక ఆవేదన వ్యక్తంచేసింది. అతను తన నియంత్రణ, ప్రవర్తన, నిరంతర విమర్శలతో కుమార్తె జీవితాన్ని సంవత్సరాలుగా దుర్భరంగా మార్చాడు. షార్ట్స్ ధరించినందుకు, అబ్బాయిలతో మాట్లాడినందుకు, తన సొంత నిబంధనల ప్రకారం జీవించినందుకు వారు ఆమెను అవమానించారని పేర్కొంది. రాధిక తన ప్రాణ స్నేహితురాలిని, ఆమె ఎంతో మంచిదని వివరించింది.

వీడియోలు చిత్రీకరించడం, ఫోటోలు తీయడాన్ని రాధిక ఇష్టపడుతుందని కూడా ఆమె చెప్పింది. క్రమంగా వీడియోలు చిత్రీకరించడం వంటి ఆమె అభిరుచులన్నీ కనుమరుగయ్యాయి. ఆమె ఇంట్లో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంది. కుటుంబంపై సామాజిక ఒత్తిడి ఉంది. ప్రజలు ఏమనుకుంటారో అని తల్లిదండ్రులు ఎల్లప్పుడూ ఆందోళన చెందేవారు. వారు చాలా సనాతనవాదులని వివరించింది. ఇంట్లోని ఆంక్షలతో ఆమె ఊపిరాడనట్టు ఉండేదని హిమాన్షిక సింగ్ పేర్కొంది.

## అణ్వాయుధాలు వినియోగించే ఉద్దేశం మాకు లేదు

### పాక్‌ప్రధాని షెహబాజ్‌షరీఫ్

**కరాచి, జూలై 13:** ఆపరేషన్ సిందూర్ సమయంలో తమకు అణ్వాయుధాలను వినియోగించే ఉద్దేశం లేదని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇస్లామాబాద్‌లో పాకిస్థాన్ విద్యార్థులతో జరిగిన సమావేశంలో పాకిస్థాన్ అణు ప్రోగ్రామ్ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ వద్ద ఉన్న అణ్వాయుధాలు దాడి కోసం కాదు. వాటి ఉద్దేశం శాంతియుత ప్రయోజనాలు, జాతీయ రక్షణకోసమని షరీఫ్ స్పష్టం చేశారు. భారత్ పాక్ మధ్య అణు యుద్ధాన్ని ట్రంప్ పదేపదే చెబుతున్న వేళ, పాకిస్థాన్ ప్రధాని వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకొన్నాయి. ఇదిలా ఉండగా, భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్లో 55 మంది పాకిస్థానీలు ప్రాణాలు కోల్పోయారని షరీఫ్ పేర్కొన్నారు. అయితే, భారత్ చేపట్టిన దాడులకు తమ వైపు నుంచి కూడా ప్రతి దాడులు చేసినట్లు తెలిపారు. ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పౌరులు మరణించారు. ఈ దాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. మే 7న భారత సైన్యం పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్ర స్థావరాలపై బాంబు దాడులు నిర్వహించింది. ఇందులో బహావల్పూర్‌లో ఉన్న జైష్ఎమహ్మద్ కేంద్రాలు ధ్వంసమయ్యాయి. పాకిస్థాన్ ప్రస్తుత ప్రెసిడెంట్ అసిఫ్ అలీ జర్దారి తన పదవికి రాజీనామా చేస్తారన్న ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా కథనాలు కూడా వస్తున్నాయి. ఈ మేరకు రాజీనామాకు అలీపై ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. అలాగే, ప్రధాని షరీఫ్ అత్యంత ఆప్తుడైన ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్



ఆసిమ్ మునీర్‌ను నూతన రాష్ట్రపతిగా చేస్తారన్న అంశంపై వార్తలు వచ్చాయి. అయితే ఈ వార్తలను షెహబాజ్ షరీఫ్ షరీఫ్ ఖండించారు. ఇవి కేవలం ఊహాగానాలు మాత్రమే అని చెప్పుకొచ్చారు. మునీర్ ఎప్పుడూ రాష్ట్రపతి పదవి కావాలని అడగలేదని, అలాంటి ప్రణాళిక ఏదీ లేదన్నారు. తమ మధ్య పరస్పర గౌరవంతో సంబంధాలు ఉన్నాయని షరీఫ్ వివరించారు. ప్రెసిడెంట్ మార్పు అంశంపై పాకిస్థాన్ మంత్రి మోహ్సిన్ నక్వీ కూడా ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ ప్రచారం వెనుక ఎవరో మాకు బాగా తెలుసునని చెప్పుకొచ్చారు. విదేశీ శత్రు శక్తులు ఈ ప్రచారాన్ని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. తాము పాకిస్థాన్‌ను మళ్లీ బలంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. మునీర్‌ను 2022లో ఆర్మీ చీఫ్‌గా నియమించగా, ఆ తరువాత ఆయన పదవీకాలాన్ని మూడు సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాలకు పొడిగించిన విషయం తెలిసిందే.

## మీ సారీ కాదు.. న్యాయం కావాలి!

### అజిత్ లాక్‌మృతిపై టివికె విజయ్ భారీ ర్యాలీ

**చెన్నై, జూలై 13:** తమిళ నటుడు విజయ్ సారథ్యంలోని టీవీకే రాజకీయ పార్టీగా అవతరించిన తర్వాత తొలిసారి ఆందోళన కార్యక్రమం చేపట్టింది. నల్ల చొక్కా ధరించి నిరసన కార్యక్రమంలో పాల్గొన్న టీవీకే అధినేత విజయ్, స్టాలిన్ సర్కార్‌పై విమర్శలు కురిపించారు. ఖాళీ, పబ్లిసిటీ డీఎంకే సర్కార్ ఇప్పుడు సారీ మోడల్‌గా మారిపోయిందని అన్నారు. నాలుగేళ్ల డీఎంకే పాలనలో 24లాకప్ డెత్‌లు జరిగాయని ఆరోపించారు. వారి కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి మనకు ఎక్కువగా సారీ అనే సమాధానమే వస్తోంది. అన్నా యునివర్సిటీ కేసు నుంచి అజిత్ కుమార్ కేసు వరకు మీ పాలనలో ఇంకా ఎన్ని దారుణాలు చూడాలి? తమిళనాడు వ్యవహారాలపై కోర్టులు జోక్యం చేసుకుంటుంటే ప్రభుత్వం ఏం చేస్తోందన్నారు. అలాంటప్పుడు మీ పాలనతో మాకేం అవసరం ఉంటుంది, ముఖ్యమంత్రితో పని ఏం ఉంటుంది, అజిత్ కుమార్ పేద కుటుంబం నుంచి వచ్చిన యువకుడు. ఈ ఘటన తర్వాత సీఎం స్టాలిన్ సారీ చెప్పారు. మీ హయాంలో మొత్తం 24మంది కస్టడీలోనే మరణించారు. మరి మిగతా 23మందికి కూడా క్షమాపణలు చెప్పాలి. అలాగే మృతుల కుటుంబాలకు ఆర్థికసాయాన్ని అందించాలని విజయ్ డిమాండ్ చేశారు. సాతంకుళం లాకప్‌డెత్ కేసులో సీబీఐ విచారణకు కోర్టు ఆదేశించిన నేపథ్యంలో విజయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. శివగంగై జిల్లా తిరుప్పువనం సమీపం లోని మడపురంలో ప్రసిద్ధి భద్రకాళియమ్మన్ ఆలయానికి ఇటీవల ఇద్దరు మహిళలు వచ్చారు. ఆ సమయంలో ఆ ఇద్దరి భక్తుల నగలు అపహరణకు గురయ్యాయి.ఈ కేసులో ఆ ఆలయ సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న అజిత్‌కుమార్‌తోపాటు పలువురిని పోలీసులు విచారించారు.

## మేఘాలయ రామకృష్ణమిషన్‌ను సందర్శించిన కేంద్రమంత్రి

### కేంద్రం పనితీరుకు నిర్మలాసీతారామన్ ప్రశంసలు

**షిల్లాంగ్, జూలై 13:** కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ తన నాలుగు రోజుల పర్యటనలో భాగంగా ఆదివారం మేఘాలయలోని సోహ్రాలో ఉన్న రామకృష్ణమిషన్ ఆశ్రమ స్కూలును సందర్శించారు. ఈ కేంద్రంలో వనరులు పరిశీలిస్తూనే మంత్రి స్వామివివేకానంద, స్వామి రామకృష్ణానంద విగ్రహాల వద్ద నివాళి అర్పించారు. అలాగే మిషన్‌లోని వృత్తివిద్యా శిక్షణా కేంద్రాలను కూడా పరిశీలించారు. సుమారు 100 మందికిపైగా మహిళలు ఉచితంగా అక్కడ నేత కార్యక్రమంలోను, కుట్లు, అల్లికల్లో శిక్షణ పొందుతున్నారు. రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి అనురాగానంద మాట్లాడుతూ కేంద్ర మంత్రి మిషన్ కార్యక్రమాలలో సుదీర్ఘకాలంగా పాలుపంచుకుంటున్నారని అన్నారు. ఈశాన్యభారత్‌లో అత్యంత పురాతన కేంద్రంగా ఉన్న రామకృష్ణ మిషన్ సవాళ్లు ఎదురవుతున్నా సామాజిక సంక్షేమకార్యక్రమాలునిర్విఘ్నంగా కొనసాగిస్తోందని అన్నారు. మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఎక్కువగా స్వయం సాధికారతకోసం ఈ కేంద్రంలో తర్ఫీదు పొందడంపట్ల ఆమె సంతోషం వ్యక్తంచేసారు.

## మాజీ సీఎం జైరామ్‌ఠాకూర్‌కు తృటిలో తప్పిన ప్రమాదం!

సిమ్లా, జూలై 13: హిమాచల్ ప్రదేశ్‌లో తీవ్ర స్థాయిలో వచ్చిన వర్షాలు, వరదల తాకిడికి దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించేందుకు వెళ్లిన మాజీ సీఎం జైరామ్‌ఠాకూర్ తృటిలో ప్రాణాపాయంనంచి



తప్పించుకున్నారు. లమ్బాథాచ్ ప్రాంతంలో పర్యటించేందుకు వెళ్తున్న ఆ రాష్ట్ర మాజీ సీఎం ప్రతిపక్ష నేత జైరామ్ ఠాకూర్‌కు మండి ప్రాంతంలో తృటిలో ప్రమాదం తప్పింది. కొండ ప్రాంతం దాటుతుండగా కొండచరియలు విరుచుకు పడటంతో శిథిలాల మధ్య ఆయన కారు చిక్కుకుపోయింది. అయితే, ప్రమా దాన్ని ముందుగానే గ్రహించిన జైరామ్ ఠాకూర్ కారు దిగి మరి కొందరితో కలసి సురక్షితంగా ఆ ప్రాంతాన్ని దాటారు. దీంతో పెనుప్రమాదం తప్పింది. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. ఈ ఘటన అనంతరం ధార్వాడ్ థత్ ప్రాంతంలో పెద్దఎత్తున కొండచరియలు విరిగిపడి పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. రోడ్డులోని కొంత భాగం దెబ్బతినడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో సహాయ, పునరావాస కార్యక్రమాలకు ఆటంకం కలుగు తోందని ఆందోళన చెందుతున్న స్థానికులు తాజాగా విరుచుకు పడుతున్న కొండచరియలతో వణికిపోతున్నారు. స్థానిక యంత్రాంగం, డిజాస్టర్ మేనేజి మెంట్ అథారిటీ బృందాలు స్థానికులను ఖాళీ చేసేందుకు మోహరించి నప్పటికీ సహాయక కార్యక్రమాలకు వర్షాలు అంతరాయం కలిగిస్తున్నాయి. సహాయక కార్యక్రమాలను త్వరిగతిన చేపట్టాలని జైరామ్ ఠాకూర్ అధికారులను కోరారు.

## ఇటలీ నంబర్ వన్ కుర్రోడికి వింబుల్డన్ సింగిల్స్ టైటిల్

**లండన్, జూలై 13:** ఇటలీ నవయువకుడు ప్రపంచ నంబర్‌వన్ సినర్ వింబుల్డన్ ఫైనల్ పోరులో చెలరేగిపోయాడు. గడచిన రెరండుసీజన్లలో టైటిల్ నెగ్గిన రెండోసీడ్ డిఫెండింగ్ ఛాంపియన్ కార్లోస్ అల్కరాస్‌ను 4-6, 6-4,6-4, 6-4, వరుస సెట్లలో మట్టికరిపించి టైటిల్‌ను లాగేసుకున్నాడు. నువ్వానేనా అన్నట్లు సాగిన ఫైనల్‌లో తొలిసెట్‌ను కోల్పోయిన సినర్ ఆ తర్వాత అద్భుతంగా పుంజుకున్నాడు. ఒత్తిడిని చిత్తుచేస్తూ వరుస సెట్లలో విజయం సాధించాడు.సినర్‌కు ఇదే తొలి వింబుల్డన్ టైటిల్‌కావడం విశేషం.

## గ్యాంగ్‌స్టర్స్‌ను టార్గెట్ హత్యల కోసం వాడుతున్న బిజెపి

### పంజాబ్ ఆర్థికమంత్రి హార్‌పాల్‌సింగ్ చీమా

**అమృత్‌సర్, జూలై 13:** టార్గెట్ హత్యలు చేయించేందుకు గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్‌ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీవాడుకుంటున్నారని పంజాబ్ ఆర్థిక మంత్రి హార్‌పాల్ చీమా సంచలన ఆరోపణలు చేశారు.లారెన్స్ ద్వారా బిజెపి బెదిరింపులకు దిగుతోందన్నారు. ప్రస్తుతం లారెన్స్ బిష్ణోయ్ ప్రధానమంత్రి, కేంద్ర హోం మంత్రుల ఇలాఖాలోని జైలులోనే ఉన్నాడని హార్‌పాల్ చీమా పేర్కొన్నారు. ఒక వ్యాపారి హత్యకు బాధ్యత వహిస్తూ జైలు నుంచే లారెన్స్ బిష్ణోయ్ ప్రకటన చేశాడని, అంటే అతడు జైలు నుంచి విడుదలైనట్టే అని హార్‌పాల్ చీమా వ్యాఖ్యానించారు. పంజాబ్‌లో డ్రగ్ స్మగ్లర్లకు రక్షణ కల్పించేందుకు బిజెపి, కాంగ్రెస్ కలిసి పనిచేస్తున్నాయని హార్‌పాల్ చీమా విలేకరులలో ఆరోపించారు. ఆప్ నేతలు తాను మాట్లాడిన ఓ వీడియోను ఎడిట్ చేయించి, తప్పుడు అర్థం వచ్చేలా సోషల్ మీడియాలో వైరల్ చేయించారంటూ చండీగఢ్‌లోని సెక్టార్ 3 పోలీసు స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకుడు, అసెంబ్లీలో విపక్ష నేత ప్రతాప్ సింగ్ బజ్వా ఫిర్యాదు చేశారు. ఈ అభియోగాల



ఆధారంగా శుక్రవారం (జులై 11న) పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వంలో ఉన్న మంత్రులు హార్‌పాల్ సింగ్ చీమా, పంజాబ్ ఆప్ అధ్యక్షుడు అమన్ అరోరా పై ఐపీసీలోని 336 (4), 356, 61(2) సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదుచేసారు. దీనిపై స్పందిస్తూ హార్‌పాల్ చీమా పైవ్యాఖ్యలు చేశారు. బిజెపి, అకాలీ దళ్ పంజాబ్‌లో అధికారంలో ఉన్న టైంలో మాజీ మంత్రి, అకాలీ దళ్ నేత బిక్రమ్ సింగ్ మజీతియా పేరుతో డ్రగ్స్ దందా జరిగేదని హార్‌పాల్ చీమా ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే బిక్రమ్ సింగ్ మజీతియా మెడకు ఉరితాడు కట్టించి, అమెరికా సిఐఎ సిబ్బందే అతడిని తర్న్ తరన్ పట్టణానికి తీసుకొచ్చేలా చేస్తామని కాంగ్రెస్ నేత ప్రతాప్ సింగ్ బజ్వా అన్నారని ఆయన తెలిపారు. ఆప్ ప్రభుత్వం జూన్ 25న ఆధారాలతో సహా మజీతియాను అరెస్టు చేశాక, దాన్ని రాజకీయ అంశంగా మార్చేందుకు కాంగ్రెస్ యత్నిస్తోందని పంజాబ్ ఆర్థికమంత్రి హార్‌పాల్ చీమా ధ్వజమెత్తారు. ఈ ప్రయత్నంలో హస్తం పార్టీ ఫెయిలైందన్నారు. మజీతియా అరెస్టు వ్యవహారంలో ఏమీ చేయలేకపోతున్నామనే నైరాశ్యంతోనే తనపై, మరో ఆప్ మంత్రి అమన్ అరోరాపై కాంగ్రెస్ కేసులు పెట్టించిందన్నారు. ఈ వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీకి బిజెపి, కేంద్ర హోం శాఖ మద్దతు ఉందని ఆయన పేర్కొన్నారు. వాళ్లు చెప్పినట్టే చండీగఢ్ పోలీసులు పనిచేస్తున్నారని విమర్శించారు.

కాంగ్రెస్ నేత ప్రతాప్ సింగ్ బజ్వా నుంచి ఫిర్యాదు అందిన 24 గంటల్లోగా తమ ఇద్దరిపై ఎఫ్ఐఆర్ నమోదు కావడమే అందుకు నిదర్శనమని అన్నారు. పంజాబ్ రాష్ట్రంలో ఆప్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్, బీజేపీ, అకాలీ దళ్ కలిసి పనిచేస్తున్నాయని, వాళ్ల బెదిరింపులకు భయపడేది లేదన్నారు. మజీతియా ఒక స్మగ్లర్ అని మాజీ పంజాబ్ సీఎం చరణ్‌జిత్ సింగ్ చన్నీ, సీనియర్ కాంగ్రెస్ నేత నవజోత్ సింగ్ సిద్ధూ ఏకంగా విధాన సభలోనే వ్యాఖ్యలు చేశారని ఆయన గుర్తు చేశారు. చివరకు మజీతియాపై ఆప్ ప్రభుత్వం చర్యలను మొదలుపెట్టాక, నాడు విమర్శించిన నేతలే, నేడు సానుభూతిని వ్యక్తం చేస్తుండటం విడ్డూరంగా ఉందన్నారు. ఆప్ నేత హార్‌పాల్ చీమా అబద్ధాలు చెప్పడం, ఫోర్జరీ చేయడం, తప్పుడు వీడియోలు తయారు చేయడంలో పీహెచ్‌డీ చేశారు. ఆయనతో పాటు మరో మంత్రిపై నేను చండీగఢ్ పోలీసులకు ఫిర్యాదు చేశాను. దీని ఆధారంగా ఆప్ ప్రభుత్వంలోని మంత్రులు హార్‌పాల్ చీమా, అమన్ అరోరాలపై కేసు నమోదైంది. ఈ వ్యవహారంలో పంజాబ్ సీఎం భగవంత్ మాన్, ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్‌ల పాత్రపైనా విచారణ జరుగుతోంది. వారిపైనా అభియోగాలను దాఖలు చేశాను. వారిద్దరిపైనా కేసులు నమోదవుతాయని అనుకుంటున్నానని కాంగ్రెస్ నేత, అసెంబ్లీలో విపక్ష నేత ప్రతాప్ సింగ్ బజ్వా పేర్కొన్నారు.

# తెర



## చలన చిత్ర యవనికపై
# చెరగని జ్ఞాపకం

**విజయవాడ, జూలై 13, ప్రభాతవార్తప్రతినిధి:** 'నటన,జీవితం వేర్వేరు అనే భావన వదిలి పెట్టాల్సిన అవసరాన్ని కళాకారులు గుర్తిస్తేనే రంగస్థలం మీదైన..చలనచిత్ర పరిశ్రమలోనైనా నటించగలం' దివంగత నట దిగ్గజం కోట శ్రీనివాసరావు ఓ ముఖాముఖి కార్యక్రమంలో అన్న మాటలు ఇవి. జీవితంలో ప్రతి ఘట్టాన్ని ఆకళింపు చేసుకుంటూ ఎదిగినప్పుడు నటనలో అందులో అంతర్భాగమవుతుంది.నటనలో సజీవకత తొణికిసలాడుతుందని కోట శ్రీనివాసరావు అభిప్రాయపడేవారు.అందుకే ఆయన చలనచిత్ర రంగంలో దమ్మున్న నటుడిగా నిలిచారు, రాణించారు. సినిమా రంగాన్ని, రాజకీయరంగాన్ని శాసించిన దిగ్గజ నటులను పోలిన పాత్రల్లో నటించి, మొర ఎత్తుకుని పరిశ్రమలో నిలిచారు. మండలాధీశుడు వంటి చిత్రాల్లో ఆయన నటించినప్పుడు ఇక ఈ పని జౌట్ అన్న వారిని సైతం ఆశ్చర్యపరుస్తూ ఆయన చిత్రయానం అప్రతిహతంగా నడిచింది. వేషం పోతుందనో, దాడులు జరుగుతాయోనని ఆయన ఎప్పుడు భయపడలేదు. నువ్వు నటిస్తున్న పాత్ర ఫలానా వ్యక్తిని పోలిన పాత్ర అని చెప్పిన ఆయన వెనుకంజవేయలేదు. అందుకే కోట నటన నిఘంటువు సైతం వెతుక్కోలేని పదంగా మారింది. విలన్, హాస్యనటుడిగా, గుణచిత్ర నటుడిగా ఆయన తనదైన మార్కు నటన చూపారు. నటన రంగంలో దీవించిన దేవుడు జీవితంలో దెబ్బ కొట్టాడంటూ కోట వాపోయిన జీవన సందర్భం ఉంది. అదే సినిమాల్లో ఆయన వారసుడి నిలదొక్కుంటున్న కోట కుమారుని దుర్మరణం.జీవితం నన్ను కోలుకోలేని దెబ్బకొట్టింది. నటన ఆకాశానికి ఎత్తిదంటూ ఆయన అనేక సందర్భంలో కంట తడిపెట్టిన సందర్భాలున్నాయి. బెజవాడ దగ్గర కంకిపాడు అనే ఊరులో జన్మించారు కోట శ్రీనివాసరావు. ఆయన తండ్రి డాక్టర్ కోట సీతారామాంజనేయులు. డిగ్రీ చదువు పూర్తయ్యాక, కోటకు భాగ్యనగరంలోని నారాయణగూడ స్టేట్ బ్యాంకులో ఉద్యోగం లభించింది.ఆయన అప్పటి కృష్ణా జిల్లా ఇప్పటి ఎన్టీఆర్ జిల్లా ఎస్‌బిఐలోను పనిచేసారు. బ్యాంకులో లక్షలు లెక్కబెట్టినా, ఆయన మనసంతా నటనపైనే ఉండేది. నాటకాలపై ఉన్న ఆసక్తితో తరచూ నాటికలు, నాటక ప్రదర్శనల్లో పాల్గొంటూ రంగస్థలంపై తన ప్రతిభను చాటేవారు. కాల క్రమంలో కోటకి రంగస్థలం మాత్రమే కాదు, వెండితెరపై నటించాలన్న తలంపు ఉండేది. ఈ ఆశయంతో చిన్ననాటి కలలను పెద్దదిగా చేసుకుంటూ, ఒకసారి రవీంద్రభారతిలో నాటక ప్రదర్శనలో పాల్గొన్నారు. అప్పుడు దర్శకుడు క్రాంతికుమార్ ఆయన ప్రతిభను గమనించి, ప్రాణం ఖరీదు సినిమాతో కోట శ్రీనివాసరావును చిత్రపరిశ్రమకు పరిచయం చేశారు. అక్కడినుంచి కోట నట ప్రయాణం మరో దశ తిరిగింది. అభ్యుదయ దర్శకుడు టి. కృష్ణ రూపొందించిన ప్రతిఘటన చిత్రంతో కోటకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది.ప్రతిఘటన కోట నట జీవితానికి మలుపు.."తమ్మీ నేను మినిస్టర్ కాశయ్యను మాట్లాడతాండ.. అంటూ ప్రతిఘటనలో తెలంగాణ యాసలో పలికిన కోట శ్రీనివాసరావు డైలాగ్స్ అప్పట్లో ప్రేక్షకులను రంజింపజేశాయి. ప్రతిఘటన సినిమాలో గుడిసెల కాశయ్యగా ఆయన నటన తారస్థాయికి ఎదిగింది. సామాజిక చైతన్యాన్ని ఊపిరి పోసిన ఆ చిత్రంలో కోట నటన ప్రేక్షకులను మరిచిపోలేని రీతిలో ఆకట్టుకుంది. ఆ తరువా. వరుస సినిమాల్లో విలన్, కామెడీ పాత్రల్లో తనదైన శైలిని చూపిస్తూ మెప్పించారు.

## అసలైన పేరుతో డ్రిల్ మాస్టారు




మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న లేటెస్ట్ చిత్రాన్ని దర్శకుడు అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాను పూర్తి కామెడీ ఎంటర్ టైనర్‌గా తనదైన ట్రీట్మెంట్‌తో రూపొందిస్తున్నాడు దర్శకుడు అనిల్. అయితే, మెగాస్టార్ చిరంజీవి కెరీర్‌లో 157వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు మెగా157 అనే వర్కింగ్ టైటిల్‌తో చిత్రీ కరణ చేస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమాకు సంబంధించిన టైటిల్‌పై ఓ వార్త జోరుగా చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో చిరు ఓ డ్రిల్ మాస్టర్‌గా కనిపిస్తాడు. దీంతో ఈ సినిమాలో ఆయన పేరు శివశంకర్ వరప్రసాద్ గా ఉంటుందని.. అందుకే ఈ సినిమాకు మన శంకర్ వరప్రసాద్ గార్లు అనే టైటిల్‌ను ఫిక్స్ చేయాలని మేకర్స్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఇదే నిజమైతే చిరంజీవి ఫ్యాన్స్‌కు ఇది ట్రీట్ అని చెప్పాలి. తన అసలైన పేరుతో మెగాస్టార్ సినిమా వస్తుండటాన్ని వారు ఎంజాయ్ చేస్తారు. ఇక ఈ సినిమాలో నయనతార హీరోయిన్‌గా నటిస్తుండగా భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నాడు.

## మహావతార నరసింహా కోసం గీతా ఆర్ట్స్!

మన ఇండియన్ సినిమా దగ్గర యానిమేషన్ సినిమాలు రావడం అనేదే చాలా అరుదు కానీ ఈ జానర్ లో కూడా డివోషనల్ టచ్ తో కన్నడ నిర్మాణ సంస్థ హోంబళే ఫిలిమ్స్ వారు నిర్మాణం వచ్చిన చిత్రమే మహావతార నరసింహా. భారీ విజువల్స్ అండ్ ఊహించని యాక్షన్ ఎలిమెంట్స్ తో ఆస్యపరిచిన ట్రైలర్ మరిన్ని అంచనాలు పెంచింది. మరి పాన్ ఇండియా లెవెల్లో అనౌన్స్ చేసిన మేకర్స్ ఇపుడు తెలుగు రిలీజ్ పై ఓ అప్డేట్ అందించారు. ఈ సినిమాని మన టాలీవుడ్ దిగ్గజ నిర్మాతల్లో ఒకరైన అల్లు అరవింద్ తన గీతా ఆర్ట్స్ బ్యానర్ పై తెలుగులో భారీ లెవెల్లో విడుదల చేసేందుకు ముందుకొచ్చారు. దీనితో ఈ జూలై 25న మహావతార నరసింహా తెలుగు రాష్ట్రాల్లో గట్టిగానే విడుదల అయ్యేందుకు సిద్ధంగా ఉందని చెప్పవచ్చు. ఇక ఈ సినిమాకి సామ్ సి ఎస్ సంగీతం అందించగా అశ్విన్ కుమార్ దర్శకత్వం వహించారు.



## అందాలకే విందు..



ఇన్నాళ్లు చీరకట్టులో మన పక్కింటి అమ్మాయిలా కనిపిస్తూ సందడి చేసే హైదరాబాదీ బ్యూటీ కుషిత కల్లపు మరోసారి రెచ్చిపోయింది. అచ్చ తెలుగు సోయగం కుషిత కల్లపు రెచ్చిపోయింది. ఎప్పుడూ చీరకట్టులో మన పక్కింటి అమ్మాయిలా కనిపిస్తూ సందడి చేసే ఈ హైదరాబాదీ బ్యూటీ ఎలాంటి డ్రెస్ వేసుకున్నా అందులో ఒదిగిపోయి తన అందంతో ఎదు టి వారిని మెస్మరైజ్ చేసేది. తాజాగా హాలీడే ట్రిప్‌కు వెళ్లిన ఈ బ్యూటీ అక్కడ కేవలం చిన్న గుడ్డ పీలకతో ఎద అందాలను టైట్‌గా బిగించి వీధులన్నీ కలియ తిరుగుతూ కల్లోలం రేపింది. వంటి పై భాగంలో, నడుముపై లైవ్‌లో కలర్ ఫుల్‌గా టాటూస్ వేయించుకుని ఎంజాయ్ చేసింది. అప్పుడప్పుడు చూయించి చూయించనట్లు అందాల ప్రదర్శిస్తూ వచ్చిన ఈ ముద్దు గుమ్మ ఒక్కసారిగా రూట్ మార్చి అందాలను బాహాటంగా పరుస్తూ షాకిచ్చింది.

# నమస్తే తమ్మీ.. ఇక సెలవు



- కోట మృతితో టాలీవుడ్‌లో విషాదం
- భారీగా తరలి వచ్చి నివాళులర్పించిన తారాగణం
- 40 ఏళ్లపాటు 750కి పైగా సినిమాల్లో నటన
- కామెడీని మిళితం చేసి విలన్ పాత్రలకు జీవం
- ప్రతిఘటన, గాయం, తీర్పు, లిటిల్ సోల్జర్స్, గణేష్, చిన్నా, ఆ నలుగురు, పెళ్లైన కొత్తలో చిత్రాలకు నంది అవార్డులు

తెలుగు సినీమా వేదికపై ఓ కోట నిలిచింది.. ఇప్పుడు అది గడియారాన్ని ఆపేసినట్టు స్థబ్ధమైపోయింది. తెలుగు నటనకు ఒక పాఠశాల, ప్రతి పాత్రను జీవంగా మార్చిన కళాకారుడు... ఆయనే కోట శ్రీనివాసరావు. 1970ల నుంచి తెలుగు తెరపై తన స్వరంతో, నటనతో, శరీర భాషతో మాయ చూపిస్తూ... నవరసాలను ప్రేక్షకుల గుండెల్లోకి పోసిన మేటి నటుడు. సాధారణంగా కనిపించే పాత్రను అసాధారణంగా చేసి చూపించే నైపుణ్యం ఆయన సొంతం. హాస్య పాత్రలలో ఆయనే రాజు. కోట నటించిన ప్రతి సినిమాలో పాత్రకు ప్రాణం పోశారు. ప్రేక్షకుల్ని నవ్వించడమే కాదు, ఆలోచింపజేశారు. నటనా రంగాన్ని గౌరవించాల్సిన విధంగా తీర్చిదిద్దారు. ఆయన ఉన్నప్పుడు సహజ నటన అనే పదానికి అర్థం తెలిసింది. ఆయన వేసిన బాటపై ఎన్నో తరం నటులు నడుస్తున్నారు. నలభై సంవత్సరాల పాటు తనదైన శైలిలో విభిన్న కోణాలలో ప్రేక్షకుల గుండెల్లో చెరగని కోట నిర్మించుకున్న ఆయన ఆదివారం నమస్తే తమ్మీ..ఇక సెలవు అంటూ వీడ్కోలు తీసుకున్నారు. కోట శ్రీనివాసరావు ఇక లేరు అన్న వార్త తెలుగువారిని విషాదంతో ముంచెత్తింది.







కోట శ్రీనివాసరావు విలక్షణమైన అభినయాన్ని తలచుకొని కొందరు ఆయనను మరో నాగభూషణంగా అభివర్ణించారు. కొందరు రావు గోపాలరావుతోనూ, మరికొందరు నూతన్ ప్రసాద్‌తోనూ పోల్చారు. నిస్సందేహంగా కోటతో పోల్చిన వారందరూ ప్రతిభావంతులే. బహుశా, కోట కొన్ని చిత్రాలలో అంతకు ముందు వారు ధరించిన తరహా పాత్రలు పోషించి ఉండవచ్చు. అందువల్ల జనం ఆ మహానటులతో కోటనూ పోల్చారేమో అనిపిస్తుంది. పలువురిని అనుసరించినా, కోట తనకంటూ ఓ ప్రత్యేకమైన బాణీని ఏర్పరచుకున్నారు. వందలాది విలక్షణమైన పాత్రలకు తన సలక్షణమైన అభినయంతో ప్రాణం పోశారు. అందువల్ల కోట తీరే వేరుగా నిలచింది. అలా ప్రేక్షకుల మదిలో ప్రత్యేక స్థానం సంపాదించారు కోట.

**కోట అభినయానికి పెద్ద పీట వేసిన జంధ్యాల**

కోట శ్రీనివాసరావులోని కామెడీ రాజును వెలికితీసింది మాత్రం జంధ్యాల గారే. ఆయన చిత్రాలు కోట అభినయానికి పెద్ద పీట వేశాయి. కోట శ్రీనివాసరావు ప్రతిభను గమనించిన జంధ్యాల తన చిత్రాల ద్వారా కోటకు అవకాశాలు కల్పిస్తూ వచ్చారు. అమరజీవి, బాబాయ్ అబ్బాయ్ చిత్రాల్లో కోటకు చిన్న పాత్రలే ఇచ్చారు జంధ్యాల. ఎలాగైనా జంధ్యాల సినిమాలో నటించేసి పేరు సంపాదించాలని కోట శ్రీనివాసరావు తెగ ప్రయత్నిస్తూండేవారు. కానీ, జంధ్యాల బిగ్ రోల్ ఏదీ ఆఫర్ చేయలేకపోయేవారు. టి.కృష్ణ ప్రతిఘటనలో కాశయ్య పాత్రలో కోట అభినయం అందరినీ ఆకట్టుకుంది. అలాగే జంధ్యాలను సైతం ఆ సినిమా మురిపించింది.

**అహ...నా పెళ్ళంటలో అంచనాలకు మించి**

అయితే కోటలోని నటునికి ఛాలెంజ్ విసిరేలా జంధ్యాల అహ...నా పెళ్ళంట సినిమా కోసం లక్ష్మీ ్మపతి పాత్రను క్రియేట్ చేశారు. జంధ్యాల అంచనాలను మించి ఆ పాత్రలోకి పరకాయ ప్రవేశం చేశారు కోట. అందులో పలు సన్నివేశాల్లో కోట పూయించిన నవ్వులు ఈ నాటికీ గుబాళిస్తూనే ఉండడం విశేషం! సురేశ్ ప్రొడక్షన్స్ అధినేత డి.రామానాయుడు నిర్మించిన అహ...నా పెళ్ళంట ఘనవిజయం సాధించింది. ఆ సినిమా విజయోత్సవంలో కోటను ఆకాశానికి ఎత్తేశారు జంధ్యాల.

**తెలుగునేలపైన యాసలన్నిటితో జనం మనసులు గెలిచి..**

నాగభూషణం లాగా కామెడీని మిళితం చేసి పలు చిత్రాలలో కోట విలన్ గా మెప్పించారు. ఆయన లాగే కొన్ని సినిమాల్లో లేడీ గెటప్ లోనూ మురిపించారు కోట. అయితే రెండిళ్ళ పూజారిలో థర్డ్ జెండర్ గా నటించి కోట అలరించిన తీరును ఎవరూ మరచిపోలేరు. రావు గోపాలరావు లాగా కూడా సీరియస్ గా కొన్నిసార్లు, కామెడీతో మరికొన్ని మార్లు ప్రతినాయక పాత్రలు ధరించి ఉండవచ్చు. కానీ, తన గాత్రంతో వైవిధ్యం ప్రదర్శించారు కోట. నూతన్ ప్రసాద్ లాగా వాచికాభినయంతో కోట కూడా మైమరపించారు. అయితే తెలుగునేలపైని యాసలన్నిటినీ అచ్చు ఆ ప్రాంతాల్లోని వారు మాట్లాడే తీరునే వల్లించి జనం మనసులు గెలిచారు కోట. సెగట్రీ... అంటూ రావు గోపాలరావులాగే కోట అభినయించిన దాఖలాలూ ఉన్నాయి. రావు గోపాలరావుకు మల్లె రాజకీయాల్లోనూ రాణించిన వైనమూ కోటలో కనిపిస్తుంది. అయితే ఎవరిని అనుసరించినా, వారి పంథాను మాత్రం అనుకరించకుండా తనకంటూ ఓ ప్రత్యేక బాణీ ఏర్పరచుకున్నారు కోట. అందువల్లే కోట ఇకలేరన్న వార్త తెలియగానే ఇంతమంది మహానటులను గుర్తు చేసుకోవలసి వచ్చింది. వారి సరసన కూర్చోదగ్గ మేటి నటుడు కోట.

**హై కమాండ్ నడిగి చెబుతా..**

ప్రతిఘటనలో కాశయ్య పాత్రలో కోట అభినయం చూసి, కొందరు నటులు గుర్తుకు రావచ్చు. అయితే 'హై కమాండ్ నడిగి చెబుతా...అని తనదైన వాచకంతో సాగిన కోట నటన ... కాదు ఇతను ప్రత్యేకం అనిపించక మానదు. పిసినారి పాత్రల్లో పైన పేర్కొన్న నటులందరూ అలరించారు.

**ఎక్స్‌ప్రెషన్‌లతో కడుపుబ్బ హాస్యం**

కానీ, గుమ్మానికి కోడిని వేలాడ దీసి చికెన్ బిర్యానీ తింటున్నంత ఎక్స్ ప్రెషన్ ఇచ్చారే ఆ సీన్ లో ఆయనకంటే సీనియర్‌గా జంధ్యాల సినిమాల్లో కనిపించిన సుత్తి వీరభద్రరావును సైతం పక్కకు నెట్టి మార్కులు పట్టేసిన తీరును మరచిపోగలమా? శ్రీకనకమాలక్ష్మి ్మ రికార్డింగ్ డాన్స్ ట్రూప్‌లో యెల్లా పాపారావు పాత్రలోనూ కొందరిలా కనిపిస్తారు. కానీ, వారందరికంటే భిన్నంగా వాగ్ధాటితో తన బాణీ వేరని తేల్చి పారేస్తారు.

**శివలో విలక్షణంగా మాచిరాజు పాత్ర**

శివలో కితకితలు పెట్టకుండానే మాచిరాజు పాత్రను రక్తి కట్టించారే అది చూడగానే అది కదా విలక్షణమంటే అనిపించక మానదు. జంధ్యాల జయమ్ము నిశ్చయమ్మురాలో సినిమా పిచ్చి పటేల్ గా నటించిన కోటను చూశాక అసలు నిన్ను ఇతరులతో పోల్చలేమయ్యా అని అంగీకరించేస్తారు.

**బాబూ మోహన్‌తో కలిసి టన్నుల కొద్దీ హాస్యం**

ఇక తెలుగునాట దెబ్బలతో అబ్బా అనిపించేలా నవ్వించారు కోట. ఆయనను హీరోలు కొట్టినప్పుడు నవ్వులు పూసేవి. అలాగే కోట, బాబూ మోహన్ కలసి తన్నులతో టన్నుల కొద్ది హాస్యాన్ని తెలుగువారి సొంతం చేసిన తీరునూ మరచిపోగలమా? అంతకు ముందు కొందరు మహానటులు మాయల ఫకీర్లుగా రక్తి కట్టించారు. వారి వికృత వేషధారణ చూసి జనం జడుసుకున్నారు కూడా! అంత కంటే విలక్షణంగా గణేశ్ చిత్రంలో వికృతరూపంతో విలనీని పండించిన కోటకు జనం జేజేలు కొట్టకుండా ఉండలేకపోయారు. కాసులకోసం ఏమైనా చేసే కక్కుర్తి వెధవల పాత్రల్లోనూ కోట అలరించిన తీరు అనితరసాధ్యమే అనిపిస్తుంది. ఆమెలో అలాంటి పాత్రతోనే విధవరాలయిన కొడుకు భార్యనే డబ్బుల కోసం సొంతం చేసుకోవాలని చూసే పాత్రలోనూ కోట మెప్పించారు. ఆ పాత్రలో కోట మెప్పించక పోతే, కట్టుకున్న పెళ్ళామే అతడిని నరికి పారేస్తుంటే అలా జరగాల్సిందే... అని జనం కసిగా అనేవారు కారు.

**భయపెట్టడమూ.. నవ్వించడం రెండు ఆయనకే సాధ్యం..**

కేవలం కితకితలు పెట్టి నవ్వించడం వల్లో, భయపెట్టి ప్రతినాయక పాత్రలు ధరించడం వల్లో కోటను మహానటుడు అంటే అది కొంతే అవుతుంది. ఆయనలోని మరోకోణం పలు చిత్రాలలో కన్నీరూ పెట్టించింది. లిటిల్ సోల్జర్స్, ఆ నలుగురు సినిమాలు అందుకు నిదర్శనం. కోటలోని విలక్షణానికి రంకెలు వేస్తూ నంది ఆయన ఇంట ఎనిమిది సార్లు వచ్చి చేరింది. నాలుగు సార్లు బెస్ట్ విలన్ గా, మూడు సార్లు బెస్ట్ కేరెక్టర్ యాక్టర్‌గా, ఓ సారి బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్‌గా నంది అవార్డులను సొంతం చేసుకున్నారు కోట. ఆయన ఇక లేరు అన్న వార్త అభిమానులను ఆవేదనతో ముంచెత్తక మానదు. కానీ, ఆ నటనల కోట ఏనాడూ బీటలు వారదు. భవిష్యత్ లోనూ చెక్కుచెదరని దుర్గంలా నిలచే ఉంటుంది. శ్రీనివాసరావు ధరించిన వందలాది విలక్షణమైన పాత్రలు ఆ కోటను పరిరక్షి స్తూనే ఉంటాయి.

**చిరంజీవితో తొలి సినిమా..**

ఇక మెగా ఫ్యామిలీతో కోట శ్రీనివాసరావుకు ఎంతో అనుబంధం ఉంది. ప్రాణం ఖరీదుతోనే కోట శ్రీనివాసరావు, చిరంజీవి సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. ఇది యాదృచ్ఛికమే అయినా ఇద్దరూ కూడా సినీ ఇండస్ట్రీలో ఎనలేని కీర్తి ప్రఖ్యాతులు సంపాదించారు. ఆ తర్వాత వీరిద్దరు కలిసి ఎన్నో చిత్రాల్లో నటించారు. ఇక చిరంజీవి తమ్ముడు పవన్ కళ్యాణ్‌తోనూ కోటకి మంచి అనుబంధమే ఉంది. పవన్ తొలి చిత్రం అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి చిత్రంలో బాయ్స్ హాస్టల్ వార్డెన్‌గా కోట నటించారు. ఆ తర్వాత వీరిద్దరు కలిసి గోకులంలో సీత.. బద్రి చిత్రాల్లో పవన్‌కి తండ్రిగా నటించారు. అలాగే గబ్బర్ సింగ్, అత్తారింటికి దారేది లాంటి సూపర్ హిట్ చిత్రాల్లోనూ పవన్‌తో కలిసి నటించారు. గబ్బర్ సింగ్ సినిమాలో మందుబాబులం అంటూ కోట ఓ పాట కూడా పాడారు. కోట శ్రీనివాసరావు చివరగా 2023లో వచ్చిన సువర్ణ సుందరిలో కనిపించారు.

**పవన్‌తో ఆఖరి సినిమా?**

నాలుగు దశాబ్దాలకి పైగా తెలుగు సినిమాకి సేవలందించిన కోటా శ్రీనివాసరావు తన చివరి స్క్రీన్ ప్రెజెన్స్ ఈ నెల లోనే రాబోతున్న భారీ చిత్రం హరిహర వీరమల్లు లోనే ఉండబోతుందని తెలుస్తోంది. తాను చిన్న కీలక పాత్ర ఈ సినిమాలో చేసినట్టుగా సమాచారం.

## బావురు మన్న టాలీవుడ్

కోట శ్రీనివాసరావు భౌతిక కాయానికి పలువురు టాలీవుడ్ ప్రముఖులు వాళులర్పించారు. నిర్జీవంగా ఉన్న కోటని చూసి కన్నీటి పర్యంతమయ్యారు.

**కోట లాంటి నటుడు మళ్లీ పుట్టడు : చిరంజీవి**



కోట శ్రీనివాసరావు భౌతికకాయానికి చిరంజీవి నివాళులు అర్పించారు. కోట లాంటి నటుడు మళ్లీ పుట్టడని.. ఆన్ స్క్రీన్‌లోనే కాకుండా ఆఫ్ స్క్రీన్‌లో కూడా చాలా చమత్కారంగా మాట్లా డతారని చిరంజీవి అన్నారు. కోట శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

**రెండ్రోజుల క్రితమే ఫోన్ చేశా: బాబూమోహన్**

ఒకే తల్లికి పుట్టకపోయినా అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఉండేవాళ్లం. ఇద్దరం షూటింగులకు కలిసి వెళ్లి, పక్కపక్క గదుల్లో ఉండే వాళ్లం. ఆయన నా కోసం అన్నం కలిపి తినిపించిన రోజులున్నాయి. రెండు రోజులు క్రితమే ఫోన్ చేశాను. ఇంటికి వస్తా అన్నాను. కానీ నా కోటన్న చెప్పకుండా వెళ్లిపోయాడు .. అంటూ భావోద్వేగానికి గురయ్యారు సీనియర్ కమెడియన్ బాబూమోహన్.

**నటన ఉన్నంత కాలం ఆయన ఉంటారు : బ్రహ్మానందం**



కోట శ్రీనివాసరావు లేరనే విషయాన్ని నమ్మలేకపోతున్నా. వందల సినిమాల్లో కలిసి నటించాం.నేను, కోట, బాబు మోహన్ కలిసి రోజుకు18 గంటలు నటించాం. కోట మరణం తీరని లోటు. నటన ఉన్నంత కాలం ఆయన ఉంటారు. కోట శ్రీనివాసరావు నటరాజపుత్రులు. ఏ విషయాన్నైనా నిర్మొహమాటంగా మాట్లాడే వ్యక్తి. దాదాపు 4 దశాబ్దాల పాటు మేము కలిసి పనిచేశాం..

**కోట కూలిపోయింది : తనికెళ్ల భరణి**

నాటకాలు అంటే కోట శ్రీనివాసరావుకు ఎనలేని ఆసక్తి. అదే సినీ రంగ ప్రవేశానికి పునాది వేసింది. ఆయనతో వ్యక్తిగతంగా దశాబ్దాలకు పైగా పరిచయం ఉంది. సామాన్య మధ్యతరగతిలో పుట్టి అంచలంచెలుగా సినీ శిఖరంగా ఎదిగిన ఆయన ప్రస్థానం ఎంతో స్ఫూర్తిదాయకం. పోషించిన ప్రతి పాత్ర సంపూర్ణ నటుడిగా ఆయనకు గుర్తింపు తెచ్చింది. ఇప్పుడు సినీ పరిశ్రమ కోట కూలిపోయింది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని కోరుకుంటున్న.

**తీపి జ్ఞాపకాలు: రవి తేజ**

కోట శ్రీనివాసరావు గారిని చూస్తూ, ఆరాధిస్తూ.. ఆయన్నుంచి నేర్చుకుంటూ పెరిగాను. ఆయన నా కుటుంబంలో వ్యక్తిలాంటి వారు. ఆయనతో కలిసి పని చేసిన క్షణాలు.. నాకు తీపి జ్ఞాపకాలు. కోట శ్రీనివాసరావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా.

**బాధ మిగిల్చి వెళ్లిపోయారు: సాయి దుర్గ తేజ్**

విలక్షణ నటుడు, శ్రీ కోట శ్రీనివాసరావు గారి మరణం తెలుగు ఇండస్ట్రీకి మాత్రమే కాదు ఇండియన్ సినిమాకు తీరని లోటు. ఎన్నో సినిమాలలో ఆయన నటన అద్భుతం. స్క్రీన్ మీద కొన్నిసార్లు భయపెట్టి.. ఇంకొన్నిసార్లు చిరాకు తెప్పించి.. మరికొన్నిసార్లు కడుపులు చెక్కలయ్యేలా నవ్వించి.. చివరికి ఇలా మనకు బాధ మిగిల్చి వెళ్లిపోయారు కోట.

**ఎప్పటికీ సజీవంగానే ఉంటారు: విష్ణు మంచు**

అరుదైన ప్రతిభ కొద్దిమందికే దక్కుతుంది. ఆయనతో చాలా సినిమాల్లో పనిచేసే అదృష్టం నాకు కలిగింది. మనం ఆయనను శారీరకంగా కోల్పోయి ఉండవచ్చు, కానీ ఆయన కళ, ఆయన నవ్వు, ఆయన ఆత్మ ఆయన అలంకరించిన ప్రతి సన్నివేశంలో సజీవంగా ఉంటాయి.

**కోట అందరికీ నచ్చడు : ప్రకాష్‌రాజ్**

కోట గారి సినిమాలు చూసి చాలా స్ఫూర్తి పొందా., ఎన్నో సినిమాల్లో కలిసి నటించాం. ఆయన అందరికీ నచ్చడు.. ఎవరిని మెప్పించటానికి ప్రయత్నం చేయడని, ఆయనది ఒక ప్రజెన్స్ అని.. తన మాటల్లో ఓ వ్యంగ్యం ఉండేది. ఈమధ్య ఫోన్ చేశానని, మాతో కలిసి ఓ సినిమా సెట్‌లో గడిపారు.

# ఆత్మ న్యూనత ..



.దీనినే ఇంగ్లీష్‌లో ఇనిఫిరియారిటీ కాంప్లెక్స్ అంటారు. ఈ భావన పెరగడానికి కారణం మన తల్లి తండ్రులు, బంధువులు, స్నేహితులు మొదలైన వారు. ప్రతి దానిని ఒకరితో పోల్చడం, లేదా ప్రతికూల విమర్శలు చేయడం. ఇవి ఎంతగా మనిషి మనసు మీద ప్రభావం చూపుతాయంటే ,ఒక్కొక్క సారి ఆత్మహత్య చేసుకునే వరకు వెళ్తాయి. వారికి తాము ఏమి చేయలేము అనే భావన మహా వృక్షం లాగా పెరిగిపోతుంది. జీవితం వ్యర్థం అనుకుంటారు. ఉదాహరణకు పిల్లల్లో ఒకరు బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకుంటే, ఇంకొకరు అత్యసరి మార్కులు తెచ్చుకుంటారు. దానితో తల్లిదండ్రులులు చదువు విషయంలో పోల్చడం, మనసు బాధపడేలా మాట్లాడటం ,ఇతరుల దగ్గర కూడా వారిని పోలుస్తూ మాట్లాడటం చేస్తుంటారు. ఇవి ఎంత గుర్తు చేసుకోకూడదు అనుకున్న, చెద పురుగుల మనసుని తొలుస్తూ ఉంటాయి. ఇక ఆడపిల్లల విషయంలో అయితే చెప్పనవసరం లేదు, అంద చందాలు, రంగు రూపులతో పోలుస్తూ ,మేని ఛాయా తక్కువ అయితే నల్లపిల్ల అంటూ, శారీరక ఎదుగుదల తక్కువగా ఉంటే పొట్టిది అంటూ వారి మనసులో భావన కలిగేలా చేస్తారు. ఇలాంటి మాటల వల్ల ఆ పిల్లల్లో ఆత్మ న్యూన్యత భావన క్రమంగా పెరిగి ,తమ బాధను ఎవరికి చెప్పుకోలేక కుంగిపోతుంటారు. దీనిని అధిగమించాలంటే తమతో స్నేహంగా, ఆత్మీయంగా ఉండే వారిని అడిగి తెలుసుకోవాలి. వారు నిజాయితీగా తమలోని లోపాలని చెప్పినప్పుడు, తమని తాము ప్రశ్నించుకోవాలి, నేను ఎందుకు ఇలా ఉన్నాను?, ఎందుకు ఇలా చేస్తున్నాను? ఎందుకు ఇలాప్రవర్తిస్తున్నాను,? ప్రవర్తనలోని కారణాలను వెతికి ,ఆ కారణాలు ఆత్మ న్యూన్యత భావన వల్లనే అని అనుకున్నాక, అసలు ఈ ఆత్మ న్యూన్యతకు కారణాలు ఆలోచించి అది పోవడానికి పరిష్కారం ఆలోచించాలి. సమాజంలో తమలాంటి వారు దీనిని ఎలా అధిగమించారో ,అందుకు ఎవరెవరు సహకరించారో తెలుసుకోవాలి. లేదా తమకు అత్యంత సన్నిహితులైన వారి సాయంతో, తమ భావాలను పంచుకుంటూ సానుకూల దృక్పధాన్ని పెంచుకుంటూ జీవితంలో ముందుకు సాగాలి. నిత్యం ఇటువంటివి ఇంచుమించు చాలా కుటుంబాల్లో చూస్తుంటాము. పిల్లల మనసులు చాలా సున్నితం. వారిని ఒకరితో పోల్చడం సరికాదు. ఒక్కకరికి ఒక్కో నైపుణ్యం ఉంటుంది. అది గుర్తించి వారిని ప్రోత్సహిస్తే అద్భుతాలు చేయగలరు.

**- పాలపర్తి సంధ్యా రాణి**

# జియాలజీ శిక్షణకు ఎంపికైన తొలి భారతీయురాలు



**'అమ్మమ్మా.. ఆ చంద్రుడేంటి నేనెక్కడికి వెళ్తే అక్కడికి వస్తున్నాడు? 'నిన్ను తన దగ్గరికి రా రమ్మని పిలుస్తున్నాడు లేమ్మా' చిన్నారి అడిగిన ప్రశ్నకు బామ్మ ఇలా సరదాగా సమాధానమిచ్చింది. కానీ ఆ పాప మాత్రం దాన్ని సరదాగా తీసుకోలేదు. అంతరిక్షంలోకి అడుగుపెట్టాలి. చుక్కల అంచులను తాకాలి అనుకుంది. అనుకున్నట్టుగానే కల నిజం చేసుకుంటోంది. జాహ్నవి దంగేటి.. తాజాగా అంతరిక్ష యాత్ర చేసే అవకాశాన్ని దక్కించుకుందీ తెలుగమ్మాయి**

'అమ్మమ్మ మాట, తను చెప్పే చంద్రుడు-పేదరాసి పెద్దమ్మ కథల పుణ్యమాని చంద్రుడిపై ఆసక్తి కలిగింది. అక్కడికి వెళ్లి, పేదరాసి పెద్దమ్మ ఇచ్చే బహుమతులు తెచ్చుకోవాలి అనుకునేదాన్ని. పెద్దయ్యాక ఏమవుతావని ఎవరడిగినా చంద్రుడి మీదకు వెళ్తీననేదాన్ని. ఒక పెద్ద నిచ్చెనతో ఎక్కేస్తా అనీ చెపేనపదాన్ని. అలాంటి నాకు 11 ఏళ్ల వయసులో నాసా పరిచయమైంది అని గుర్తు చేసుకుంటుంది జాహ్నవి. ఈమెది పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు. అమ్మానాన్నలు శ్రీనివాస్, పద్మశ్రీ. ఆస్ట్రోనాట్ అవ్వాలన్న లక్ష్యం ఏర్పడ్డాక దాని గురించి సమాచారం సేకరించడం మొదలు పెట్టింది జాహ్నవి. 16 ఏళ్ల వయసులో ఇస్రోవరల్డ్ స్పేస్ వీక్‌లో పాల్గొంది. అక్కడ ఎంపికైన 2000 ప్రాజెక్టుల్లో తనదీ ఒకటి. అలా తన కల దిశగా ప్రయాణం ప్రారంభించింది. ఆస్ట్రోనాట్‌లకు అవసరమని స్కూబా డైవింగ్‌నీ ప్రయత్నించిందంటే తన పట్టుదలేంటో అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు, దేశంలోనే పిన్న అడ్వాన్స్‌డ్ స్కూబా డైవర్‌గానూ నిలిచింది. ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ చదివింది జాహ్నవి. బిటెక్ చేస్తున్నప్పుడే నాసా పదిరోజుల ప్రోగ్రామ్‌కి ఎంపికైంది. ఆ అవకాశం అందుకున్న తొలి భారతీయురాలు. మిషన్ డైరెక్టర్‌గా మినీ రాకెట్, అండ్ వాటర్ రాకెట్ లాంచ్‌ల్లో భాగైమంది. ఆ అనుభవం 2022లో పోలాండ్‌లో లూనార్ మిషన్‌లో పాల్గొనే అవకాశాన్ని ఇచ్చింది. అక్కడ అచ్చం చంద్రుడిపై ఉండే వాతావరణమే ఉంటుంది. కాకపోతే మానవ నిర్మితం, 12 రోజులపాటు ఆ వాతావరణంలో గడిపా. అయిదేళ్లనాటి నా కల ఆనాడు అలా నిజమైంది అంటుంది జాహ్నవి. అతిపిన్న అనలాగ్ ఆస్ట్రోనాట్‌గా గుర్తింపు పొందిన జాహ్నవి.. ఐస్‌లాండ్‌లో జరిగే జియాలజీ శిక్షణకు ఎంపికైన తొలి భారతీయురాలు .



**రెండు సూర్యోదయాలు, రెండు సూర్యాస్తమయాలు**

2023 ఆస్ట్రోనాటికల్ సైన్స్‌లో చేరే అవకాశం వచ్చింది. ఇదివరకే ఒకసారి తిరస్కరణకు గురైన జాహ్నవికి అది గొప్ప అవకాశం. అక్కడ సిమ్యులే ఫైట్ ఎక్సర్‌సైజెస్, మిషన్ డ్రిల్స్ వంటి అనేక అంశాల్లో నిపుణుల పర్యవేక్షణలో శిక్షణ తీసుకున్నారు. తాజాగా అంతరిక్షంలోకి అడుగుపెట్టే అందుకుంది. అమెరికాకు చెందిన ప్రైవేటు అంతరిక్ష పరిశోధన సంస్థ 'టైటాన్ స్పేస్ ఇండస్ట్రీస్' చేపట్టిన 'టైటాన్ స్పేస్ మిషన్' ఆస్ట్రోనాట్ క్యాండిడేట్ జాహ్నవి ఎంపికైంది. దీనికోసం మూడేళ్లపాటు వ్యోమగామి శిక్షణలో పాల్గొంటుంది. ఫైట్ సిమ్యులేషన్, స్పేస్ క్రాఫ్ట్ ప్రొసీజర్లు, సర్వైవల్ ట్రైనింగ్, మెడికల్, సైకలాజి అసెస్‌మెంట్లు ఇందులో భాగంగా ఉంటాయి. ఇది పూర్తయిన తర్వాత 2029లో 5గం. పాటు ఆర్బర్ స్పేస్ ఫ్లైట్‌లో సరఫరా చేయబడుతుంది. మానవ అంతరిక్ష ప్రయాణంలో ఇది ముందడుగు. ఈ ప్రయాణంలో రెండు చొప్పున సూర్యోదయాలు, సూర్యాస్తమయాలను గమనించనున్నాం. ఈ అవకాశాన్ని అందుకోవడం గొప్పగా 'భావిస్తున్న' అంటోన్న జాహ్నవి తన ప్రయాణంలో ఎన్నో గుర్తింపులూ, అవార్డులూ అందుకుంది. అన్వెంచర్ స్పోర్ట్స్‌లో రికార్డులూ సృష్టించింది. అలాగని తన ప్రయాణమేమీ సులభం కాదు. "అమ్మలకు సులువు కాదన్న మాటలు, రోజులపాటు శిక్షణలో భాగంగా ప్రపంచానికి, అయినవాళ్లకు దూరంగా ఉండాలి, సరైన ఆహారమూ ఉండదు కానీ ఇవన్నీ కలల సాధనలో మామూలే అనుకుంటూ సాగింది జాహ్నవి. అంతేకాదు. పట్టుదల ఉండాలే కానీ ఏదీ అసాధ్యం కాదని యువతలో స్ఫూర్తిని నింపు తోందంటే 23 ఏళ్ల అమ్మాయి. అంగారకుడిపై అడుగుపెట్టాలి, భవిష్యత్ అంతరిక్ష ప్రోగ్రాముల్లో దేశం తరఫున ప్రాతినిధ్యం వహించాలన్నవి తన లక్ష్యాలు. ఆల్ ద బెస్ట్ చెప్పేదామా మరి!

# పనీర్ రుచే వేరు



**చాలామందికి చాలా ఇష్టమైంది పనీర్. దీంతో చేసినకూరలు, స్నాక్స్.. ఏవైనా మహత్తరంగా ఉంటాయి. పనీర్ రుచే కాదు, బలం కూడా. అయితే మార్కెట్లో దొరుకుతున్న పనీర్ మంచిదో కాదో తప్పకుండా తెలుసుకోవాలి. ఎలాగంటారా? అందుకు ఐదు మార్గాలున్నాయి.**

✸ అసలు పనీర్‌ను చూడగానే అర్థమైపోతుంది. అది మంచిదో కాదో. తాజా పనీర్ తెల్లగా లేదా క్రీమ్ రంగులో ఉంటుంది. ముదురు పసుపు రంగులో ఉన్నా లేదా మొత్తం ఒకే రంగులో కాకుండా..కొంత ఒక రంగులో, మరికొంత ఇంకో రంగులో ఉన్నా.. అది స్వచ్ఛమైంది కాదని గ్రహించాలి.


✸ ఓ చిన్న ముక్కను నలిపి చూస్తే కొద్ది మెత్తగా తగులుతుంది. నాణ్యమైంది మరీ మెత్తగా లేదా మరీ గట్టిగా ఉండదు.

✸. వాసన చూస్తే తెలిసీ తెలియనట్టుగా కొద్దిగా పాల మిఠాయి వాసన వస్తుంది. అలా కాకుండా గాఢమైన లేదా పుల్లటి వాసన వచ్చిందంటే స్వచ్ఛంగా లేదన్నమాట.

✸ పనీర్ ముక్కను నీళ్ల గ్లాసులో వేస్తే.. మంచిదైతే మునిగిపోయి, అడుగున చెక్కుచెదరకుండా ఉంటుంది. కల్తీది కరిగిపోతుంది లేదా విరిగిపోతుంది.

✸పనీర్‌ను నూనె లేకుండా పెనం మీద వేడి చేయండి. మంచిదైతే ఆకారం మారదు. కొద్దిగా తేమ బయటికొస్తుంది. అదే కల్తీ పనీర్ అయితే కరిగిపోతుంది లేదా అందులోంచి చాలా నీరు వస్తుంది.

# సరదాగా చేయండి..



ఆరోగ్యం కోసం చేసేది మనకు తెలిసిన విషయమే. తప్పనిసరిగా చేయాల్సిందే అని అనుకుని మొదలూ పెడతాం. కొన్ని రోజులకే తోడు లేరనో, కష్టంగా ఉందనో వదిలేస్తాం. ఈసారి నుంచి అరగంటపాటు వీటిని ప్రయత్నించండి. **సరదాగానూ తోస్తుంది, వ్యాయామంగా కూడా అనిపిస్తుంది.** మొక్కలు పెంచేయండి. గుంతలు తీయడం, మొక్కలు నాటడం, వాటికి నీళ్ల పోయడం, కలుపు తీయడం... తెలియకుండానే బోలెడంత శ్రమ. ఒకరకంగా స్ట్రెచింగో సమానమే. మొక్కల మధ్య గడపడం కార్టిసాల్ ఆనంద స్థాయుల్ని తగ్గించి, ఇస్తుంది. అందుకే దీన్నో థెరపీగానూ చెబుతారు. నచ్చిన పాటలు పెట్టుకోండి. వింటూ చక్కగా డ్యాన్స్ చేయండి. 'నాకు రాదుగా...' అన్న బెంగే అక్కర్లేదు. ఇక్కడ మనమేం పోటీలకు వెళ్లట్లేదు కదా! నచ్చినట్టుగా చేస్తూ వెళ్లండి. అయితే ఫాస్ట్ బీట్ ఉన్నవాటినే ఎంచుకోవాలి. ఈ ఫ్రీ స్టైల్ డ్యాన్స్ 250 వరకూ కెలోరీలను కరిగించగలదట. ఫ్లెక్సిబిలిటీని పెంచుతుంది. డిప్రెషన్ అంటే తగ్గించే శక్తి నృత్యానికి ఉందట. గుండె ఆరోగ్యానికి మేలే. ఇంకేం కాలు కదిపి చూడండి. హులా హూప్ ప్రయత్నించండి పొట్టనే కాదు బరువు తగ్గించడంలోనూ ఇది సాయపడుతుంది. ఫ్లెక్సిబిలిటీ, సమన్వయాలనీ పెంచుతుంది. పోనీ ఇంటి చుట్టుపక్కల పిల్లలున్నారా? వాళ్లతో పాకడం, పరుగెత్తడం, డ్యాన్స్ వంటివాటిల్లో పోటీలు పెట్టుకుని ఆడండి. సరదాగా ఉంటుంది. చక్కని వ్యాయామంటానూ పనిచేస్తుంది. ఆనందాన్ని నింపే హార్మోన్లు విడుదల చేయడం అదనం. బోర్ అనిపించే వ్యాయామాలకు ఇవి చక్కని వ్యాయామంలానూ పనిచేస్తుంది.

# వన్నెచిన్నెలున్న గ్లాసు







చల్లచల్లని పానీయాలు తాగే వారు వాటిని సాదాసీదా గ్లాసుల్లో తాగేస్తామా ఏంటి? చూడ్డానికి ఇలా వన్నెచిన్నెలున్న గ్లాసులని ప్రయత్నించండి ముచ్చటగా ఉంటాయి. పార్టీలకు డైనింగ్ టేబుళ్లకి కొత్తదనం మోసుకొస్తాయి.








## చెలి చిట్కా

❍ ఖాళీ చేసిన నెయ్యి లేదా నూనె ప్యాకెట్‌లో పప్పులు నిలువ చేసిన ఎంతో కాలం నిలువవుంటాయి. ❍ ఎండు కొబ్బరిని సులభంగా తురమాలంటే దానిపై కొద్దిగా నీళ్లు చల్లి ఫ్రిజ్‌లో ఉంచాలి.

# జాగ్రత్తలు అవసరం

**మహిళలు ప్రతి ఉదయం వ్యాయామంలో భాగంగా అరగంటసేపు పరుగుపెడతారు. అయితే తరచూ కీళ్లనొప్పి వస్తుండటంతో వైద్యులను సంప్రదిస్తే చికిత్స తప్పనిసరైంది. పరుగు పెట్టేటప్పుడు మనం చేసే కొన్ని పొరపాట్లవల్ల ఆరోగ్యానికి బదులుగా మరిన్ని అనారోగ్యాలు చుట్టుముట్టే ప్రమాదం ఉందని నిపుణులు. హెచ్చరిస్తున్నారు. కాబట్టి కొన్ని జాగ్రత్తలతో వీటి నుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నారు. అవేంటో చూద్దాం.**



★ పరుగుపెట్టడం ఆరోగ్యానికి మంచిదే కదా, అటువంటప్పుడు అనారోగ్యాలేంటి అనుకోకూడదు. వేగంగా పరుగెట్టేటప్పుడు కొన్నిసార్లు చీలమండ బెణకడం, ఒత్తిడి పెరగడంవంటి సమస్యలకు గురవుతుంటాం. కాబట్టి జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి. కొంచెం నొప్పే కదా.. పరుగు పెడుతుంటే అదే తగ్గుతుందనుకుంటే క్రమేపీ కండరాల అసమతుల్యత మొదలవుతుంది. ఇది దీర్ఘకాల సమస్యగా మారి, వెన్నునొప్పికి దారి తీస్తుంది.

★. చాలామంది రన్నర్లు ఓవర్‌స్ట్రైట్ రన్నింగ్‌గా అడుగులు దూరంగా వేస్తూ పరుగుపెడుతుంటారు. దీనివల్ల మోకాలిపై ఒత్తిడి పెరుగుతుంది. ఇది మోకాళ్లతోపటు చీలమండపైనా చెడు ప్రభావం పడేలా చేస్తుంది. కాలక్రమేణా ఉండాలంటే వేగంగా నడిచినా లేదా పరుగు పెట్టినప్పుడైనా అడుగుల మధ్య సహజమైన దూరాన్ని పాటించడం మంచిది.

★ అధికబరువు తగ్గాలనీ, లేదా నిత్యం వ్యాయామం ఆరోగ్యకరమనే నియమాన్నీ పాటించడానికి పరుగుపెడుతుంటాం. అటువంటి సమయంలో కొన్నిసార్లు అసౌకర్యంగా అనిపిస్తుంటుంది. పాదాలవద్ద బెణికినట్లు లేదా కీళ్ల వద్ద చిన్నగా నిప్పి మొదలవు తుంది. ఇటువంటివాటిని నిర్లక్ష్యం చేయకూడదు. నొప్పిని విస్మరించ దానికి ప్రయత్నిస్తూ పరుగును కొనసాగించకూడదు. ఈ తీవ్రత పెరిగి కీళ్లకు సంబంధించిన అనారోగ్యాలు మొదలవుతాయి. మన శరీరం చెప్పేదాన్ని వినడం, వైద్యసలహా తీసుకోవడం మంచిది. ★ వ్యాయామానికే కాదు, పరుగు పెట్టే ముందు కూడా వార్మ్-అప్ తప్పనిసరి. లేదంటే కీళ్ల గాయాలు మొదలవుతాయి. పరుగుపెట్టేటప్పుడు ఎటువంటి సమస్యలు తలెత్తకూడా సౌకర్యంగా ఉండాలంటే ముందుగా ఓ పది నిమిషాలపాటు వార్మ్-అప్ చేయాలి. దీనివల్ల కీళ్లు, పాదాలపై ఒత్తిడి కలగనివ్వకుండా, అలాగే పరుగుపెట్టడానికి కండరాలు కీళ్లను సిద్ధం చేస్తాయి. ★ పరుగెత్తేటప్పుడు సౌకర్యంగా ఉండటానికి మనం ధరించే బూట్లు కూడా సహకరించాలి. బిగుతైన పాదరక్షలు కీళ్లపై ఒత్తిడి పెంచుతాయి. ఫ్లాట్‌గా ఉండేవాటిని ఎంచుకోవాలి. నిపుణుల సూచనలు తీసుకుంటే పరుగు మన ఆరోగ్యాన్ని పరిరక్షిస్తుంది.

# కాకర చేదు పోయేదెలా?

కాకరకాయ పేరు చెబితే చాలు కొందరు అయిష్టంగా ముఖం పెడతారు. అందులో పంచదార వేసిన చేదుగానే ఉంటుందని దూరం పెట్టేస్తారు. కానీ కాకరలో బోల్డన్ని మందులు గుణాలున్నాయి కనుక తరచుగా తింటుండాలి. వాటి చేదు విరిగే మార్గాలూ ఉన్నాయి. కరకాయ ముక్కల్లో తగినంత ఉప్పు, పసుపు, చింతపండు రెబ్బలు వేసి ఉడకబెడితే.. చేదు తగ్గుతుంది. కూర పూర్తయ్యాక.. చివర్లో తగినంత పెరుగు కలిపితే చేదనిపించదు. ముక్కల్లో కాస్త రాళ్ల వేసి పక్కనుంచాలి. అరగంట తర్వాత అందులో చేరిన నీరు పోయేదాకా రెండుమూడుసార్లు గట్టిగా పిండితే చేదు పోతుంది. కాకరకాయల కంటే ఎక్కువ మోతాదులో ఉల్లి, టొమాటో ముక్కలు జతచేస్తే చేదు. గ్లాసు నీళ్లలో రెండు మూడు చుక్కలు వెనిగర్ కలిపి, అందులో కాకరకాయ ముక్కలను అరగంట నానబెడితే చేదు విరుగుతుంది. కాకరకాయ కూరలో కాస్త శనగపిండి వేస్తే చేదనిపించదు. కాయలకు గరుకుగా ఉంటే తొలగిస్తే చేదు తగ్గుతుంది. ముక్కలు కోసి ఉప్పు, పసుపు కలిపి రెండు రోజులు ఎండబెట్టి వాటితో కూరచేస్తే చేదనిపించదు.



# అసలైన భక్తి

ధర్మనిష్ఠ, దానధర్మాలు, అతిథి సత్కారాలకు పెట్టింది పేరుగా జీవించేవాడో భక్తుడు. ఓ రోజు రాత్రి కుటుంబసభ్యులు, పనివారు కూడా నిద్రపోయాక తలుపు చప్పుడైంది. అతడెళ్లి తలుపు తీస్తే ఓ వృద్ధుడు- అన్నం తిని వారమైంది అన్నాడు దీనంగా. హృదయం ద్రవించి, అయ్యా! భగవంతుడి తరఫున నా ఆతిథ్యం స్వీకరించి, అనుగ్రహించు అన్నాడు. వృద్ధుడు భిక్ష ఆరగించి 'అన్నం పెట్టిన మీకు కృతజ్ఞతలు. కానీ భగవంతుడి ప్రస్తావన ఎందుకు మధ్యలో? ఆయనపై నాకు నమ్మకం లేదు అన్నాడు. అది విని భక్తుడు నిశ్చేష్టుడయ్యాడు. పరమాత్మ ఉనికిని ప్రశ్నిస్తాడేంటని బాధపడ్డాడు. వృద్ధుడు అంతటితో ఆగకుండా కనిపించని ఆ దేవుణ్ణి నమ్మడం వృథా! అంటూ ఎద్దేవా చేశాడు. దాంతో భక్తుడు ఆగ్రహించి.. అతడి ముందున్న పళ్లెం లాక్కుని బయటకు గెంటేశాడు. ఆ రాత్రి కళలో దైవం కనిపించి ఆకలి తీరకుండానే ఆ వృద్ధుణ్ణి గెంటేశావేం నాయనా?అన్నాడు. అది విన్న పరమాత్మ 'నాయనా! ఏళ్ల తరబడి అతను నా ఉనికిని సందేహిస్తూ, నిందిస్తున్నా.. భరిస్తూనే ఉన్నాను. అతడి అవసరాలు తీరుస్తూనే ఉన్నాను. నాస్తికుల్నీ ఆదరించే స్వామి అవ్యాజ ప్రేమ ఆ భక్తుణ్ణి ముగ్ధుణ్ణి చేసింది.



ఆధ్యాత్మికం


## షూటింగ్ ప్రపంచ కప్‌లో..
# తొలిసారి ఫైనల్‌కు నీరు



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ షూటింగ్ స్పోర్ట్ ఫెడరేషన్ ప్రపంచ కప్ షాట్‌గన్ స్టేజ్ చివరి రోజున జాతీయ క్రీడల ఛాంపియన్ భారత్ షూటర్ నీరు దండా మహిళల ట్రాప్‌లో తొలిసారిగా ప్రపంచ కప్ ఫైనల్‌కు చేరుకుని నాల్గవ స్థానంలో నిలిచింది. ఇటలీలోని లోనాటోలో జరుగుతున్న నాల్గవ, చివరి అంతర్జాతీయ స్పోర్ట్స్ టోర్నీలో 50 షాట్‌ల ఫైనల్‌లో ఆమె తన మొదటి 35 లక్ష్యాలలో 30 వాటిల్లో ఆధిక్యం కనపరచింది. గత సంవత్సరం న్యూఢిల్లీ ప్రపంచ కప్ ఫైనల్ విజేత అలెస్సియా ఇజ్జీ (ఇటలీ)పై షూట్ ఆఫ్‌లో (21) గెలిచి ఆరవ మరియు చివరి అర్హత స్థానాన్ని పొందిన నీరు, ఆ ఎలిమినేషన్ దశలో ప్రపంచ కప్ స్టేజ్ విజేత, పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేత సిల్వానా మరియా స్టాంకో (ఇటలీ)తో సమంగా నిలిచిన తర్వాత, అధిక బిబ్ సంఖ్య కారణంగా చివరికి నిష్క్రమించింది.

ట్రాప్ కాన్మావర్డే శ్రేణిలో, నీరు 25 మరియు 24 రౌండ్లు షాట్ చేసి తన 66 (21,23,22) పాయింట్లకు జోడించింది, ఇజ్జీ సాధించిన స్కోరుకు సమానమైన 115 స్కోరును సాధించింది. ప్రీతి రాజక్ (114) కూడా ఆ రోజు 23 మరియు 25 రౌండ్లతో బాగా కోలుకుని 66 (20, 24, 22) పాయింట్లను జోడించింది, కానీ ఒకటి తక్కువ చేసి ఎనిమిదో స్థానంలో నిలిచింది. ప్రగతి దూబే (18, 18, 21, 19, 24) సరిగ్గా 100 పాయింట్లతో వెనక్కి తగ్గింది.

ఇక పురుషుల ట్రాప్‌లో జోరావర్ సింగ్ సంధు (24, 25, 24, 24, 24) తన చివరి రెండు అర్హత రౌండ్లలో ఒక్కొక్కటి పడగొట్టాడు, 121 పాయింట్లతో, చివరి రెండు స్లాట్‌ల కోసం ఇద్దరు మాజీ ఒలింపిక్ ఛాంపియన్‌లతో ఐదుమార్గాల షూట్‌ఆఫ్‌లో తన రెండవ షాట్‌ను కోల్పోయి ఔట్ అయ్యాడు. జోరావర్ సహచరులు లక్షయ్ షెరాన్ (24, 22, 24, 23, 23) మరియు జస్వీందర్ సింగ్ (23, 24, 22, 23, 24) ఒక్కొక్కరు 116 పాయింట్లు సాధించి లీడర్‌బోర్డ్‌లో మరింత వెనుకబడిపోయారు.



## వన్డే కెప్టెన్ నుండి
# రోహిత్ ఔట్!
### గిల్‌కు అప్పగించే యత్నాలు
### రేస్‌లో శ్రేయాస్ అయ్యర్



**న్యూఢిల్లీ:** భారత్ స్టార్ క్రికెటర్, ట్రబుల్ షూటర్ రోహిత్ శర్మకు మరో బిగ్ షాక్ ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. భారత్ కెప్టెన్ రోహిత్ టెస్టులకు ఇప్పటికే గుడ్ బై చెప్పాడు. దీంతో టెస్ట్ కెప్టెన్సీ బాధ్యతలు యువ ఆటగాడు శుభమన్ గిల్‌కు అప్పగించారు. అయితే వన్డే కెప్టెన్‌గా రోహిత్ శర్మ కొనసాగుతున్నాడు. కాని ఇప్పుడు వన్డే కెప్టెన్‌గా రోహిత్‌ను తప్పించి ఆ బాధ్యతలు కూడా గిల్‌కు అప్పగించే ప్రయత్నాలు జరుగుతుండటం క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారాయి. టెస్ట్ కెప్టెన్‌గా సాధించిన అద్భుతమైన విజయం, రోహిత్ స్థానంలో భారత వన్డే కెప్టెన్‌గా గిల్ పగ్గాలు తీసుకునే దిశగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. 2027 ప్రపంచ కప్, రాబోయే వన్డేలకు గిల్ నాయకత్వం వహించే అవకాశం ఉన్నట్లు సమాచారం. వరల్డ్‌కప్‌కు ముందు భారత జట్టులో మరో పెద్ద మార్పు జరగబోతుందని ఇప్పటికే భారత్ క్రికెట్ బోర్డు సంకేతాలు ఇచ్చింది. దీని పర్యవసానమే ప్రపంచ కప్‌తో పాటు, తదుపరి ఆడే వన్డేలకు గిల్ నాయకత్వం తెర ముందుకొచ్చింది. అక్టోబర్‌లో ఆస్ట్రేలియాతో జరిగే మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇది జరగొచ్చని అంటున్నారు. కాగా 2024లో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ ఐదవ టెస్ట్‌లో రోహిత్ టెస్ట్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఆ తర్వాత టెస్టులకు గుడ్ బై చెప్పాడు. అప్పటి నుంచి వన్డే కెప్టెన్ గా రోహిత్‌ను తప్పిస్తారనే ప్రచారం మొదలైంది. అయితే 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో జట్టుకు నాయకత్వం వహించేందుకు, భారత్ తరపున వన్డే, టెస్టులు ఆడటానికి రోహిత్ సంసిద్ధతను తెలిపాడు. కానీ ఇంగ్లాండ్‌తో టెస్ట్‌లకు జట్టును ప్రకటించడానికి ముందే సెలెక్టర్లు రోహిత్‌ను టెస్ట్ కెప్టెన్సీ నుండి తొలగించాలని నిర్ణయించినట్లు నివేదికలు ఉన్నాయి. దాంతో టెస్ట్ ఫార్మాట్ నుండి రోహిత్ రిటైర్మెంట్ ప్రకటించాడు. టెస్ట్‌లకు ముందు వన్డేల్లో గిల్ తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. 2023, 2024లో ఓపెనర్‌గా అద్భుతంగా రాణించి పరుగుల వరద పారించాడు. ఇక ఇంగ్లాండ్‌లో వ్యూహాత్మక నిర్ణయాలతో అతని కెప్టెన్సీ ఆకట్టుకునేలా ఉంది. సహచరులను కలుపుకుని ముందుకెళ్తున్నాడు. కాగా వన్డే కెప్టెన్ రేసులో వినిపిస్తున్న మరో పేరు శ్రేయాస్ అయ్యర్. అతను కూడా నాల్గవ స్థానంలో స్థిరపడ్డాడు. మరోవైపు ఇండియన్ ప్రీమియర్‌లో కెప్టెన్ గా అయ్యర్ చూపిన టాలెంట్ తో ఉత్తమ వైట్‌బాల్ కెప్టెన్లలో ఒకడిగా గుర్తింపు పొందాడు. ఈ నేపథ్యంలో వన్డే సిరీస్‌లకు భారత్ కెప్టెన్‌గా శ్రేయస్ పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు వెల్లడవుతోంది.



# భారత్‌కే మహిళల టి20 సిరీస్
## చివరి మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో ఇంగ్లండ్ విక్టరీ

**న్యూఢిల్లీ:** అతిథ్య ఇంగ్లంతో జరిగిన ఐదవ మరియు చివరి మహిళల టీ20లో భారత్ ఓటమి పాలైంది. ఈ మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో ఓడిపోవడంతో ఓపెనర్ షఫాలి వర్మ దూకుడు అర్ధ సెంచరీ వృథా అయింది. దీంతో 3-2 తేడాతో టీమిండియా టీ20 సిరీస్‌ను కైవసం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ ఓపెనర్ షఫాలి 41 బంతుల్లో 75 పరుగులు చేసి మహిళల జట్టును ఆదుకుంది. దీంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు నష్టానికి 167 పరుగులకు పరిమితమైంది.. వర్మ ఇన్నింగ్స్ 14వ ఓవర్లో చార్లీ డీన్ బౌలింగ్‌కు బలైపోయే ముందు 13 బౌండరీలు, ఒక సిక్స్‌తో తన ఇన్నింగ్స్‌ను ముగించింది, దీంతో భారత్ 111/5 వద్ద నిలిచింది. మిగిలిన భారత బ్యాట్స్‌మెన్లు పేలవ ప్రదర్శనతో నిరాశపరిచారు హార్మన్‌ప్రీత్ కౌర్, రిచా ఘోష్,. రాధా యాదవ్ మాత్రమే ఇన్నింగ్స్‌లో రెండంకెల మార్కును చేరుకున్నారు. వారిలో కూడా, ఘోష్ మాత్రమే మధ్యలో ఒకింత రాణించింది ఆమె 16 బంతుల్లో మూడు బౌండరీలతో 24 పరుగులు చేసింది, ఇంగ్లాండ్ బౌలర్లు భారత్ ప్లేయర్ల పరుగుల ప్రవాహాన్ని అద్భుతంగా తగ్గించారు. ఇంగ్లాండ్ తరపున డీన్ 3/23 ప్రదర్శనలో స్టార్‌గా నిలిచింది. సోఫీ ఎక్లెస్టోన్ కూడా 2/28తో ముగించింది. ఫలితంగా భారత్ 167 పరుగులు చేసింది. ఇక 168 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆతిథ్య ఇంగ్లండ్‌కు మరోసారి అద్భుతమైన ఆరంభం లభించింది, ఓపెనర్లు సోఫియా డంక్లీ మరియు డేనియల్ వ్యాట్‌హాడ్జ్ తొలి వికెట్‌కు 11 ఓవర్లలోపు 101 పరుగులు జోడించారు. డంక్లీ 30 బంతుల్లో 46 పరుగులు చేసి మూడు బౌండరీలు, ఒక సిక్సర్ తో రాణించి యాదవ్ ఎడమచేతి వాటం బౌలింగ్ లో ఔటైంది. వ్యాట్‌హాడ్జ్ 37 బంతుల్లో 56 పరుగులు చేసి తొమ్మిది బౌండరీలు సాధించింది. ఆ తర్వాత దీప్తి శర్మ ఆ ధాటికి వెంటనే వికెట్ కోల్పోయి ఇంగ్లాండ్ స్కోరు 107/2 వద్ద నిలిచింది. మైయా బౌచర్ (16), టామీ బ్యూమాంట్ (30), మరియు అమీ జోన్స్ (10) ఆతిథ్య జట్టు తమ మార్గాన్ని కోల్పోకుండా చూసుకుని ఔటయ్యారు. తదుపరి పైజ్ స్కోఫీల్డ్ మరియు ఎక్లెస్టోన్ ఇన్నింగ్స్ చివరి బంతికి ఇంగ్లాండ్ చివరికి లక్ష్యాన్ని చేరుకునేలా చేశారు. ఫలితంగా భారత్ ఈ మ్యాచ్‌లో ఓటమి పాలైనా 3-2 తేడాతో సిరీస్‌ను దక్కించుకుంది.

# యూరప్ టూర్‌లో ఇండియా మూడో విక్టరీ

**న్యూఢిల్లీ:** ఫ్రాన్స్‌ను ఓడించి, యూరప్ టూర్‌లో వరుసగా ఇండియా పురుషుల హాకీ జట్టు మూడో మ్యాచ్‌ను గెలిచింది. ఐండ్‌హోవెన్‌లోని హాకీ క్లబ్ ఆరంజేరూడ్‌లో జరిగిన పర్యటనలోని మూడో మ్యాచ్‌లో ఫ్రాన్స్‌ను 3-2 తేడాతో ఓడించింది. ఇండియా హాకీ జట్టు తరపున ఆదిత్య అర్జున్ లాల్గే, బాబీ సింగ్ ధామి గోల్స్ చేశారు. ఆదిత్య అర్జున్ లాల్గే రెండు గోల్స్ సాధించగా, అతని సహచరుడు బాబీ కూడా స్కోరు షీట్‌లోకి ప్రవేశించాడు.

ఆదిత్య అర్జున్ లాల్గే మొదటి గోల్ చేశాడు, ఆ తర్వాత అతను పిసిని కూడా గోల్‌గా మార్చాడు. బాబీ సింగ్ ధామి భారతదేశం తరపున మూడవ గోల్ సాధించగా తద్వారా విజయం సాధించారు. ఇంతలో,




ఫ్రాన్స్ తరపున, రెండు గోల్స్‌ను క్లైమెంట్ సాధించాడు. ఈ యూరప్ పర్యటనలో ఇండియా పురుషుల హాకీ జట్టు ఇంకా మొత్తం ఐదు ఆటలు ఆడాల్సి ఉంది. కెప్టెన్ సంజయ్ మరియు వైస్‌కెప్టెన్ మోయిరంగ్థెమ్ రబీచంద్ర సింగ్ నేతృత్వంలో, ఇండియా యూరప్‌లోని మూడు నగరాల్లో మొత్తం ఎనిమిది మ్యాచ్‌లు ఆడనుంది. ఇండియా ఐండ్‌హోవెన్ (నెదర్లాండ్స్)లో ఐర్లాండ్, ఫ్రాన్స్ మరియు నెదర్లాండ్స్‌తో చెరో రెండు మ్యాచ్‌లు ఆడనుండగా, వారు వరుసగా ఆమ్స్టెల్వీన్ (నెదర్లాండ్స్) మరియు ఆంట్వెర్ప్ (బెల్జియం)లో ఇంగ్లాండ్ మరియు బెల్జియంతో చెరో మ్యాచ్ ఆడనున్నారు.

జాతీయ సెటప్ భారత సీనియర్ జట్టు కోసం బలమైన ప్రతిభ గల బృందాన్ని నిర్మించాలని చూస్తున్నందున ఈ మ్యాచ్‌లు ఆటగాళ్ల లోతు మరియు సంసిద్ధతను పరీక్షిస్తాయని భావిస్తున్నారు.

# వాణిజ్యం

# ఐదేళ్లలో 20 లక్షల టన్నులకు రబ్బర్ టర్నోవర్

**న్యూఢిల్లీ, జులై 13:** భారతదేశంలో సహజ రబ్బరు (ఎన్ఆర్) వినియోగం 2030 నాటికి 20 లక్షల టన్నులకు చేరుకుంటుందని అంచనా వేయబడింది మరియు దేశీయ ఉత్పత్తిని వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని ఆటోమోటివ్ టైర్ తయారీదారుల సంఘం ఛైర్మన్ అరుణ్ మామెన్ అన్నారు. 2025లో, దేశీయ ఎన్ఆర్ ఉత్పత్తి 8.7 లక్షల టన్నులుగా ఉంది, అయితే వినియోగం 14.1 లక్షల టన్నులు, ఫలితంగా 5 లక్షల టన్నులకు పైగా లోటు ఏర్పడింది అని



ఆయన ఒక ఇంటర్వ్యూలో అన్నారు. భారత దేశంలో సహజ రబ్బరు (ఎన్ఆర్) వినియోగం 2030 నాటికి 20 లక్షల టన్నులకు చేరుకుంటుందని అంచనా వేయబడింది మరియు దేశీయ ఉత్పత్తిని వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని ఆటోమోటివ్ టైర్ తయారీదారుల సంఘం ఛైర్మన్ అరుణ్ మామెన్ అన్నారు. బహుళ రంగాలకు, ముఖ్యంగా టైర్ పరిశ్రమకు ఎన్ఆర్ యొక్క వ్యూహాత్మక ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని, దేశీయ సహజ రబ్బరు (ఎన్ఆర్) ఉత్పత్తిని వేగవంతం చేయడం జాతీయ ప్రాధాన్యత. రబ్బరు సాగు కింద అదనపు ప్రాంతాన్ని తీసుకురావడం ముఖ్యంగా ఈశాన్య ప్రాంతాలు వంటి సాంప్రదాయేతర ప్రాంతాలలో కీలకం. అనేక ఈశాన్య రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఎజెండాకు ముందస్తుగా మద్దతు ఇస్తున్నా యని ఆయన అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో తొలిసారిగా ఐఎన్ఆర్ఓఎడి (ఇండియన్ నేచురల్ రబ్బరు ఆపరేషన్స్ ఫర్ అసిస్టెడ్ డెవలప్‌మెంట్) ప్రాజెక్టును ఎటిఎంఎ సభ్య కంపెనీలు (అపోలో, సియోట్, జెకె టైర్, మరియు ఎంఆర్ఎఫ్) రబ్బరు బోర్డు ఆఫ్ ఇండియా సహకారంతో ప్రారంభించాయని శ్రీ మామెన్ ఎత్తిచూపారు. ఈ ప్రాజెక్టు ఈశాన్య మరియు పశ్చిమ బెంగాల్ అంతటా రెండు లక్షల హెక్టార్లలో కొత్త రబ్బరు తోటలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. మొదటి నాలుగు సంవత్స రాలలో 1.25 లక్షల హెక్టార్ల కు పైగా సాగులోకి వచ్చాయి. ఎటిఎంఎ సభ్య కంపెనీలు ఈ ప్రాజెక్టుకు రూ.1,100 కోట్లు కేటాయించాయని ఆయన అన్నారు. కేరళలో మాత్రమే 1 లక్ష హెక్టార్ల తో సహా దాదాపు 2 లక్షల హెక్టార్లలో ఉపయోగించని రబ్బరు తోటలను నొక్కడం ద్వారా ఉత్పత్తిని మెరుగుపరచడంలో ఒక ముఖ్యమైన అవకాశంఉంది. కేంద్ర వాణిజ్య అండ్ పరిశ్రమల మంత్రి ఇటీవల కేరళలో వాటాదారుల సంప్రదింపుల సందర్భంగా ఈ అవకాశాన్ని నొక్కి చెప్పారని శ్రీ మామెన్ అన్నారు. రబ్బరు చెట్లు నాటడం నుండి నొక్కడం వరకు దాదాపు ఆరు నుండి ఏడు సంవత్సరాలు పడుతుందని శ్రీ మామెన్ అన్నారు.

# బంగారం కొనాలా, నిఫ్టీలో ఇన్వెస్ట్ చేయాలా?

**ముంబై, జులై 13:** ఐదేళ్ల కిందట రూ.5 లక్షలు పెడితే బంగారం కొనుంటేనా, లేక నిఫ్టీ 50లో పెట్టుబడి పెట్టి ఉంటేనా.. ఏది అధిక లాభాన్ని ఇచ్చి ఉండేది? ద్రవ్యోల్బణానికి రక్షణగా బంగారాన్ని చూస్తారు. కానీ, ఈక్విటీ దీర్ఘకాలంలో అద్భుత వృద్ధిని నమోదు చేసింది. ఈ రెండింటిలో ఏది ఇన్వెస్టర్ల సొమ్మును వేగంగా పెంచిందో తెలుసుకోండి. ఐదేళ్ల కాలంలో భౌతిక బంగారం, నిఫ్టీ 50 సూచీ రెండూ 90 శాతానికి పైగా అబ్సల్యూట్ రిటర్న్ ఇచ్చాయి. ఈక్విటీలో పెట్టుబడి ఐదేళ్లలో ఎంతో మందికి సంపదను పెంచింది. ఇది ఐదేళ్ల కాలంలో స్థిరమైన వృద్ధిని సాధించింది. మీరు ఐదేళ్ల కిందట రూ.5 లక్షలు ఈ రెండింటిలో ఏది పెట్టుబడిగా పెట్టి ఉంటే అధిక లాభం వచ్చేది? పోలికల ద్వారా, ఐదేళ్లలో ఏది ఇన్వెస్టర్ల సంపదను వేగంగా పెంచిందో తెలుసుకోండి. ఐదేళ్ల క్రితం, ముంబైలో 22 క్యారెట్ల బంగారం ధరలను తీసుకుంటున్నాం. 2020 జులై 7న ముంబైలో బంగారం ధర గ్రాముకు రూ.4,626. నేడు అదే నగరంలో అదే నాణ్యత గల బంగారం ధర గ్రాముకు రూ.8,861. శాతంలో చెప్పాలంటే, ఐదేళ్ల ధరల పెరు గుదల



సామాన్యుడిని కోటీశ్వరుడిగా చేసింది. బంగారం, నిఫ్టీ 50లో పెట్టుబడులు పెట్టిన వారు అధిక రాబడిని కోరుకుంటారు. ఈ రెండు పెట్టుబడులు ఒకదానికొకటి సంబంధం లేనివి. స్వల్ప, దీర్ఘకాలంలో విభిన్న ఫలితాలు ఇవ్వగలవు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రపంచ అనిశ్చితి మధ్య బంగారం విలువ పెరిగింది. మరోవైపు, భారత్‌లో మార్కెట్ కేపిటలైజేషన్ అధికంగా గల 50 అతిపెద్ద కంపెనీలకు ప్రాతినిధ్యం వహించే నిఫ్టీ 50, ఒక సంవత్సరంలో కేవలం 4.68 శాతం రాబడిని ఇచ్చింది. కానీ 91.54 శాతం. బంగారంపై రూ.5 లక్షల పెట్టు బడి విలువ నేడు ఐదేళ్ల కిందట భౌతిక బంగారంపై పెట్టిన రూ. 5 లక్షల పెట్టుబడి అంచనా విలువ నేడు రూ. 9,57,700. నిఫ్టీ 50 సూచీ పనితీరు 5ఏళ్లలో నిఫ్టీ 50 సూచీ 25,461.30 వద్ద ముగిసింది. ఐదేళ్లలో సూచీ వృద్ధి 135.76 శాతం. నిఫ్టీలో రూ. 5 లక్షల పెట్టుబడి విలువ ఐదేళ్ల కాలంలో 135.76 శాతం అబ్సల్యూట్ రిటర్న్ తో, నిఫ్టీ 50 సూచీలో పెట్టిన రూ. 5 లక్షల పెట్టుబడి రూ.11,78,800గా మారింది. ఒక సంవత్సర కాలంలో నిఫ్టీ 50 సూచీని బంగారం అధిగమించినప్పటికీ, ఐదేళ్ల కాలంలో మాత్రం నిఫ్టీ50 రాబడి కంటే బంగారం బాగా వెనుకబడి ఉందని ఇది చూపిస్తుంది.

# ఆర్థిక భద్రతకు వెండి ఆసరా..

**ముంబై, జులై 13:** మీరు నాణేలు, కడ్డీలు లేదా ఆభరణాల రూపంలో వెండిని కొనుగోలు చేయవచ్చు. వెండి నాణేలు విస్తృతంగా లభిస్తాయి, సులభంగా నిల్వ చేయవచ్చు లేదా విక్రయించవచ్చు. వెండి కడ్డీలు వివిధ పరిమాణాల్లో వస్తాయి, గ్రాముకు మెరుగైన విలువను అందిస్తాయి. మీరు చాలా సంవత్సరాలు వెండిని కొని దాచుకోవాలని అనుకుంటే దానిని సురక్షితమైన లాకర్ లేదా బ్యాంకు వాల్ట్‌లో నిల్వ చేయడం మంచిది. సిల్వర్ ఇటిఎఫ్‌లు అంటే వెండిని భౌతికంగా సొంతం చేసుకోకుండానే పెట్టుబడి పెట్టవచ్చు. ఈ ఫండ్స్ వెండి మార్కెట్ ధరను ట్రాక్ చేస్తాయి. సాధారణ షేర్ల వలె స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో వర్తకం అవుతాయి. భారతదేశంలో, అనేక మ్యూచువల్ ఫండ్ సంస్థలు సిల్వర్ ఇటిఎఫ్‌లను అందిస్తున్నాయి. ఇది చిన్న మొత్తాలతో ఇన్వెస్టర్లు పెట్టుబడి పెట్టడాన్ని సులభతరం చేస్తుంది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లతో, మీరు ఇప్పుడు ఆన్‌లైన్‌లో చిన్న మొత్తాల్లో (ఒక గ్రాము కూడా) వెండిని కొనవచ్చు. మీ వెండిని విక్రేత సురక్షితంగా నిల్వ చేస్తారు. మీరు తర్వాత విక్రయించడానికి లేదా భౌతిక డెలివరీ అడగడానికి ఎంచుకోవచ్చు. ఇది సౌకర్యవంతంగా ఉంటుంది, కాగిత రహిత పెట్టుబడిని ఇష్టపడేవారికి అనుకూలంగా ఉంటుంది. వెండిని తవ్వే కంపెనీలలో పెట్టుబడి పెట్టడం అధిక రాబడిని ఇవ్వగలదు, కానీ అధిక నష్టాలు ఉంటాయి. ఈ స్టాక్స్ వెండి ధరలు మాత్రమేకాకుండా, కంపెనీ పనితీరు, మార్కెట్ పోకడలు, నిర్వహణ సమస్యల వల్ల ప్రభావితమవుతాయి. అనుభవజ్ఞులైన ఇన్వెస్టర్లకు, సిల్వర్ ఫ్యూచర్స్ మరో ఎంపిక. ఇవి నిర్ణీత ధరకు తర్వాత తేదీలో వెండిని కొనడానికి లేదా విక్రయించడానికి ఒప్పందాలు. అయితే, వీటికి లోతైన మార్కెట్ అవగాహన, అధిక స్థాయి నష్టం ఉంటాయి. కరెన్సీ విలువ తగ్గినప్పుడు వెండి మీ సంపదను



రక్షిస్తుంది. బంగారం కన్నా వెండి చౌక. ఎక్కువ మందికి అందుబాటులో ఉంటుంది. ఎలక్ట్రానిక్స్, సోలార్ ప్యానెల్స్ వంటి పరిశ్రమల్లో దీనిని ఉపయోగిస్తారు. ఇది దీర్ఘకాల డిమాండ్‌ను పెంచుతుంది. స్టాక్స్, బాండ్లు లేదా రియల్ ఎస్టేట్ పోర్ట్‌ఫోలియోకు వెండిని చేర్చడం సమతుల్యతను ఇస్తుంది. సులభంగా వెండిని ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో సులభంగా కొనవచ్చు, అమ్మవచ్చు. వెండిలో పెట్టుబడి పెట్టడం దీర్ఘకాలం పాటు మీ సంపదను పెంచుకోవడానికి, భద్రపరచుకోవడానికి ఆచరణాత్మక మార్గం.

# ఐఐఎఫ్ఎల్ హోంఫైనాన్స్‌కు రూ.858 కోట్ల రుణం

**న్యూఢిల్లీ, జూలై 13:** ఐఐఎఫ్ఎల్ హోం ఫైనాన్స్ కంపెనీ తాజాగా 100 మిలియన్ డాలర్ల నిధులను సేకరించింది. ఏసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్‌బ్యాంకు (ఎఐఐబి)నుంచి భారత కరెన్సీలోసుమారు 858 కోట్లమేర రుణసాయం సేకరించింది. అందుబాటుధరల్లో హౌసింగ్‌ఫైనాన్స్‌చేసే సంస్థ ఆర్థికంగా వెనుకబడిన తరగతులు, అల్పాదాయ వర్గాలకు ఇళ్లను నిర్మించి అందిస్తోంది. గ్రీన్‌బిల్డింగ్ ప్రమాణాలను అనుసరించి హౌసింగ్‌రంగంలో కంపెనీ మరింత ముందుకువెళుతోంది. ఇడబ్ల్యుఎస్, ఎల్ఐజి సెగ్మెంట్లలో ఇళ్లను నిర్మించి విక్రయిస్తుంది. పట్టణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో కూడా ఈ ఇళ్లనిర్మాణం చేపడుతోంది. సుస్థిర వాతావరణ పరిరక్షణ లక్ష్యాలు చేరుకుంటూనే భారత్‌లో ఒకమోస్తరు పట్టణాలు, అర్బన్‌ప్రాంతాల్లో మరింత విస్తరించేందుకు ఈ నిధులు వినియోగిస్తామని కంపెనీ ప్రకటించింది. ఎఐఐబి డైరెక్టర్ జనరల్ గ్రెరీ లియూ మాట్లాడుతూ, ఐఐఎఫ్ఎల్, హెచ్ఎఫ్ఎల్, ఎఐఐబిలు భాగస్వామ్యంతో అందుబాటు ధరల్లో అందరికీ పక్కాగృహాలు అందించేందుకు మరింత వీలు కలుగుతుందని, అలాగే అల్పాదాయ వర్గాలకు పక్కాఇళ్లను కూడా అందుబాటు లోకి తెచ్చేవిధంగా ఐఐఎఫ్ఎల్ ముందుకు వెళుతుందని ధీమా వ్యక్తంచేసారు. భారత్‌లోని 18 రాష్ట్రాల్లో 376 శాఖలు పనిచేస్తున్నాయి. ఐఐఎఫ్ఎల్, హెచ్ఎఫ్ఎల్ సంస్థలు ఇప్పటి వరకూ అందుబాటులోకి రాని కేంద్రాలు, పట్టణాలు సెమీ అర్బన్‌ప్రాంతాలపై ఫోకస్ పెంచింది.



# రెండు బ్యాంకులపై ఆర్‌బిఐ చర్యలు!

**ముంబై, జులై 12:** దేశంలో అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకు అయిన హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకుపై రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా చర్యలు చేపట్టింది. రూ.4.88 లక్షలు జరిమానా విధించినట్లు ప్రకటించింది. తన క్లయింట్‌కు టర్మ్ లోన్ మంజూరు చేసేటప్పుడు 'మాస్టర్ డైరెక్షన్-ఫారిన్ ఇన్వెస్ట్‌మెంట్ ఇన్ ఇండియా' నిబంధనలను విస్మరించిందని, అందుకు గానూ విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) సెక్షన్ 11 నిబంధనల ప్రకారం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకుపై జరిమానా విధించినట్లు రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఒక ప్రకటనలో తెలిపింది. నిబంధనల ఉల్లంఘనలపై ఆర్‌బిఐ షోకాజ్ నోటీసు జారీ చేయగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు లిఖిత పూర్వక సమాధానం ఇచ్చిందని, మౌఖిక సమర్పణలో కూడా చేసిందని రిజర్వ్ బ్యాంకు తెలిపింది. కేసు వాస్తవాలు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు స్పందనను పరిగణనలోకి తీసుకుని జరిమానా విధించాలని ఆర్‌బిఐ నిర్ణయించింది.

**శ్రీరామ్ ఫైనాన్స్‌కూ పెనాల్టీ** డిజిటల్ లెండింగ్ సంబంధిత నిబంధనలను పాటించ నందుకు బ్యాంకింగేతర ఫైనాన్స్ కార్పొరేషన్ (ఎన్‌బిఎఫ్‌సి) అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌పైనా రిజర్వ్ బ్యాంకు జరిమానా విధించింది. ఆర్‌బిఐ జారీ చేసిన రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా (డిజిటల్ లెండింగ్) ఆదేశాలు, 2025 లోని కొన్ని నిబంధనలను పాటించనందుకు ఆర్‌బిఐ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌పై రూ.2.70 లక్షల జరిమానా విధించింది.




2024 మార్చి 31 నాటికి శ్రీరామ్ ఫైనాన్స్ ఆర్థిక పరిస్థితికి సంబంధించి ఆర్‌బిఐ చట్టబద్ధమైన తనిఖీని నిర్వహించింది. ఆర్‌బిఐ ఆదేశాలను పాటించకపోవడం, సంబంధిత ఉత్తరప్రత్యుత్తరాల ఆధారంగా, ఆ ఆదేశాలను పాటించడంలో విఫలమైనందుకు జరిమానా ఎందుకు విధించకూడదో కారణం చూపాలని కంపెనీకి నోటీసులు జారీ చేసినట్లు బ్యాంకు తెలిపింది. రుణగ్రహీతలు నేరుగా రుణ చెల్లింపులను కంపెనీ ఖాతాలో జమ చేయడానికి బదులుగా థర్డ్ పార్టీ ఖాతా ద్వారా రుణ చెల్లింపులను కంపెనీ మళ్లించిందని ఆర్‌బిఐ తన తనిఖీలో గుర్తించింది. దీంతో శ్రీరామ్ ఫైనాన్స్‌కు జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీచేసినట్లు రిజర్వ్ బ్యాంకు తెలిపింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.